సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 327

శుక్రవారం 9-8-2024



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సాక్షి ఫ్యామిలీ II
బెంగళూరు
శుక్రవారం ॥ 9-8-2024

● అభిప్రాయం



'అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలాహ్యారిస్ గెలుస్తుంది. ఆమె గెలుపు మహిళాశక్తిని నిరూపిస్తుంది' అంటున్నారు **లత మంగిపూడి.** అమెరికాలోని న్యూహ్యాంప్‌షైర్‌కు డెమోక్రటిక్ పార్టీ లెజిస్లేటర్‌గా ఉన్న లత ప్రస్తుతం కమలా హ్యారిస్ గెలుపు కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారు. అమెరికా మహిళల గురించి స్త్రీలకు ఉండాల్సిన దృక్పథం గురించి ఆమె తన అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

హ్యారిస్ గెలిచి మహిళాశక్తిని గెలిపిస్తుంది

'ఒక విధంగా చెప్పాలంటే అమెరికాలో ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. అమెరికన్స్ మరోసారి ట్రంప్ నియంతృత్వ పాలనను అంగీకరించేందుకు ఏ మాత్రం సిద్ధంగా లేరు. కమలా హ్యారిస్ గెలిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ. అందుకే 'సేవ్ అవర్ డెమోక్రసీ' అనే నినాదంతో మేం ప్రజల్లోకి వెళ్తున్నాం. కమలా హ్యారిస్ అమెరికా మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడతారని బలంగా నమ్ముతున్నాను' అన్నారు లత మంగిపూడి.

మైసూరుకు చెందిన లత రాజమండ్రికి చెందిన కృష్ణ మంగిపూడిని వివాహం చేసుకోవడంతో ఆంధ్రప్రదేశ్ వాసి అయ్యారు. 1985లో యూఎస్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అనంతరం యూఎస్ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ న్యూహ్యాంప్‌షైర్ చాప్టర్‌కు 2006 నుంచి 2013



వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగారు. అలా ఆమె రాజకీయ జీవితం మొదలైంది. అప్పటి అధ్యక్షుడు ఒబామా, హిల్లరి క్లింటన్ వంటి ప్రముఖులతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత 2013 నుంచి ఇప్పటివరకు నాషువా నుంచి లెజిస్లేటర్‌గా గెలుపొందుతూనే ఉన్నారు. కమలాహ్యారిస్ గెలుపు కోసం హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తూ పర్యటనలు చేస్తున్నారు.

స్త్రీల హక్కులకు విఘాతం

'ప్రపంచంలో ఏ మహిళకైనా తన శరీరంపై తనకు పూర్తి హక్కు ఉండాలి. ఆమె తన ఆరోగ్యాన్ని కాపాడుకొనే అవకాశం ఉండాలి కదా. కానీ అమెరికాలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల్ని కనాలా, వద్దా అనే అత్యంత కీలకమైన అంశంపైన మహిళలు తమ హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గర్భం దాల్చిన తరువాత తప్పనిసరిగా బిడ్డను కనాల్సిందే. కానీ బిడ్డను కనేందుకు ఆమె మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యరీత్యా సంసిద్ధంగా ఉండాలి. ఇది బిడ్డను కనాల్సిన తల్లి, డాక్టర్ నిర్ణయించవలసిన విషయం. ఇందులో ప్రభుత్వ జోక్యం అవసరం లేదు. కానీ బలవంతంగానైనా పిల్లలను కనాల్సిందేననడం సరి కాదు. అత్యాచారానికి గురైన వారు, లైంగిక దాడుల వల్ల గర్భవతులైన వాళ్లు కూడా బిడ్డల్ని కనాలంటే ఎలా? అమెరికా మహిళలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న ఈ అంశంపై డెమోక్రటిక్ పార్టీ స్పష్టమైన వైఖరిని కలిగి ఉంది. మా పార్టీ గెలిస్తేనే మహిళల హక్కులకు రక్షణ లభిస్తుంది' అన్నారామె.

ఇంకా వివక్షేనా....

'విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు లభించడం లేదు. స్త్రీలు తీవ్ర నిర్లక్ష్యానికి, వివక్షకు గురవుతున్నారు. చివరకు కొన్నిచోట్ల ఓటు హక్కును కూడా వినియోగించుకోలేని పరిస్థితి. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకొనే వాతావరణానికి రిపబ్లికన్ పార్టీ విఘాతం కలిగిస్తోంది. ముఖ్యంగా కొత్తగా ఓటుహక్కును పొందిన వాళ్లు, ఇమ్మిగ్రెంట్స్, కొన్నిచోట్ల మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకొనే అవకాశం లేదు. ఆ పార్టీ మరోసారి గెలిస్తే ఓటుహక్కు మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే ఈసారి మహిళా గెలుపు ప్రజాస్వామిక గెలుపు' అని ముగించారామె.

- పగిడిపాల ఆంజనేయులు
సాక్షి, హైదరాబాద్

మీరూ మీ వార్డ్రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్రోబ్ శీర్షికన ప్రచురిస్తాం. మా చిరునామా: మై వార్డ్‌రోబ్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. sakshifamily3@gmail.com

మై వార్డ్‌రోబ్


ప్రతిమ రాపర్తి

ధోతీ కట్టు
మూడు రంగుల్లో ముగ్గు

హస్త కళలపై ఇష్టంతో చిత్రలేఖనం, బ్లాక్ ప్రింటింగ్ నేర్చుకుంది. చదివింది ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్. చేనేత కారులకు అండగా ఉండాలని చర్ఖా సంస్థను ప్రారంభించింది. మువ్వన్నెల జెండా రంగులు... మధ్యన మన సంస్కృతికి చిహ్నమైన ముగ్గును చిత్రించి, చేనేత వస్త్రంతో కండువాను డిజైన్ చేసింది. పేటెంట్ హక్కునూ పొందింది. తన హ్యాండ్లూమ్ చీరలను ధోతీ కట్టులా డిజైన్ చేసి, వాటినే తన రోజువారీ డ్రెస్‌గా మార్చుకుంది. సికింద్రాబాద్ మారేడుపల్లిలో ఉంటున్న ప్రతిమ రాపర్తి తన వార్డ్‌రోబ్‌ను సరికొత్తగా మార్చుకుంది.

'ప్రపంచానికి కాటన్ దుస్తులను మన దేశమే పరిచయం చేసింది. మనదైన సంస్కృతిని మనమే పరిచయం చేసుకోవాలి. అలాగే మనల్ని అందరూ గుర్తించాలి. ఈ ఆలోచనే చేనేతలకు దగ్గరగా ఉండేలా చేసింది. 2018లో 'చర్ఖా' పేరుతో చేనేతలకు మద్దతుగా నిలవాలని సంస్థను ప్రారంభించాను.

ట్రై కలర్స్‌లో ముగ్గు

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ట్రై కలర్స్ డ్రెస్ ధరించి వెళ్లడానికి చాలా కష్టపడేదాన్ని. ఆరెంజ్, బ్లూ, గ్రీన్ కలర్స్ ఉండేలా డ్రెస్సింగ్ చేసుకునేదాన్ని. అలా కాకుండా ఆ రోజుకి ఏదైనా ప్రత్యేకమైన యునిఫామ్ ఉంటే బాగుంటుంది అనుకున్నాను. చేనేత క్లాత్‌ను ఎంపిక చేసుకొని, అంచుగా వాటికి నేచురల్ కలర్స్‌ని జత చేశాను. మూడు రంగుల మధ్యలో ఉండే ధర్మచక్ర మన అడ్మినిస్ట్రేషన్‌కి, విజడమ్‌కి ప్రతీక. ధర్మచక్రను మన డ్రెస్సుల్లో వాడకూడదని, దాని బదులుగా ముగ్గు డిజైన్ చేశాను. ముగ్గు అనేది మన సంస్కృతికి, స్త్రీల కళా హృదయానికి ప్రతీక.

25 చుక్కలు...

మధ్య చుక్క ఈ డ్రెస్ ఎవరు ధరిస్తారో వారికి ప్రతీక. మిగతా 24 చుక్కలు మన పూర్వీకులు, కాలానికి ప్రతీకగా అనుకోవచ్చు. అలాగే, ఆ చుక్కలన్నీ కలుపుతూ వెళితే మన సమాజ వృద్ధికి, రాబోయే తరానికి సూచికగానూ ఉంటాయి. ఈ డిజైన్‌ని కండువా, శారీ, ధోతీ, ఘాఘ్రా చోలీకి తీసుకున్నాను. దీనికి పేటెంట్ రైట్ కూడా తీసుకున్నాను. ఈ డిజైన్ కండువాను ఎవరైనా ధరించవచ్చు.

చేనేత చీరలతో ధోతీ కట్టు

నా దగ్గర ఎక్కువగా ఉన్న హ్యాండ్లూమ్ చీరలని ప్రత్యేక కట్టుగా మార్చుకోవాలనుకున్నాను. సౌకర్యంగా ఉండేలా చీరలను ధోతీగా కన్వర్ట్ చేసుకున్నాను. సెల్, మనీ, కార్డ్స్ పెట్టుకోవడానికి ఈ ధోతీకి పాకెట్స్ కూడా ఉంటాయి. పూర్వం రోజుల్లో గోచీకట్టు చీరలను వాడేవారు. ఆ డిజైన్ ప్రతిఫలించేలా నాకు నేను కొత్తగా డిజైన్ చేసుకున్న డ్రెస్సులివి. టూర్లకు, బయటకు ఎక్కడకు వెళ్లినా ఇలాంటి డ్రెస్‌తోనే వెళతాను.

నాకు నేను ప్రత్యేకంగా ఉండాలనుకుంటాను. వీవర్స్, టైలర్స్, బ్లాక్‌ప్రింట్, హ్యాండ్‌క్రాఫ్ట్స్ వారితో కలిసి వర్క్ చేస్తాను. ఇకో ఫ్రెండ్లీ హ్యాండీ క్రాఫ్ట్, టైలరింగ్, పెయింటింగ్... వంటివి గృహిణులకు నేర్పిస్తుంటాను'' అని వివరించారు ప్రతిమ.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



సింహం మెడలో మేక...

● ఒలింపిక్ లెజెండ్

విమర్శలకు చాలా మంది కుంగిపోతుంటారు. ఆమెరికన్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్ అయిన సిమోన్ అరియన్నే బైల్స్ ఓవెన్స్ మాత్రం విమర్శలనే సవాల్‌గా తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇటీవల జరిగిన ఆల్‌రౌండ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. దీంతో తొమ్మిది ఒలింపిక్ పతకాలు, 30 ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు ఆమె ఖాతాలో చేరి, ప్రపంచంలోనే అత్యధిక ఒలింపిక్ పతకాలు సాధించిన ఐదవ మహిళా ఒలింపిక్ జిమ్నాస్ట్‌గా పేరొందిందామె. 27 ఏళ్ల సిమోన్ విజయం సాధించిన వెంటనే తన మెడలో మేక లాకెట్టుతో ఉన్న చైన్‌ను బయటకు తీసి అందరికీ చూపించింది. 'చాలా మంది నన్ను 'గోట్' అని పిలుస్తుంటారు. నేను దానిని నెగిటివ్‌గా తీసుకోలేదు. ఈ గోట్‌లో కూడా ప్రత్యేకత ఉంది, అది ప్రపంచానికి చూపించాలనుకున్నాను. అందుకే 'స్టఫ్డ్ గోట్'ను హారంగా మెడలో ధరించాను' అంటూ గోట్ లాకెట్‌ను చేత్తో పట్టుకొని చూపిస్తూ అంది సిమోన్ బైల్స్.

తొమ్మిదవ ఒలింపిక్ పతకాన్ని, ఆరవ స్వర్ణాన్ని సంపాదించినందుకు సిమోన్ ప్రదర్శనలో అభినందనలు దక్కాయి. అయితే, 2021లో జరిగిన టోక్యో గేమ్స్ నుండి చివరి నిమిషంలో వైదొలగడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె చేష్టల కారణంగా మరొక క్రీడాకారిణికి అవకాశం లేకుండా పోయిందని, జాత్యహంకారం, సెక్సిస్ట్, ట్రాన్స్‌ఫోబిక్, డ్రగ్ చీట్... అని ఎంతో మంది చేత నాడు విమర్శలను ఎదుర్కొంది. దీంతో కుటుంబంలో వచ్చిన సమస్యలు, మానసిక సమస్యలతో పోటీల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. అయినా ఆమెపైన విమర్శలు ఆగలేదు. ఆ సందర్భంలో ఆమెను 'గోట్' అంటూ హేళన చేశారు. అదే ఆమె ఇప్పుడు తన బలంగా మార్చుకుని, దాంతోనే పతకాన్ని సాధించ గలిగింది.

సినిమా


● శోభిత, నాగార్జున, నాగచైతన్య

ట్రిపుల్ ఎయిట్... ఎంగేజ్డ్

''నా తనయుడు నాగచైతన్య నిశ్చితార్థం శోభితా ధూళిపాళ్లతో ఈ రోజు (గురువారం) ఉదయం 9 గంటల 42 నిమిషాలకు జరిగిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. ఈ నూతన జంటకు శుభాకాంక్షలు. ప్రేమ, సంతోషాలతో వీరి జీవితాలు నిండిపోవాలని కోరుకుంటున్నాను. 8.8.8.. (ఎనిమిదో తేదీ... ఎనిమిదో నెల... 2024ని కూడితే ఎనిమిది) అనంతమైన ప్రేమకు నాంది.. శోభితా, నాగచైతన్య'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేసి, నాగచైతన్య–శోభితల నిశ్చితార్థం ఫొటోలను షేర్ చేశారు అక్కినేని నాగార్జున. అక్కినేని నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం గురువారం హైదరాబాద్‌లోని అక్కినేని నాగార్జున ఇంట్లో జరిగింది. కాగా చైతన్య–శోభిత ప్రేమలో ఉన్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అడివి శేష్ నటించిన ఓ చిత్రానికి సంబంధించిన హౌస్‌పార్టీలో నాగచైతన్య, శోభితాలకు తొలిసారి పరిచయం ఏర్పడిందని, అది ప్రేమగా మారిందని టాక్. 'జోష్'తో హీరోగా ప్రయాణం మొదలుపెట్టి, ఇప్పుడు చేస్తున్న 'తండేల్' వరకూ నాగచైతన్య కెరీర్ గురించి అందరికీ తెలిసిందే. ఇక శోభితా ధూళిపాళ్ల విషయానికొస్తే... ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో వేణుగోపాల్ రావు, శాంతాకామాక్షి దంపతులకు జన్మించారు. ఆమెది బ్రాహ్మణ కుటుంబం. 2013లో ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ విజేతగా నిలిచారామె. ఆ తర్వాత 'రామన్ రాఘవ్ 2.ఓ'తో నటిగా శోభిత ప్రయాణం హిందీలో మొదలైంది. 'బార్డ్ ఆఫ్ బ్లడ్, మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్' వంటి హిందీ వెబ్ సిరీస్‌ల ద్వారానూ పాపులర్ అయ్యారు. 2018లో వచ్చిన అడివి శేష్ హిట్ ఫిల్మ్ 'గూఢచారి'లో ఓ లీడ్ రోల్‌లో నటించారు శోభిత. 'మేజర్'లోనూ ఓ ముఖ్య పాత్ర చేశారు. హాలీవుడ్ ఫిల్మ్ 'మంకీ మ్యాన్'లోనూ నటించారు.

ఇక 2017లో నాగచైతన్య–సమంత పెళ్లి చేసుకున్న విషయం, 2021లో విడిపోయిన విషయం తెలిసిందే.



హీరో చిరంజీవి గురువారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ని కలిసి కోటి రూపాయల చెక్కును అందించారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో వరదల వల్ల నష్టపోయిన వారికి చేయూతనిచ్చేందుకు హీరోలు చిరంజీవి, రామ్‌చరణ్ కోటి రూపాయలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా కేరళ ముఖ్యమంత్రి విజయన్‌ని కలిసి చిరంజీవి రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు.


● సంజయ్ దత్, రామ్

డబుల్ ఇస్మార్ట్‌ని ఎంజాయ్ చేస్తారు
- సంజయ్ దత్

''తెలుగు సినిమా డైనమిక్స్‌ని మార్చిన డైరెక్టర్ పూరి జగన్నాథ్ సార్. 'డబుల్ ఇస్మార్ట్'లో నన్ను భాగం చేసి, బిగ్ బుల్‌గా చూపిస్తున్న ఆయనకి థ్యాంక్స్. రామ్‌తో పని చేయడంతో చాలా మజా వచ్చింది. 'డబుల్ ఇస్మార్ట్'ని ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు'' అని బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ అన్నారు. రామ్ పోతినేని, కావ్యా థాపర్ జంటగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 15న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ మూవీలోని 'బిగ్ బుల్...' అంటూ సాగే పాటని ముంబైలో జరిగిన ఈవెంట్‌లో విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం అందించిన ఈ పాటని పృథ్వీ చం, సంజన కల్మంజే పాడారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ– ''డబుల్ ఇస్మార్ట్'తో ఉత్తరాది ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. సంజయ్ దత్‌గారితో పని చేయడం గౌరవంగా ఉంది'' అని పేర్కొన్నారు. ''సంజయ్ బాబాకి నేను బిగ్ ఫ్యాన్‌ని. ఆయన 'డబుల్ ఇస్మార్ట్' చేయడం చాలా హ్యాపీగా ఉంది'' అని పూరి జగన్నాథ్ చెప్పారు. ఈ వేడుకలో ఛార్మీ, కావ్యా థాపర్, పూరి కనెక్ట్స్ సీఈవో విష్, నటుడు అలీ మాట్లాడారు.


● యశ్

టాక్సిక్ ఆరంభం

యశ్ హీరోగా నటించనున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వెంకట్ కె. నారాయణ, యశ్ ఈ సినిమాను నిర్మించనున్నారు. గురువారం బెంగళూరులో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో మొదలైంది. ''8.8.8న ఈ సినిమాను ఆరంభించాం. న్యూమరాలజీ ప్రకారం ఇది యశ్ బర్త్ డే (జనవరి 8)ని కూడా సూచిస్తుంది. పవర్‌ఫుల్ అండ్ ఎమోషనల్ కథతో 'టాక్సిక్' తెరకెక్కనుంది. ఈ ప్రాజెక్ట్‌లో స్టార్ నటీనటులు నటిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.


● సాంచి, అంజన్, తనికెళ్ల భరణి

ఫ్యామిలీ దిల్ రెడ్డి

అంజన్ కస్తూరి, సాంచి బార్తి జంటగా నటిస్తున్న చిత్రం 'దిల్ రెడ్డి'. స్వీయ దర్శకత్వంలో అమ్మగారి రామరాజు (రమేష్) నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి 'త్రినయని' ఫేమ్ నటుడు భరద్వాజ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు తనికెళ్ల భరణి క్లాప్ కొట్టారు. అమ్మగారి రామరాజు మాట్లాడుతూ– ''లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది'' అన్నారు. ''కుటుంబం అంతా కలిసి చూసేలా మా మూవీ ఉంటుంది'' అని అంజన్ కస్తూరి చెప్పారు. ''ఈ సినిమాలో కీలక పాత్ర చేస్తున్నాను'' అన్నారు భరద్వాజ్. తనికెళ్ల భరణి, అలీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామచంద్ర రావ్, సంగీతం: షారుఖ్ షేక్.

బన్వర్ ఈజ్ బ్యాక్


● ఫాహద్ ఫాజిల్

ఒక చేతిలో తుపాకీ, మరో చేతిలో గొడ్డలి పట్టుకుని బన్వర్ సింగ్ షెకావత్ చాలా కోపంగా ఉన్నాడు. మరి.. ఆయన కోపం ఏ స్థాయిలో ఉంటుందో ఈ డిసెంబరు 6న థియేటర్స్‌లో చూడొచ్చు. ఎందుకు అంటే 'పుష్ప: ది రూల్' సినిమా ఆ రోజున థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న 'పుష్ప' ఫ్రాంచైజీలోని మలి భాగం 'పుష్ప: ది రూల్'. ఈ చిత్రంలో పుష్ప పాత్రలో అల్లు అర్జున్, ఐపీఎస్ ఆఫీసర్ బన్వర్ సింగ్ షెకావత్ పాత్రలో ఫాహద్ ఫాజిల్, శ్రీవల్లి పాత్రలో హీరోయిన్ రష్మికా మందన్నా నటించారు. గురువారం (ఆగస్టు 8) ఫాహద్ ఫాజిల్ బర్త్ డే. ఈ సందర్భంగా బన్వర్ ఈజ్ బ్యాక్ అంటూ 'పుష్ప: ది రూల్' సినిమాలో ఫాహద్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.


● ఆకాశ్ జగన్నాథ్, ఎంఎస్‌వీ సాగర్

ఐదు జంటల ప్రేమకథ

''కాలం రాసిన కథలు' మూవీ ట్రైలర్ చాలా బాగుంది. ముఖ్యంగా ఐదు జంటల మధ్య ఉన్న లవ్ కంటెంట్, డైలాగ్స్ ఆసక్తిగా ఉన్నాయి. ఈ సినిమా యూత్‌ని ఆకట్టుకుని మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని హీరో ఆకాశ్ జగన్నాథ్ అన్నారు. ఎంఎస్‌వీ సాగర్, శ్రుతీ శంకర్, వికాస్, విహారికా చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎంఎస్‌వీ సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని ఆకాశ్ జగన్నాథ్ లాంచ్ చేశారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది'' అని ఎంఎస్‌వీ సాగర్ చెప్పారు.



ఈ కథకు కనెక్ట్ అవుతారు
- విజయ్ శంకర్




''నేటి తరం ప్రేమికులంతా 'పాగల్ వర్సెస్ కాదల్' కథకు కనెక్ట్ అవుతారు. సినిమా చూశాక మా జీవితంలో ఇలాంటి సందర్భం ఒకటి వచ్చిందని ప్రతి ప్రేమికుడికి అనిపిస్తుంది'' అని విజయ్ శంకర్ అన్నారు. రాజేశ్ ముదునూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పాగల్ వర్సెస్ కాదల్'. విజయ్ శంకర్, విషిక జంటగా నటించారు. పద్మాన మన్మథ రావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ శంకర్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో కార్తీక్ అనే అమాయకుడైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాత్ర చేశాను. కార్తీక్ ఓ గయ్యాళి అమ్మాయిని ప్రేమిస్తాడు. భిన్న వ్యక్తిత్వాలున్న లవర్స్ మధ్య బంధం ఎలా సాగింది? అనేది కథ'' అన్నారు.

ఎలాంటి పాత్రలు చేయడానికైనా రెడీ

''మంచి కథలకే తొలి ప్రాధాన్యం ఇస్తా. కథ బాగుండి నా పాత్రకి ప్రాధాన్యం ఉంటే మిగతా అంశాలను పట్టించుకోను. చిన్న పాత్ర, చిన్న హీరో అని కూడా ఆలోచించను. మెగా ఫ్యామిలీ నుంచి వచ్చాననే ఆలోచన వల్లో.. వేరే ఏదైనా కారణమేమో తెలియదు కానీ తెలుగు దర్శకులు ఎక్కువగా నన్ను సంప్రదించడం లేదు. అయితే నాకు సౌకర్యంగా అనిపిస్తే ఎలాంటి పాత్రలు చేయడానికైనా రెడీ'' అని నటి, నిర్మాత నిహారిక కొణిదెల అన్నారు. నూతన నటీనటులతో యదు వంశీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల సమర్పణలో శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిహారిక కొణిదెల చెప్పిన విశేషాలు.

● వెబ్ సిరీస్, షార్ట్ ఫిల్మ్స్ నిర్మించిన నేను ఫీచర్ ఫిల్మ్ చేయాలనుకున్న టైమ్‌లో అంకిత్ ద్వారా 'కమిటీ కుర్రోళ్ళు' కథ నా వద్దకు వచ్చింది. ఈ కథ నాకు, మా నాన్నకి బాగా నచ్చింది. సిటీలో పుట్టి పెరిగిన నేను జాతర అనుభూతిని పొందలేదు. ఈ కథలో నాకు కళ్లకు కట్టినట్టుగా వంశీ చూపించాడు. అందుకే ఈ కథతో ఎలాగైనా సినిమా నిర్మించాలని ఫిక్స్ అయి, తీశాను. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే జాతర చుట్టూ ఈ కథను రాశాడు వంశీ. మూడు తరాలను చూపించేలా ఈ కథ ఉంటుంది. నాకు నటించడమే ఇష్టం. నిర్మాత కావాలని ఎప్పుడూ అనుకోలేదు. 'ముద్ద పప్పు ఆవకాయ్' టైమ్ నుంచి అలా జరిగిపోయిందంతే.

● ప్రతిభ ఒక్కటే కాదు... క్రమశిక్షణ ఉంటేనే ఇండస్ట్రీలో ఎదుగుతామని చిరంజీవిగారు చెబుతుంటారు. ఆ క్రమశిక్షణ వంశీలో చూశాను. ఈ చిత్రంలోని పదకొండు మంది అబ్బాయిల పాత్రల్లో నన్ను నేను ఊహించుకున్నాను. ప్రతి ప్రేక్షకుడు ఏదో ఒక క్యారెక్టర్‌తో ప్రయాణం చేస్తాడు. ● నా గురించి బయటివారు చేసే విమర్శలు, పొగడ్తల్ని పట్టించుకోను. నా గురించి నిజాయతీగా ఉన్నది ఉన్నట్లు (పొగడ్త అయినా, విమర్శ అయినా) చెప్పేది మా అమ్మా నాన్న (పద్మజ, నాగబాబు), అన్నయ్యే (వరుణ్ తేజ్). 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాని మా అన్నయ్య, వదిన (లావణ్య త్రిపాఠి) చూశారు.. వాళ్లకి బాగా నచ్చింది. ప్రస్తుతం ఓ తమిళ చిత్రంలో నటిస్తున్నాను. అలాగే తెలుగులో ఓ వెబ్ సిరీస్ చేశాను.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 327

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం

బెజవాడ నడిబొడ్డున అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకల చీకటి దాడి

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతో భారీ విగ్రహం ధ్వంసానికి తరలివచ్చిన ఎల్లోగ్యాంగ్

పోలీసుల సాక్షిగా అందరినీ బయటకు పంపేసి.. లైట్లు ఆర్పేసి బరితెగింపు



పచ్చ మూకల దాడిలో ధ్వంసమైన సామాజిక న్యాయ మహా శిల్పం బోర్డు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు

- ప్రజలు, మీడియా, అంబేడ్కర్ ఆలోచనాపరులు రావడంతో పరార్
- అధికారుల సమక్షంలోనే ఉన్మాదం
- సుత్తులు, ఇతర పరికరాలతో విగ్రహంపై దాడి
- సామాజిక న్యాయ మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ధ్వంసం
- మీడియా సమాచారమిచ్చినా స్పందించని సీపీ
- ప్రజాస్వామ్యం ఖూనీ అయిందంటూ ప్రజాస్వామ్యవాదుల మండిపాటు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సామాజిక అభ్యున్నతి ద్వారానే దళిత వర్గాల తలరాత మారుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ నినదించి గురువారం నాటికి సరిగ్గా 95 ఏళ్లు. అణగారిన వర్గాలకు మద్దతుగా నాగ్‌పూర్‌లో 1930 ఆగస్టు 8న ఏర్పాటైన మహాసభకు దళితుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్ అధ్యక్షత వహించిన రోజే ఆ మహనీయుడి విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని విజయవాడ నడిబొడ్డున రాష్ట్రానికి తలమానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై తెలుగుదేశం మూకలు ఉన్మాదంతో పేట్రేగిపోవడం దేశవ్యాప్తంగా యావత్ దళిత సమాజాన్ని నివ్వెరపోయేలా చేసింది. స్వయంగా ప్రభుత్వమే పూనుకుని రాజ్యాంగ నిర్మాతపై దాడికి ఉన్మత్త మూకలను ప్రేరేపించడం దేశచరిత్రలో కనీవినీ ఎరుగని దారుణం. గురువారం రాత్రి కుట్రపూరితంగా అంబేడ్కర్ మహాశిల్పం చుట్టుపక్కల

మిగతా 12వ పేజీలో ▶

బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ సారథిగా యూనుస్



- పౌరులకు భద్రత కల్పిస్తానన్న 'నోబెల్'గ్రహీత
- ప్రమాణం చేయించిన అధ్యక్షుడు షహబుద్దీన్
- 16 మందితో కూడిన సలహామండలి ఏర్పాటు

6లో

బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత



- శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ బెంగాల్ మాజీ సీఎం తుదిశ్వాస
- నేడు అంతిమయాత్ర... మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత
- డీవైఎఫ్ఐ కార్యకర్త నుంచి సీఎం స్థాయికి ఎదిగిన బుద్ధదేవ్

6లో

ధరల భయం.. వడ్డీ రేట్లు యథాతథం

- వరుసగా తొమ్మిదో సారీ ఎక్కడి రేట్లు అక్కడే
- దీంతో 6.5 శాతం వద్దే రెపో రేటు కొనసాగింపు
- ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉద్ఘాటన

11లో

చంద్రబాబుకు ఎలాంటి విలువలూ లేవు

న్యాయం, ధర్మం పాటించని వ్యక్తి

అందుకే మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ



- నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్
- తన స్వార్థం కోసం బాబు ఏమైనా చెబుతాడు.. ఏదైనా చేస్తాడు.. అలాంటి దుర్మార్గ వ్యక్తితో యుద్ధం చేస్తున్నాం
- మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారు
- మనం చేయగలిగిందే చెప్పాం.. చేసి చూపించాం
- మన బలం ఎప్పుడూ విలువలు, విశ్వసనీయతే
- బొత్సను గెలిపించి మన పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు సహకరించండి

2లో

నేడు 'నంద్యాల'లో జగన్ పర్యటన 2లో

జేపీసీకి వక్ఫ్ సవరణ బిల్లు



- లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- మద్దతు పలికిన తెలుగుదేశం పార్టీ
- బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్షాలు
- సమాజాన్ని విచ్ఛిన్నం చేసే క్రూరమైన బిల్లు వద్దంటూ నినాదాలు
- వెనక్కి తగ్గిన కేంద్రం.. బిల్లును జేపీసీ పరిశీలనకు పంపాలని నిర్ణయం

6లో



కడలి దిశగా కృష్ణమ్మ పరుగులు

- ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.96 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- ధవళేశ్వరం నుంచి 6.88 లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు కడలిలోకి

2లో

రజత నీరాజనం

వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన నీరజ్ చోప్రా



10లో



వహ్వా హాకీ

ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. భారత్ 2-1 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టును ఓడించింది.



అమ్మకు కడుపు 'కోత'

సాక్షి, పుట్టపర్తి

జిల్లాలోని కొందరు ప్రైవేటు వైద్యులు వృత్తి ధర్మాన్ని మరిచారు. కాసుల కోసం కక్కుర్తి పడి అమ్మలకు కడుపుకోత పెడుతున్నారు. సాధారణ ప్రసవం అయ్యే అవకాశం ఉన్నా...గర్భిణి బంధువులను భయపెట్టి బలవంతంగా సిజేరియన్ చేస్తున్నారు. ఇందుకు గాను బిల్లు రూపంలో రూ.లక్షలు లాగుతున్నారు. ఒక్కోసారి చివరి నిమిషంలో చేతులెత్తేస్తూ ఎందరినో క్షోభ పెడుతున్నారు.

అనవసర సిజేరియన్‌లతో అనర్థాలెన్నో...

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ ప్రసవాలే జరుగుతున్నాయి. కానీ ప్రైవేటులో మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో సాధారణ ప్రసవాలు జరగడం లేదు. వైద్యఆరోగ్యశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రకారం మొత్తం ప్రసవాల్లో 15 శాతం లోపు మాత్రమే సిజేరియన్లు ఉండాలి. కానీ జిల్లాలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచీ ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలవారీ పరీక్షలు చేయించుకుంటున్నా...చివర్లో మాత్రం వైద్యులు సిజేరియన్‌కే సిద్ధం కావాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు. ఈ అనవసర ప్రసవాల ప్రభావం బాధితులపై జీవితాంతం చూపుతోంది. డబ్బు సంగతి పక్కన బెడితే మహిళలు చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారు. సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాల్సిన అధికారులూ నిర్లక్ష్యంగా ఉన్నారు.

అదును చూసి 'క్యాష్' చేసుకుంటూ..

చాలామంది మహిళలు అవగాహన లోపంతో సరైన ఆహారం తీసుకోని కారణంగా గర్భం దాల్చిన సమయంలో పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో మొదటి నెల నుంచే చాలామంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు వైద్యులు పౌష్టిహాకారం గురించి చెప్పడం పక్కన పెట్టి వారిని మెడిసిన్‌కు అలవాటు చేస్తున్నారు. దీంతో గర్భిణులూ తమ ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. ఫలితంగా ప్రసవ సమయంలో అదే ఆస్పత్రిలోనే తప్పనిసరి పరిస్థితుల్లో సిజేరియన్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కొందరు ప్రైవేటు వైద్యులయితే మరీ దిగజారి గర్భిణి బంధువులను భయపెడుతున్నారు. వెంటనే సిజేరియన్ చేయకపోతే ఏం చెప్పలేం అంటూ రూ.లక్షలు పోగేసుకుంటున్నారు. ఇక మరికొందరు మాత్రం ఫలానా తేదీ...ఫలానా సమయానికి ప్రసవం చేయాలని కోరుతుండటంతో వైద్యులు సిజేరియన్ చేసి బిడ్డను చేతిలో పెడుతూ భారీ మొత్తం తీసుకుంటున్నారు.

క్లుప్తంగా...

నేడు నంద్యాల జిల్లాలో వైఎస్ జగన్ పర్యటన

సుబ్బరాయుడు కుటుంబానికి పరామర్శ

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. టీడీపీ గూండాల దాడిలో హత్యకు గురైన పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని ఆయన పరామర్శించనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 10.15 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురం చేరుకొని.. సుబ్బరాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తారు. అనంతరం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. బెంగళూరుకు వెళతారు.

హాకీ జట్టుకు అభినందనలు

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత పురుషుల హాకీ జట్టుకు వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. ఎక్స్ ద్వారా జట్టుకు అభినందనలు తెలుపుతూ.. భారత జెండా వినువీధిలో ఎగరడం కొనసాగుతోందని పేర్కొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్ నిర్వహణ అధ్వానం

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల హాజరుకు సంబంధించిన ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) యాప్ నిర్వహణ అధ్వానంగా ఉంటోందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి యాప్‌ను మరింతగా మెరుగుపర్చుకోవాలని సూచించారు. రోజూ ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా క్యాడర్ వారీగా ఉద్యోగుల అటెండెన్స్ వివరాలను అందజేయాలని ఆదేశించారు. గురువారం మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్ఎస్‌పై హరికిరణ్ సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులు తొందరగా విధుల నుంచి వెళ్లిన సందర్భాల్లో అందుకు గల కారణాలు యాప్‌లో కనిపించాలని చెప్పారు. ఒక క్లిక్‌తో ప్రాంతాల వారీగా ఉద్యోగుల సమాచారం ప్రత్యక్షం అయ్యేలా సాంకేతికతను రూపొందించాలన్నారు. పీహెచ్‌సీల వారీగా పని ప్రదేశానికి వెలుపల హాజరు వేసే వైద్యుల వివరాలను రోజూ ఉదయం 10 గంటల్లోపు అందజేయాలని సూచించారు.

ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో పెంచాలి

సిబ్బందికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి సూచన



కొత్త బస్సులు ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి. పక్కన ఎమ్మెల్యేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. ఏలూరు ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో గురువారం విజయవాడ జోన్-2కు సంబంధించి 26 స్టార్‌లైనర్, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథరెడ్డి, ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి పాల్గొన్నారు.

అవయవదాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



సాక్షి, అమరావతి: అవయవదానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపి మరణించిన వారికి గౌరవప్రదంగా రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సూచించారు. ఈ మేరకు అవయవదాతలకు అంతిమ వీడ్కోలుపై పలు మార్గదర్శకాలను సూచిస్తూ ఆయన గురువారం ఉత్తర్వులిచ్చారు. 'అంత్యక్రియల కోసం రాష్ట్ర అవయవమార్పిడి ఆర్గనైజేషన్ ద్వారా రూ.10 వేల పారితోషికాన్ని కుటుంబ సభ్యులకు అందజేయాలి. అంత్యక్రియల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా కలెక్టర్/జేసీ/డీఆర్‌వో/ఆర్డీవోలు నివాళులర్పించాలి. అవయవదాతల కుటుంబ సభ్యులను గౌరవిస్తూ శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించాలి. జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేయాలి. బ్రెయిన్ డెడ్ ఘటనల్లో అవయవాలను సేకరించే సమాచారాన్ని సంబంధిత ఆస్పత్రి ప్రధానాధికారి జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలి. అవయవ సేకరణ అనంతరం భౌతికకాయాన్ని స్వస్థలానికి తరలించేందుకు ఉచిత రవాణా సదుపాయం కల్పించాలి' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నర్సీపట్నం నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు



మాట్లాడుతున్న వైఎస్ జగన్



పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు

చంద్రబాబుకు ఎలాంటి విలువలూ లేవు

న్యాయం, ధర్మం పాటించని వ్యక్తి ■ అందుకే మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ

నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ టీడీపీ పోటీ చేస్తోందంటే దానర్థం ప్రజా ప్రతినిధుల కొనుగోలుకు సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లేనని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విలువలు, విశ్వసనీయతే మన బలమని, మనమంతా కలిసికట్టుగా ఒక్కటిగా ఉండే పార్టీ మనదని అందరికీ తెలిసిందేనని చెప్పారు. న్యాయం, ధర్మం తెలియని చంద్రబాబు అనే దుర్మార్గుడితో మనం యుద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ యుద్ధంలో మన అభ్యర్థి బొత్స సత్యనారాయణను మంచి మెజార్టీతో గెలిపించి, మన ప్రతిష్టను పెంపొందించేలా సహాయ సహకారాలు అందించాలని నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో తొలుత నర్సీపట్నం.. ఆ తర్వాత పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే..

టీడీపీకి మెజార్టీ లేకున్నా పోటీ

ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజారిటీ ఉంది. మన పార్టీ నుంచి 600కు పైగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఉంటే.. అదే టీడీపీ నుంచి గెలిచిన వారు 200కు పైబడి మాత్రమే ఉన్నారు. వాళ్లకు, మనకు మధ్య 387 స్థానాల తేడా ఉంది. అంత తేడా ఉన్నప్పుడు మామూలుగా సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అక్కడ పార్టీ నుంచి అభ్యర్థిని పెట్టకూడదు. కానీ, అక్కడ టీడీపీ పోటీ చేస్తోందంటే దానర్థం.. ప్రజా ప్రతినిధుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే.

> ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఆ వ్యక్తికి ధర్మం, న్యాయం అనే పదాలకు అర్థం తెలిసి ఉండాలి. ఆ స్థాయి వ్యక్తి అడుగులు వేసేటప్పుడు సమాజం చూస్తూ ఉంటుంది కాబట్టి, మనం ఏం చేస్తున్నాం అన్నది ఆలోచించాలి. కానీ చంద్రబాబునాయుడికి న్యాయం, ధర్మం ఏవీ లేవు. దురదృష్టవశాత్తు మనం ఈ దుర్మార్గుడితో యుద్ధం చేస్తున్నాం. తన స్వార్థం కోసం ఏమైనా చెబుతాడు.. ఏదైనా చేస్తాడు.

అన్నీ మోసపూరిత హామీలు

గత ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి ముఖ్యమంత్రి అయ్యాడు. సూపర్ సిక్స్ అన్నాడు. ఇప్పుడు అవి కూడా అమలు చేయకుండా మోసం చేస్తున్నాడు. నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు అని ఇంటింటా ప్రచారం చేశాడు. ఇప్పుడు అవేవీ అమలు చేయకుండా మోసం చేస్తున్నాడు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబులా మనం కూడా హామీలు ఇవ్వాలని నాపై ఒత్తిడి తెచ్చారు. మన పార్టీ గెలుపు కోసమే వారు నాకు ఆ సలహాలిచ్చారు. కానీ, అబద్ధాలు చెప్పి గెల్చి, ఆ కిరీటాన్ని నెత్తిన పెట్టుకుంటే ఏం సంతృప్తి ఉంటుంది? అమలుకు సాధ్యం కాకపోయినా హామీలు ఇస్తే గెలుస్తాం. ముఖ్యమంత్రి అవుతాం. కానీ ఆ తర్వాత కార్యకర్తలు మొదలు ఎమ్మెల్యేల వరకు గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉంటుందా? 'జగన్ మాట ఇచ్చి, అమలు చేయలేదు' అనే మాట అనిపించుకోకూడదు. మన పార్టీ పేరు చెబితే కార్యకర్తలు, నాయకులు కాలర్ ఎగరేసుకునేలా ఉండాలి. దాని కోసమే నేను తాపత్రయపడ్డాను. అందుకే ఏనాడూ మోసపూరిత హామీలు ఇవ్వలేదు. 2014లో కూడా చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చి, మాట తప్పాడు. రైతులు రుణాల మాఫీ, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రుణాల మాఫీ, ఇంటింటికీ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్ని రకరకాలుగా చెప్పాడు. ఆ రోజుల్లో రుణమాఫీ చేద్దామని చెప్పాలంటూ నామీద కూడా ఒత్తిడి వచ్చింది. చేయలేనిది చెప్పలేమని చెప్పాను. ఆ తర్వాత ఎన్నికలు అయిపోయి, చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన అన్ని రకాలుగా మోసం చేశాడని ప్రజలకు అర్థం అయింది. అందుకే 2019లో ఆయన డిపాజిట్లు గల్లంతయ్యాయి.

ధైర్యంగా నిలబడదాం

ప్రతి కార్యకర్తకు నేను ఒక్కటే చెబుతున్నాను. ఈ ఐదేళ్ల బాధలుంటాయి. నేను 16 నెలలు జైలుకు వెళ్లాను. ఆ స్థాయిలో వేధింపులు చూశాను. ప్రతి ఒక్కరికీ అదే చెబుతున్నా, తలెత్తుకుని మనం నిలబడగలిగినప్పుడు, పోరాటం చేయగలిగినప్పుడు రెట్టింపు స్థానంలోకి దేవుడు, ప్రజలు మనల్ని తీసుకువెళ్తారు. ఇది కచ్చితంగా ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోండి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలో బొత్స సత్యనారాయణను మన అభ్యర్థిగా ఎంపిక చేసేటప్పుడు.. మన ఎమ్మెల్యేలను, ఎమ్మెల్యే అభ్యర్థులను అందరినీ అడిగాను. అధికారంలో ఉన్నప్పుడు ఎవరి పేరు చెప్పినా చెల్లుబాటవుతుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్ని రకాలుగా దీటైన అభ్యర్థిని పెట్టాలని చెప్పారు. అన్ని రకాలుగా ఆలోచించాకే బొత్స సత్యనారాయణను సరైన అభ్యర్థిగా నిర్ణయించాం.

> అధికార, ధనబలంతో చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రతి పనీ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి చేయాల్సినది కాదు. నాయకుడు అనేవాడు ఇంత అధ్వానంగా ఉంటాడా.. అన్న స్థాయిలో ఆయన పని చేస్తున్నాడు. ఇలాంటి వ్యక్తులతో మనం యుద్ధం చేస్తున్నాం. కష్టకాలంలో తోడుగా నిలబడ్డ ప్రతికార్యకర్తకు కచ్చితమైన గుర్తింపు వస్తుంది. నేను కోరేది ఒక్కటే. ప్రజలకు మనం దగ్గరగా, తోడుగా ఉంటే వారే చంద్రబాబును నామరూపాల్లేకుండా చేసే పరిస్థితి వస్తుంది. ప్రజలే దండలు వేసి మనల్ని పిలిచే రోజు వస్తుంది.
>
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

ప్రజలే మనకు శ్రీరామరక్ష

2019లో మనం అధికారంలోకి వచ్చిన **తర్వాత,** ఆ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాట**నూ నిల**బెట్టుకున్నాం. మన పార్టీ మేని**ఫెస్టోలో** చెప్పిన ప్రతి పథకాన్ని ఏటా, క్యా**లెండర్** ప్రకటించి మరీ అమలు చేశాం. **అం**దుకే ఈ రోజు కూడా మనం ధైర్యం**గా** చెప్పగలం. ఏం చేశామో చెప్పుకో**గ**లిగాం. రాజకీయాల్లో ఎవరైనా, ఎప్పుడైనా ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. కష్టకాలంలో మనం ఎలా ఉంటున్నామనేది ప్రజ**లు** చూస్తారు. ఆ ప్రజలే మనకు శ్రీరా**మ** రక్షగా ఉంటారు. విలువలు కో**ల్పో**యిన రోజు మనకు ప్రజల నుంచి **ప్రశ్న**లు ఎదురవుతాయి. రాజకీయాల్లో **విలు**వలు, విశ్వసనీయతతో మనం అడు**గులేశాం**. కష్టాలు లేకుండా ఏదీ ఉండదు. **చీకటి వచ్చిన** తర్వాత కచ్చితంగా వెలుగు రాక **మానదు. కష్టాల్లో** ఉన్నప్పుడు కూడా.. ఫలానా వాడు **మన నాయకుడు** అని చెప్పుకునే రీతిలో మనం **ఉండాలి. అప్పుడు** మనం కచ్చితంగా పై స్థానానికి ఎదుగుతాం.

ఏమిటీ చుక్కెదురు?

విశాఖ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల గురించి 'ఈనాడు'లో అదేదో ఘన కార్యం చేసినట్టు 'వైఎస్సార్సీపీకి చుక్కెదురు' అని పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు. ఏం చుక్కెదురు? చంద్రబాబుకు మెజార్టీ లేని చోట కొనుగోలు చేసి, స్టాండింగ్ కమిటీలో నువ్వు గెలిస్తే.. అదో ఘనకార్యం అన్నట్టు వైఎస్సార్‌సీపీకి చుక్కెదురా? చంద్రబాబు బ్రహ్మాండం అని రాస్తావు.. ఎందుకు? ప్రలోభాలు పెట్టినందుకా? పోలీసుల్ని పెట్టి, భయపెట్టి, దుర్వినియోగం చేసి కార్పొరేటర్ల ఓట్లు వేయించుకున్నందుకా? ఎందుకు బ్రహ్మాండం? ఇదా ఘన కార్యం? దొంగతనం, హత్యలు చేస్తే ఘనకార్యం అని రాసేట్టు ఉన్నారు. అదీ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు పరిస్థితి. ఒక అబద్ధం చెప్పడం.. అదే అబద్ధాన్ని మళ్లీ, మళ్లీ పెద్దది చేసే చెత్త కార్యక్రమం. అన్యాయం చేస్తూ.. అదేదో ఘనకార్యం చేసినట్లు పెద్ద పెద్ద అక్షరాలతో రాస్తున్నారు.

అదే మన ప్రభుత్వం ఉండి ఉంటే..

జగన్ గురించి మాట్లాడితే ఎవరిని అడిగినా.. మమ్మల్ని బాగా చూసుకున్నాడు.. పలావు పెట్టాడు అంటారు. చంద్రబాబు గురించి అడిగితే.. బిర్యానీ పెడతానని మోసం చేశాడని అంటున్నారు. ఇప్పుడు పలావు పోయింది.. బిర్యానీ పోయింది అన్న మాట ప్రతి ఇంట్లోనూ వినిపిస్తోంది. రెండు నెలలు తిరక్క మునుపే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తోంది. ఇవాళ స్కూళ్లు, ఆస్పత్రులను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. వ్యవసాయంలో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాల కోసం క్యూ లైన్లో నిల్చోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఆనాడు గడప వద్దకే మనం సేవలు అందిస్తే.. ఇప్పుడు టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. పాలన దెబ్బతింది. లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారింది. చంద్రబాబు హామీలన్నీ అబద్ధాలు, మోసాలని తేలిపోతున్నాయి. అదే జగన్ సీఎంగా ఉండి ఉంటే ఈ పాటికే అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా అంది ఉండేవి. క్యాలెండర్ ప్రకారం అన్నీ ఈ పాటికే వచ్చేవి. ఈ తేడాను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం, అన్న క్యాంటీన్లు..
అన్నీ విరాళాలతోనే..

జగన్‌ను ఇంటికి పంపేందుకు ఎన్నారైలు ఏడాది పని చేశారు

- పెద్దిరెడ్డి అక్రమాలపై వేలాది బాధితులు ఫిర్యాదు చేశారు
- 22ఏని ఉపయోగించుకొని పెద్ద ఎత్తున దందాలు చేశారు
- వైఎస్సార్‌సీపీ అంటేనే నేరస్థులు, అరాచకవాదులు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో చంద్రబాబు
- జిల్లా యూనిట్‌గా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ!

సాక్షి, అమరావతి: దాతలు, ప్రజల విరాళాలతో జన్మభూమి-2 ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అన్న క్యాంటీన్లు నిర్వహిస్తామని టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన ఆ పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే సీఎం హోదాలో చేసిన ఐదు సంతకాల అమలును ప్రారంభించామని చెప్పారు. పార్టీ సభ్యులకు ఇచ్చే ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధిలో పార్టీ అండగా ఉంటుందన్నారు. సిఫార్సులతో సంబంధం లేకుండా పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను గుర్తించి దశల వారీగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపించడానికి ఉపాధి కోల్పోయి వలస వెళ్లిన కార్మికులు కూడా వచ్చి ఎన్నికల్లో ఓటేశారని, ఎన్నారైలు విదేశాల నుంచి వచ్చి ఏడాది పాటు పని చేశారని చంద్రబాబు అన్నారు. వివేకా హత్య కేసులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన విధంగానే మదనపల్లెలో భూ కుంభకోణాల సాక్ష్యాలను తారుమారుకు కూడా కుట్ర చేశారన్నారు. వివేకాది గుండెపోటని చెప్పినట్లుగానే.. మదనపల్లెలో ఫైళ్ల దగ్ధాన్ని షార్ట్ సర్క్యూట్‌గా ప్రచారం చేశారన్నారు. పెద్దిరెడ్డి అక్రమాలపై ఒక్క రోజులోనే వేలాది బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అంటేనే నేరస్థులు, అరాచకవాదులని అన్నారు. 13 లక్షలకు పైగా అసైన్డ్ భూములను కాజేశారని, 40 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని చెప్పారు. 22ఏను ఉపయోగించుకొని పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు, దందాలు చేశారని అన్నారు.

అర్జీల పరిష్కారానికి యంత్రాంగం ఏర్పాటు

అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, పొలిట్ బ్యూరో సభ్యుడు కాల్వ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, నదుల అనుసంధానం, 8 వెనకబడ్డ జిల్లాలకు కేంద్ర సహకారం, నరేగా, నీరు-చెట్టు బిల్లుల విడుదల, ప్రజావేదిక, ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి యంత్రాంగం ఏర్పాటు తదితర అంశాలపై చర్చించినట్టు వివరించారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, దోపిడీపై విడుదల చేసిన ఏడు శ్వేతపత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ జిల్లా యూనిట్‌గా అమలు చేయాలని భావిస్తున్నట్టు చంద్రబాబు పొలిట్‌బ్యూరోలో వివరించినట్టు సమాచారం.

విత్తనాల కొరత లేకుండా చూడండి

- నూరు శాతం ఈ-క్రాప్ నమోదు చేయాలి
- పురుగు మందుల పిచికారీలో డ్రోన్ల వినియోగం పెంచాలి
- వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రూ.36 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ
- వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు




సాక్షి, అమరావతి: రైతులకు విత్తనాల కొరత రాకుండా చూడాలని సీఎం చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వందశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై జరిగిన సమీక్షలో చంద్రబాబు మాట్లాడుతూ.. పొలాల్లో పురుగు మందుల పిచికారిలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని సూచించారు. కేంద్ర పౌర విమానయాన శాఖతో మాట్లాడి రాష్ట్రంలో డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేద్దామని చెప్పారు. శాటిలైట్ ద్వారా నేలల్లో తేమ శాతాన్ని గుర్తించాలన్నారు. త్వరలో అన్నదాత పథకం మార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపారు. ఉద్యాన పంటల్లో దేశంలోనే రాష్ట్రం ముందుండేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. 2014-19 మధ్య అమలు చేసిన ఉద్యాన పంటల విధి విధానాలను పూర్తిగా అనుసరించాలని చెప్పారు. 15 శాతం జీఎస్డీపీ సాధించేలా కృషి చేయాలన్నారు. ఉద్యానవన పంటలకు మౌలిక సదుపాయలు, మార్కెటింగ్, కోల్డ్ స్టోరేజీలు, తక్కువ ఖర్చుతో రవాణాకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ పార్కు ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉత్తమ విధానంపై నివేదిక రూపొందించాలని చెప్పారు. జూలైలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు తిరిగి పంటలు వేసుకునేందుకు రూ.36 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆ శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు, పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ పాల్గొన్నారు.

హాకీ జట్టు విజయం పట్ల సంతోషంగా ఉంది

ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించిన భారత హాకీ జట్టును సీఎం చంద్రబాబు అభినందించారు. 'పారిస్‌లో భారత హాకీ జట్టు సాధించిన అద్భుతమైన విజయం పట్ల చాలా సంతోషిస్తున్నాను. వరుసగా రెండోసారి ఒలింపిక్స్ కాంస్య పతకాన్ని సాధించిన పురుషుల హాకీ జట్టుకు చాలా అభినందనలు. ఇది మన దేశానికి సువర్ణావకాశం' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

కడలి దిశగా కృష్ణమ్మ పరుగులు

- ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.96 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- ధవళేశ్వరం నుంచి 6.88 లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు కడలిలోకి



ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తడంతో కిందికి ప్రవహిస్తున్న వరదనీరు

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్/తాడేపల్లి రూరల్/పోలవరం రూరల్: కృష్ణమ్మ కడలి వైపు కదలిపోతోంది. విజయవాడ వద్ద నున్న ప్రకాశం బ్యారేజీల్లోకి గురువారం సాయంత్రం 6 గంటలకు 3,10,088 క్యూసెక్కులు చేరుతోంది. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 12 అడుగులకు చేరుకుంది. కృష్ణా డెల్టా కాలువలకు 13,768 క్యూసెక్కులను అధికారులు విడుదల చేస్తున్నారు. మిగులుగా ఉన్న 2,96,320 క్యూసెక్కులను 17 గేట్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఎగువ నుంచి కృష్ణా నది, ఉప నది తుంగభద్రల్లో వరద కొనసాగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి 2.08 లక్షల క్యూసెక్కులు, తుంగభద్ర డ్యామ్ నుంచి 60 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,54,761 క్యూసెక్కులు వస్తున్నాయి. ఇక్కడ 882.5 అడుగుల్లో 202.04 టీఎంసీలను నిల్వ చేస్తూ 3.72 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీ-నీవా సుజల స్రవంతికి 211 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 25 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు విడుదల చేశారు. నాగార్జున సాగర్‌లోకి 2,72,750 క్యూసెక్కులు చేరుతుండగా.. 586 అడుగుల్లో 300.32 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. నాగార్జున సాగర్ నుంచి 2.53 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టులోకి 2.58 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 35.5 టీఎంసీలను నిల్వ చేస్తూ 2.46 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

పోలవరం వద్ద పెరుగుతున్న గోదావరి

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలూరు జిల్లా పోలవరం వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటి మట్టం 31.6 మీటర్లకు చేరింది. స్పిల్‌వే నుంచి దిగువకు 7.77 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తోంది. భద్రాచలం వద్ద కూడా 37.50 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ధవళేశ్వరం వద్ద గోదావరి వరద స్థిరంగా కొనసాగుతోంది. గురువారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 6,96,462 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టా కాలువలకు 7,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్న అధికారులు.. మిగులుగా ఉన్న 6,88,962 క్యూసెక్కులను 175 గేట్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో అంటే జూన్ 1 నుంచి గురువారం ఉదయం వరకూ ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 1800.71 టీఎంసీల గోదావరి జలాలు, ప్రకాశం బ్యారేజ్ నుంచి 14.94 టీఎంసీల కృష్ణా జలాలు సముద్రంలో కలిశాయి.

మిడతపాట్లు



వేలేరుపాడు: గోదావరి వరదలో మునగకుండా ప్రాణాలు కాపాడుకునేందుకు మిడతలు ఇలా ఊత పుల్లల పైకి ఒకదాని వెనుక మరొకటి ఎక్కాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం తాట్కూరుగొమ్ము గ్రామంలో గురువారం కనిపించిన దృశ్యాలివి..

ఒంగోలులో ఈవీఎంల మాక్ పోలింగ్‌కు ఈసీ గ్రీన్‌సిగ్నల్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గంలో ఓటింగ్ సరళి, ఈవీఎంల పనితీరులో అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం తదితర అంశాలపై మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈవీఎంల పనితీరును తిరిగి పరిశీలించేందుకు ఈసీ నిర్ణయించింది. నియోజకవర్గంలోని 12 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంల మాక్ పోలింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 6, 26, 42, 59, 75, 76, 123, 184, 192, 199, 245, 256 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను పరిశీలించనున్నారు. మాక్‌పోలింగ్ నిర్వహణ కోసం బాలినేని రూ. 5,66,400 ఫీజు కూడా చెల్లించారు. అయితే, ఎన్నికల సంఘం అధికారులు ఫిర్యాదును వెనక్కి తీసుకుంటే డబ్బు తిరిగి ఇస్తామని ఒత్తిడి తీసుకొచ్చినా.. బాలినేని మాత్రం ఈవీఎంల మాక్ పోలింగ్ జరగాల్సిందేనంటూ పట్టుబట్టారు. దీంతో మాక్ పోలింగ్‌కు ఈసీ ఆమోదం తెలిపింది. ఆ మేరకు ఎన్నికల విభాగం అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఈవీఎంల మాక్ పోలింగ్‌లో ఎన్నికల విభాగం అధికారులతో పాటు బెల్ కంపెనీ ఇంజనీర్లు కూడా పాల్గొననున్నారు.

ఈవీఎంల మాక్ పోలింగ్ పరిశీలన కోసం ఈ నెల 19 నుంచి 24వ తేదీ మధ్య అధికారికంగా ఒక తేదీని ఎన్నికల సంఘం ఖరారు చేసే అవకాశం ఉందని, మరో రెండు రోజుల్లో ఈ తేదీ ఖరారు అవుతుందని ఎలక్షన్ విభాగం అధికారులు తెలిపారు. ఈ ఏడాది మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయానికి ఒంగోలు నియోజకవర్గంలో 2,40,242 మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్‌లో 2,03,143 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే, ఓట్ల లెక్కింపులో మాత్రం 2,04,325 వచ్చాయి. అంటే పోలింగ్ రోజు పోలైన ఓట్లకు, లెక్కింపు రోజు కౌంట్ అయిన ఓట్లకు 1,182 ఓట్లు పెరగడం గమనార్హం. ఈ విషయంలో ఈవీఎంల మాక్ పోలింగ్ ద్వారా స్పష్టత రావాల్సి ఉంది.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ప్రారంభం

సాక్షి, అమరావతి : రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం 2024-25 వార్షిక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, పంచాయతీరాజ్ సంస్థకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల అనుసంధానంతో సామర్థ్యత పెంచేలా శిక్షణ ఇస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 660 మండలాల్లో 13 వేల 189 మంది సర్పంచ్‌లు, 14 వేల 989 కార్యదర్శులకు శిక్షణ ప్రారంభమైందని గ్రామీణాభివృద్ధి సంచాలకులు వీఆర్.కృష్ణ తేజ పేర్కొన్నారు.


ఇంటింటికీ రేషన్ మూర్ఖపు నిర్ణయం



ఇంటింటికీ రేషన్ పంపిణీ మూర్ఖపు నిర్ణయం. రేషన్ మాఫియాలో ఎండీయూలు ప్రధాన భాగస్వాములు. దాదాపు రూ.1,500 కోట్లు ఆర్థిక భారం మోపి పౌరసరఫరాల కార్పొరేషన్‌కు 9,260 ఎండీయూ వాహనాలను కొన్నారు. రేషన్ డోర్ డెలివరీపై విస్తృతంగా చర్చించాలి.

■ గత నెల 4న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఎందుకు తెచ్చుకోలేరు?



రేషన్ వాహనాలను వీధిలో ఒకచోట పెడుతున్నారు. ప్రజలే అక్కడికి వెళ్లి రేషన్ తీసుకుంటున్నారు. అలాంటిది రేషన్ దుకాణం వరకు వెళ్లి ఎందుకు తెచ్చుకోలేరు? రేషన్ డిపో దగ్గర అయితే నచ్చినప్పుడు వెళ్లి తీసుకోవచ్చు.

■ ఎండీయూలపై గత సోమవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

అప్పుడే నాణ్యత మారింది

ఈ చిత్రంలో కనిపించేది సాక్షాత్తూ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న చౌక బియ్యమే. మట్టి, రాళ్లు, చెత్తతో పాటు రంగు మారిన బియ్యాన్ని ఈ నెల 2న విజయవాడలోని ప్రసాదంపాడు బీఎంపీఎస్ కాలనీలో వినియోగదారులకు సరఫరా చేశారు. ఎన్నికలకు ముందు వరకు రేషన్ సరుకుల్లో నాణ్యమైన సార్టెక్స్ బియ్యం ఇవ్వగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యతే మారిపోయింది.



అడ్డుకుందాం..

ఈ చిత్రంలో రోడ్డు పక్కన బియ్యం లోడుతో నిలిచిపోయిన లారీ కనిపిస్తోందా? పల్నాడు జిల్లా దొనకొండ మండలం ఇండ్ల చెరువులో రేషన్ డీలర్ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు కావడంతో టీడీపీ నాయకులు పేదల బియ్యాన్ని ఊళ్లోకి రానివ్వకుండా అమానుషంగా అడ్డుకున్నారు.



బియ్యం బండికి బ్రేక్

రాష్ట్రంలో తిరోగమనంలో ప్రజా పంపిణీ వ్యవస్థ

దేశం మెచ్చిన ఎండీయూలకు కూటమి ప్రభుత్వం మంగళం



ఇది విజయనగరం జిల్లా వంగర మండలం కొండచాకరాపల్లి పంచాయతీ పరిధిలోని ఐటీడీఏ కాలనీ (ఎస్టీ కాలనీ). 45 ఏళ్ల కిందట ఏర్పడిన ఈ కాలనీకి వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ సేవలు నడిచొచ్చాయి. ప్రతి నెలా రేషన్ బండి ఇంటి వద్దకే వచ్చి బియ్యం పంపిణీ చేసింది. రెండు కి.మీ. దూరంలోని కొండచాకరాపల్లి రేషన్ డిపో దగ్గరకు వెళ్లి రోజంతా క్యూలైన్లలో పడిగాపులు కాసే దుస్థితిని గత ప్రభుత్వం మార్చిందని మహిళలు గుర్తు చేసుకుంటున్నారు.

- ఇంటి వద్దకు రేషన్ చేరకుండా రాజకీయ కుట్ర
- పేదలకు మేలు చేస్తున్న పథకం రద్దుకు తాపత్రయం
- అదనపు భారం, అనవసర ఖర్చు అంటూ సాకులు
- డిపోలకు వెళ్లి బియ్యం ఎందుకు తెచ్చుకోలేరంటూ వినియోగదారులకు ఎదురు ప్రశ్న
- రోజువారీ పనులు వదులుకుని చౌక బియ్యం కోసం దశాబ్దాల పాటు పేదల పాట్లు
- మళ్లీ కూలి మానుకుని డిపోలకు వెళ్లి బారులు తీరాల్సిన అగత్యం కల్పిస్తున్న సర్కారు
- 9,260 ఎండీయూ ఆపరేటర్లు, అదనంగా వేల మంది సహాయకుల ఉపాధి ప్రశ్నార్థకం
- ఎండీయూ వాహనాల్లో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారంటూ ప్రభుత్వ పెద్దల అభాండాలు
- గత ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక ప్రజా పంపిణీ వ్యవస్థను దెబ్బకొట్టడమే లక్ష్యం
- ఎండీయూ వ్యవస్థ రాకతో కార్డుదారులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు
- 50 ఏళ్లుగా డిపోల వద్ద క్యూలైన్ల అగచాట్ల సంస్కృతికి తెర దించిన వైఎస్ జగన్



చంద్రబాబు హయాంలో రేషన్ దుకాణం వద్ద బారులు తీరిన లబ్ధిదారులు (ఫైల్)



కృష్ణా జిల్లాలో ఇంటి వద్దే రేషన్ అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

దశాబ్దాల దుస్థితి

రేషన్ సరుకులు తీసుకోవాలంటే దశాబ్దాల పాటు ఓ ప్రహసనమే. పేదలు ఓ పూట పనులు మానుకుని సరుకుల కోసం వెళ్లినా షాపు తెరుస్తారో లేదో అనుమానమే. నిర్దేశించిన సమయంలో మాత్రమే వెళ్లి తీసుకోవాలి. వినియోగదారులు ముందే వెళ్లి కార్డులు వరుసగా లైన్లలో పెట్టాలి. సరుకులన్నీ కొలిచే ఇవ్వడం, తూకం వేసే వరకు ఆగాల్సిందే. ఇక రేషన్ డీలర్లు సొంత పనులపై ఎక్కడికైనా వెళితే వారు వచ్చేవరకు నిరీక్షించక తప్పదు. రోజువారీ కూలి పనులకు వెళ్లి పొట్టపోసుకునే వారికి ఇది ఎంత ప్రయాస అనేది వేరే చెప్పాల్సిన పనిలేదు.

పక్కాగా పంపిణీ..

రేషన్ డీలర్ లేకపోతే ఆ నెలలో రేషన్ కచ్చితంగా ఆలస్యం అవుతుంది. అదే ఎండీయూ ఆపరేటర్ సెలవులో ఉన్నా, అనివార్య కారణాలతో రాకున్నా వీఆర్‌వో ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేసేలా గత ప్రభుత్వంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. గిరిజన ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లోకి కొన్ని చోట్ల ఎండీయూ వాహనాలు వెళ్లడం కష్టంతో కూడుకున్నది. అలాంటి చోట్ల అదనపు ఖర్చు చేసి ఇతర వాహనాల్లో లబ్ధిదారుల ఇళ్లకు రేషన్ చేరవేసింది.



రాష్ట్రంలో బియ్యం కార్డుదారులు 1.49 కోట్లు

ఎండీయూల ద్వారా ఉపాధి పొందుతున్న బడుగు, బలహీన వర్గాల వారి సంఖ్య 9,260

ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య: 17,000కి పైగా

సాక్షి, అమరావతి: పౌర సేవల్లో వైఎస్సార్ సీపీ తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలకు రేషన్ సరుకుల డోర్ డెలివరీ తిరుగులేని నిదర్శనం. కలలో కూడా ఎవరూ ఊహించనివి సాకారమయ్యాయి. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను వివక్షకు తావులేకుండా పారదర్శకంగా చేరవేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే పంథాను కొనసాగించి పేదల ఇక్కట్లను తొలగిస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేశారు. పేదలు పనులు మానుకుని రోజంతా రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితిని తప్పించారు. రేషన్ బియ్యమంటే తినటానికి ఏమాత్రం పనికి రావనే గూడు కట్టుకుపోయిన అభిప్రాయాన్ని తొలగిస్తూ నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని కచ్చితమైన తూకంతో ప్యాకింగ్ చేసి మరీ పేదలకు ఇంటికే పంపించారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఎండీయూ (ఇంటి వద్దకే రేషన్ పంపిణీ) వ్యవస్థకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిలోదకాలిస్తోంది. పేదలను మళ్లీ గత కాలపు చేదు జ్ఞాపకాలు, అవమానాలకు గురి చేసే విధంగా సన్నద్ధమైంది. ముక్కిపోయిన బియ్యం.. సకాలంలో దొరకని తిండి గింజలు.. అసలు అడిగితే సమాధానం లేని పాత రేషన్ విధానం ప్రవేశపెట్టేందుకు తాపత్రయపడుతోంది. ఎండీయూ వ్యవస్థ నిలిచిపోతే రేషన్ సరుకుల కోసం చౌక ధరల దుకాణాల దగ్గర మళ్లీ క్యూలైన్‌ల్లో బారులు తీరాల్సిన దుస్థితి తలెత్తనుంది. చౌక బియ్యంతోనే పొట్టపోసుకునే వృద్ధులు, దివ్యాంగుల దురవస్థ ఊహకు కూడా అందడం లేదు.


దాదాపు కోటిన్నర మందికి తిప్పలు..

ఇన్నాళ్లూ ఎండీయూ వాహనం ఇంటికి వచ్చే ముందు వలంటీర్ల ద్వారా నిర్ణీత సమయం, తేదీతో సహా వినియోగదారులకు సందేశాలు వెళ్లేవి. ఇంట్లో యజమాని లేకున్నా కార్డుదారుల్లో ఏ ఒక్కరున్నా ఇబ్బంది లేకుండా బియ్యం తీసుకునేవారు. బియ్యం ఏ ఒక్కరూ పనులు మానుకుని ఎదురు చూసేవారు కాదు. ఎండీయూ వ్యవస్థ రద్దు అయితే రేషన్ కోసం కూలి పనులు మానుకుని ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించాల్సిన దుస్థితి ఏర్పడనుంది. ఏపీలో 1.49 కోట్ల మంది కార్డుదారులుండగా వీరిలో రోజువారీ పనులు చేసుకుని జీవించేవారే అధికం. సగటున కోటి మంది రేషన్ తీసుకోవడానికి డిపోకు వెళితే ఆ రోజు పనికి దూరం కావాల్సిందే. వెళ్లిన రోజే రేషన్ అందుతుందనే నమ్మకం లేదని గత అనుభవాలే చెబుతున్నాయి.

సచివాలయాల వద్ద కూడా..

రాష్ట్రంలో 1.49 కోట్ల మంది రేషన్ కార్డుదారులకు ఇప్పటిదాకా ఎండీయూ వ్యవస్థ ద్వారా నాణ్యమైన బియ్యం పంపిణీ సమర్థంగా జరుగుతోంది. ఒక్కో ఎండీయూ వాహనం రోజుకు సుమారు 90 కార్డులకు తగ్గకుండా నెలలో 17 రోజుల పాటు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు చేరవేస్తోంది. బియ్యాన్ని ఇంటి ముంగిట్లో అందజేస్తోంది. వివిధ కారణాలతో ఇంటి దగ్గర ఎవరైనా రేషన్ తీసుకోకుంటే సాయంత్రం పూట గ్రామ, వార్డు సచివాలయం వద్ద ఇచ్చే వెసులుబాటు కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా సార్టెక్స్ బియ్యాన్ని సరఫరా చేసింది. ఎక్కడా రేషన్ డీలర్ల ఉపాధికి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం మాత్రం ఆర్థిక భారం పేరుతో ఇంటి వద్దకే రేషన్ పంపిణీని నిలిపివేసి అక్రమాలకు తెర తీసే యత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది.

ఎండీయూ వాహనాల లబ్ధిదారుల సంఖ్య



రేషన్ డోర్ డెలివరీ రద్దు చేద్దాం

“ 2014లో రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు ఇచ్చేవాళ్లం. బియ్యం డోర్ డెలివరీ పేరుతో చేపట్టిన ఎండీయూ విధానం లోపభూయిష్టంగా సాగింది. ఇదే వాహనాలను బియ్యం అక్రమ రవాణాకు వాడుకున్నారు. ఇంటింటికీ రేషన్ వ్యవస్థను రద్దు చేసి ఆ వాహనాలను ఎలా వాడుకోవాలో ప్రతిపాదనలతో రండి.

■ ఈనెల 2న పౌరసరఫరాల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

వేల మంది ఉపాధి ప్రశ్నార్థకం..

రేషన్ పంపిణీలో వైఎస్ జగన్ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచింది. 2021లో రూ.530 కోట్లకు పైగా వ్యయంతో 'ఇంటి వద్దకే రేషన్' వ్యవస్థను తీసుకొచ్చింది. తద్వారా 9,260 మంది బడుగు, బలహీన వర్గాల యువతకు ఎండీ ఆపరేటర్లుగా ప్రతి నెలా నిర్వహణ ఖర్చుల కింద జీతం చెల్లిస్తూ ఉపాధి సైతం కల్పించింది. ఒక్కో ఎండీయూ వాహనం విలువ రూ.5.81 లక్షలు కాగా గత ప్రభుత్వం రూ.3.48 లక్షలు రాయితీ ఇచ్చింది. లబ్ధిదారుడు కేవలం రూ.58 వేలు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణ సౌకర్యం కల్పించారు. 90 శాతం రాయితీతో రేషన్ వాహనాలను అందించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వాహనదారుడితో పాటు హెల్పర్ల కింద సుమారు 17 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ఎండీయూలకు ఆర్థిక ఊరట కల్పించేందుకు వాహన మిత్ర పథకంలో భాగంగా గత ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు చొప్పున అందించింది. ఇప్పుడు వీరందరి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి ఎండీయూ వ్యవస్థ వచ్చిన తర్వాతే రేషన్ వినియోగం 90 శాతానికిపైగా పెరిగింది. దేశంలో దాదాపు 8 రాష్ట్రాలకు పైగా రేషన్ డోర్ డెలివరీపై ఆసక్తి కనబరిచాయి. కానీ సమర్థంగా నిర్వహించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు లేకపోవడంతో ఆలోచనలో పడ్డాయి. కూటమి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా నిలిచిన వ్యవస్థలను ఎత్తివేసే కుట్రలో భాగంగానే ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.



కర్నూలు జిల్లా కోడుమూరు మండలం బైరందొడ్డిలోని 76 ఇళ్లలో 250 మంది నివాసం ఉంటున్నారు. 63 కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. ఇది పులకుర్తి మజరా గ్రామం కావడంతో సంక్షేమ పథకాలు అందుకోవాలంటే అక్కడికి వెళ్లాల్సిందే. రేషన్ కూడా అక్కడికే వెళ్లి తెచ్చుకునేవారు. వైఎస్ జగన్ హయాంలో వారు ఎక్కడికీ వెళ్లకుండా గ్రామంలోనే పథకాలు అందాయి. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ డోర్ డెలివరీ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఆ వాహనాలు రద్దు చేస్తే మళ్లీ బియ్యం, సరుకుల కోసం మోసుకుని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

గిరిజన గ్రామాలకు మళ్లీ కష్టాలు..



మాది ఉత్తరాంధ్రలోనే అత్యంత ఎత్తైన గిరి శిఖర గ్రామం చందనగిరి. గతంలో రేషన్ తీసుకోవడానికి ప్రతి నెల కుటుంబాలతో పనులు మానుకుని కాలినడకన పరశురాంపురం వెళ్లేవాళ్లం. అక్కడి నుంచి సరుకులు భుజాన మోసుకుని కొండపైకి వెళ్లేందుకు ఎన్నో అవస్థలు పడ్డాం. వైఎస్ జగన్ ప్రభుత్వంలో మా ఇళ్ల వద్దకే వచ్చి సరుకులు అందించారు. దయచేసి మా ఇళ్ల వద్దకు వచ్చి మాకు రేషన్ సరుకులు అందించాలి.

– జన్ని సరోజిని, చందనగిరి గ్రామం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా


నడిచేకి కూడా చేతకాదు..!



నాకు, నా భార్యకు వయసుపై బడింది. నడవడానికి కూడా చేతకాదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యం ఇచ్చేవారు. ఇప్పుడు స్టోర్ దగ్గరికే పోయి తీసుకోవాలని చెబుతున్నారు. మేం స్టోర్‌కు ఎప్పుడు పోవాలి? బియ్యం ఎలా వేయించుకోవాలి? నడిచేందుకు కూడా శరీరం సహకరించడంలేదు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదు.

– తిమ్మప్ప, అండేపల్లి, కంబదూరు మండలం, అనంతపురం జిల్లా

రేషన్ కోసం 6 కి.మీ. వెళ్లాలి



మేం గతంలో 6 కిలోమీటర్ల దూరంలోని కంబాలదిన్నెకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేవాళ్లం. దీనికోసం ఒక పూట కూలిపనులు మానుకుని వెళ్లాల్సి వచ్చేది. జగన్ హయాంలో వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపారు. ఇకపై కూడా అలాగే ఇచ్చేలా చూడాలి.

– పి.నరసింహారావు, రజాసాహెబ్‌పేట, పామూరు మండలం, ప్రకాశం జిల్లా

ఆరోగ్యం దృష్ట్యా కదిలే పరిస్థితి లేదు..



నా వయసు 70 ఏళ్లకు పైనే. ఆరోగ్యం దృష్ట్యా కదిలే పరిస్థితి లేదు. నా కుమారుడు దుర్గానరేష్ వికలాంగుడు. నా భార్య వరలక్ష్మి వయసు సైతం ఎక్కువే. గత ప్రభుత్వంలో మా ఇంటి వద్దకు వచ్చి మరీ రేషన్ ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్ షాపు వద్దకు వెళ్లాలని చెబుతున్నారు.

– కంచి నాగేశ్వరరావు, పెదపట్నంలంక, బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా

జీవన భృతి పోగొట్టుకుని వేరే ఊరికి వెళ్లాలి..



గతంలో రేషన్ బియ్యం, సరుకులు తీసుకోవాలంటే రోజూవారి జీవన భృతి పోగొట్టుకొని వేరే ఊరికి వెళ్లి క్యూలైన్లో నిలబడి సాయంత్రానికి వచ్చేవాళ్లం. పేదల సమస్యలు గుర్తించిన జగన్ ఇంటివద్దకే రేషన్ వాహనాలను ఏర్పాటు చేశారు. మళ్లీ పక్క ఊరికి ఆటోలో వెళ్లి పని, కూలీ పోగొట్టుకుని క్యూలో నిలబడే పరిస్థితి కల్పిస్తున్నారు. పేదలపై కోపంతోనే జగనన్న పథకాలు తీసేస్తున్నారు.

దమ్ము మహాలక్ష్మి, ఉర్లగడ్డపోడు, రైల్వేకోడూరుమండలం, అన్నమయ్య జిల్లా

రేషన్ డీలర్ బలవన్మరణం

రేషన్‌షాపును టీడీపీ నేతలు వేరొకరికి కేటాయించిన ఫలితం

ప్రొద్దుటూరు: టీడీపీ నేతలు తనకు జీవనాధారంగా ఉన్న రేషన్ షాపును తొలగించడంతో డీలర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. డీలర్ రామకృష్ణ (50) అలియాస్ కిట్టు గత పదేళ్లకు పైగా మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద రేషన్‌షాపు నిర్వహిస్తున్నారు. వార్డు టీడీపీ కౌన్సిలర్ మహ్మద్ గౌస్ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ద్వారా ఇటీవల ఆ రేషన్‌షాపును తన బంధువులకు ఇప్పించుకున్నాడు. ఈ విషయమై రామకృష్ణ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ నేత ఈవీ సుధాకర్‌రెడ్డి తదితరులను కలిసి ప్రాథేయపడినట్లు తెలిసింది. ఆయన అభ్యర్థనను ఎవరు పట్టించుకోకపోవడంతో మానసిక వేదనకు గురైన ఆయన బుధవారం రాత్రి విషం సేవించారు. పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామకృష్ణ గురువారం మృతిచెందాడు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సుమారు 70కిపైగా రేషన్ షాపులను బెదిరించి, భయాందోళనలకు గురిచేసి స్వాధీనం చేసుకున్నారు. 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న రేషన్ షాపులను అధికార పార్టీ నేతలు బలవంతంగా లాక్కున్నారు.



అంగన్‌వాడీలు, హాస్టళ్లకు కష్టాలే..

నాణ్యమైన (సార్టెక్స్) బియ్యాన్ని లబ్ధిదారుల ఇంటి ముంగిటికే వాహనాల ద్వారా (ఎండీయూ) డోర్ డెలివరీ చేయడంతో పాటు ఐసీడీఎస్(అంగన్‌వాడీలు), మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్లకు కూడా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని నేరుగా చేరవేస్తున్నారు. గతంలో అంగన్‌వాడీలు స్థానికంగా ఉన్న రేషన్ దుకాణం నుంచి, స్కూళ్లు, హాస్టళ్ల యాజమాన్యాలు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వ్యయ ప్రయాసల కోర్చి బియ్యాన్ని తెచ్చుకునేవి. ఒక రోజు ప్రత్యేకంగా దీని కోసం కేటాయించాల్సి వచ్చేది. రవాణా, లోడింగ్, అన్ లోడింగ్ విషయంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. వీటన్నింటికీ పరిష్కారంగా గత ప్రభుత్వం రేషన్‌ను డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించింది. తద్వారా ఎండీయూ ఆపరేటర్లకు అదనపు ఆదాయాన్ని కూడా సమకూరుస్తోంది. ఎండీయూ వ్యవస్థ రద్దు అయితే అంగన్‌వాడీలు, హాస్టళ్లకు మళ్లీ కష్టాలు తప్పని పరిస్థితి నెలకొంది.

అప్పట్లో తినేవారేరి?

2014 – 19 మధ్య చంద్రబాబు హయాంలో రేషన్ బియ్యం ఇంటికి తెచ్చుకోవడానికి, వండుకుని తినడానికి ప్రజలు నానా అవస్థలు పడేవారు. బియ్యం ముక్కిపోవటం... పురుగులు పట్టడం.. రాళ్లు, నూకలు ఎక్కువగా ఉండటంతో పాటు గింజలు రంగు మారి కనిపించేవి. ఇదేంటని ప్రశ్నిస్తే ఇంటికి తెచ్చుకున్న బియ్యాన్ని లబ్ధిదారులు శుభ్రం చేసుకోవడానికే సమయం పోయేది. ఈ దుస్థితిని గమనించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన సార్టెక్స్ బియ్యం ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. కరోనా సమయంలో ప్రభుత్వం ఇచ్చిన నాణ్యమైన రేషన్ బియ్యమే పేదల ఆకలి తీర్చింది. కార్డుదారుల సమక్షంలో ఇంటి దగ్గరే సంచులు తెరిచి కచ్చితమైన తూకంతో ఇస్తుండటంతో కొలతలపై ఫిర్యాదులు తగ్గిపోయాయి. ఈ–పోస్ యంత్రాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయడంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో విజిలెన్సు కమిటీలను ఏర్పాటు చేసి నిత్యం రేషన్ డోర్ డెలివరీని గత ప్రభుత్వం పర్యవేక్షించింది.

నివారించగలిగిన మహాపరాధాలకు గనక మీరు దూరంగా ఉన్నట్లయితే,
మీ చిన్న చిన్న పాపాలను మేము మీ (లెక్క) నుండి తీసేస్తాము.
ఇంకా మిమ్మల్ని గౌరవప్రద స్థానాల్లో ప్రవేశింపజేస్తాము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 9 ఆగస్టు 2024

గూగుల్‌పై కన్నెర్ర!

అతిథిగా వచ్చి అడిగినవన్నీ గుక్క తిప్పుకోకుండా చెబుతున్న సిద్ధుణ్ణి చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయిన ప్రవరాఖ్యుడు 'సృష్టికర్త బ్రహ్మకైనా నేర్వశక్యంగాని ఇన్ని సంగతులు తమరికెలా సాధ్యమయ్యాయ'ని ఎంతో వినయంగా అడుగుతాడు 'మనుచరిత్ర' కావ్యంలో. ఈ ఆధునాతన యుగంలో ఆ సిద్ధుణ్ణి మించిపోయి, అడిగిన అరక్షణంలో అన్నిటినీ గూగుల్ ఏకరువు పెడుతోంది. అసలు గూగుల్ లేకపోతే మనకు చాలా విషయాలు తెలిసేవికాదని, మన జ్ఞానానికి ఎన్నో పరిమితులుండేవని ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది విశ్వసిస్తారు. అంతటి గూగుల్‌పై అమెరికా ఫెడరల్ న్యాయస్థానం రూపంలో పిడుగుపడింది. ఈ సంస్థ గుత్తాధిపత్య పోకడలు పోతోందని న్యాయ స్థానం తీర్పునిచ్చింది. పోటీదారులందరికీ సమానావకాశాలు ఉండితీరాలన్న స్వేచ్ఛా మార్కెట్ సూత్రాలకు తిలోదకాలిచ్చి, చట్ట ఉల్లంఘనలకు పాల్పడి వక్రమార్గంలో లాభార్జనకు పాల్పడుతున్నదని తేల్చి చెప్పింది. సంస్థపై ఏ చర్యలు తీసుకోవాలన్నది న్యాయస్థానం ఇంకా చెప్పలేదు. అయితే దాన్ని భిన్న సంస్థలుగా విభజించాలని ఆదేశించటంతో సహా ఎలాంటి చర్యలనైనా సూచించే అవకాశం ఉంది. అసలు ఒక టెక్ దిగ్గజంగా, మహాసంస్థగా వెలిగిపోతున్న గూగుల్ ఏడెనిమిదేళ్ల క్రితం ఒక పెద్ద కార్పొరేట్ సంస్థ 'ఆల్ఫాబెట్'లో ఒదిగి చిన్నబోయింది. ఇప్పటికే అమెజాన్, మెటా, యాపిల్ వగైరా భారీ కార్పొరేట్ కంపెనీలపై నడుస్తున్న వ్యాజ్యాలకు తాజా తీర్పు ప్రమాణంగా మారుతుందన్నది గుత్తాధిపత్య నిరోధక చట్టాల నిపుణులంటున్న మాట. నిజానికి మైక్రోసాఫ్ట్‌పై 2000 సంవత్సరంలో వెలువడిన యాంటీట్రస్ట్ తీర్పు ప్రస్తుత గూగుల్ కేసును ప్రభావితం చేసింది. ఈ కేసు పరిష్కారానికి ఏం చేయాలన్న అంశంపై ప్రభుత్వమూ, గూగుల్ మాట్లాడుకోవాలని, వచ్చే నెల 6 నాటికి నిర్ణయం తెలపాలని న్యాయమూర్తి చెప్పారు. ఈ తీర్పుపై గూగుల్ ఎటూ అప్పీల్‌కి పోతుంది.

గూగుల్‌పై వచ్చిన ఆరోపణలు కొట్టివేయదగ్గవి కాదు. తన సెర్చ్ ఇంజన్‌ను సెల్‌ఫోన్లలో, బ్రౌజర్‌లలో అమర్చేలా యాపిల్‌తో సహా అనేక స్మార్ట్ ఫోన్ కంపెనీలకూ, బ్రౌజర్ కంపెనీలకూ గూగుల్ ఒక్క 2021లోనే 2,600 కోట్ల డాలర్లు చెల్లించిందని, ఇందువల్ల ఇతర సంస్థలు భారీగా నష్టపోయాయని ఆ అభియోగాల సారాంశం. ఒక అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల్లో 90 శాతం మంది గూగుల్ సెర్చ్ ఇంజన్‌పైనే ఆధారపడుతున్నారు. అయితే వినియోగదారులను తాము నియంత్రించటమో, నిర్బంధించటమో చేయటం లేదని... ఎందులో మెరుగైన ఫలితాలొస్తాయో తేల్చుకుని స్వచ్ఛందంగా తమను ఎంచుకుంటున్నారని గూగుల్ వాదించింది. వర్తమానంలో ఇంటర్నెట్ తెరిచాక సాగే అత్యంత ప్రధాన వ్యాపకం శోధించటమే. అయితే సెల్‌ఫోన్ తయారీదార్లకూ, బ్రౌజర్ కంపెనీలకూ భారీ చెల్లింపులు చేసి గూగుల్ సెర్చ్ ఇంజన్‌ను చేర్చాక వాటిని వినియోగించేవారికి అంతకన్నా గత్యంతరం ఏముంటుందని న్యాయమూర్తి వేసిన ప్రశ్న సహేతుకమైనది. నిజానికి గూగుల్‌తోపాటు బింగ్‌తో సహా డజను వరకూ సెర్చ్ ఇంజన్ సంస్థలున్నాయి. కానీ అనేక ఏళ్లుగా గూగుల్ తెరచాటుగా సాగిస్తున్న గుత్తాధిపత్యం పర్యవసానంగా వాటికంత ప్రాధాన్యం లేకుండా పోయింది. ఆసక్తికరమైన విషయాన్నీ, అవసరమైన సమాచారాన్నీ సేకరించటానికి వినియోగదారుల్లో అత్యధికులు యథాలాపంగా ఆధారపడేది గూగులే. దాంతో పోలిస్తే వ్యక్తిగత గోప్యత మొదలుకొని అనేక అంశాల్లో ఇతర సంస్థల తీరు ఎంతో మెరుగ్గా ఉన్నదని టెక్ నిపుణులు చెబుతున్న మాట. వినియోగదారులు ఎలాంటి అంశాల గురించి ఆరా తీస్తున్నారన్న డేటా అత్యంత కీలకమైనది. ఈ క్రమంలో వినియోగదారుల ఇష్టానిష్టాలూ... వారి అలవాట్లు, ఆసక్తులకు సంబంధించిన సమాచారం వివిధ ఉత్పాదక సంస్థలకు చాలా అవసరం. వినియోగదారులకు తెలియకుండా ఈ వివరాలన్నీ గూగుల్ అమ్ముకుంటున్నదని చాన్నాళ్లుగా వినబడుతోంది. దాంతోపాటు ఈ రంగంలో గుత్తాధిపత్యం ఉండటాన్ని ఆసరా చేసుకుని వాణిజ్య ప్రకటనకర్తలు చెల్లించే రుసుమును అపారంగా పెంచుతోంది. వివిధ విషయాలూ, పదాలూ ఆధారంగా సెర్చ్ ఇంజన్లకు వినియోగించే క్రమసూత్రాలు (అల్గారిథమ్స్) ఏమిటన్నది గూగుల్ అత్యంత రహస్యంగా ఉంచుతోంది.

అమెరికాలో దాఖలైన ఈ కేసులో ఆసక్తికరమైన అంశం ఉంది. ముున్ముందు ఎన్నో సంస్థల భవితవ్యాన్ని ప్రభావితం చేసే ఈ కేసులో వ్యాజ్యాన్ని ఎదుర్కొన్న గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాదిరే తీర్పునిచ్చిన న్యాయమూర్తి అమిత్ మెహతా కూడా భారతీయుడే. యాంటీట్రస్ట్ చట్టం నిజానికి 19వ శతాబ్దం నాటిది. పారిశ్రామికరంగం భిన్నరంగాల్లో ఎదగటానికి గుత్తాధిపత్యం పెను అవరోధమని భావించి అప్పట్లో యాంటీట్రస్ట్ చట్టాన్ని తీసుకొచ్చారు. 1970లలో ఐబీఎం మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లు, ఆ తర్వాత 1990లలో మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ వ్యవస్థ పైనా ఇలాంటి వ్యాజ్యాలే పడ్డాయి. అవి భారీగా పరిహారాలు చెల్లించుకున్నాయి. మెయిన్‌ఫ్రేమ్ మార్కెట్ ఇప్పుడు దాదాపు లేదు. గూగుల్ రాకతో మైక్రోసాఫ్ట్ గుత్తాధిపత్యం కూడా అంతరించింది. అలాగే ప్రాసెసర్ల మార్కెట్‌లో వెలుగులీనిన ఇంటెల్ ప్రభ కూడా మరోపక్క క్షీణిస్తోంది. మారిన పరిస్థితులను అందిపుచ్చుకోలేకపోవటం, కొత్త రంగాలకు విస్తరించటానికి బద్ధకించటం లాంటివి వీటి వర్తమాన అవస్థకు ప్రధానంగా చెప్పుకోవాల్సిన కొన్ని కారణాలు. గూగుల్ వ్యవహారాన్ని కూడా మార్కెట్ శక్తులకే వదిలేస్తే కాగల కార్యం అవే తీరుస్తాయనీ, గత కాలపు చట్టాలతో నియంత్రించటం వ్యర్థమనీ వాదించేవారికి కూడా కొదవ లేదు. అయితే నియంత్రణ వ్యవస్థలు లేకపోతే కొత్త సంస్థల ఆవిర్భావం సాధ్యమేనా? ఏది ఏమైనా తాజా తీర్పు పర్యవసానాలు ప్రపంచవ్యాప్తంగా ఉంటాయన్నది వాస్తవం.

మానవుల వల్లే వైరస్‌ల విజృంభణ!

విశ్లేషణ



కె. శ్రీనాథ్ రెడ్డి

వాతావరణ సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా జంతువుల నుంచి మనుషులకు వైరస్ సోకే ప్రక్రియ వేగవంతమైంది. ఉష్ణోగ్రతలు పెరిగిపోతూండటం, మంచినీటి లభ్యత తగ్గిపోతూండటం, తమ సహజ ఆవాస ప్రాంతాల నుండి బయటకు మనుషులతోపాటు జంతువులూ కదులుతూండటం వల్ల సమస్య మరింత జటిలమవుతోంది. వాతావరణ మార్పు తీవ్రతను ఎంత కనిష్ఠంగా లెక్క కట్టినా కనీసం మూడు లక్షల వైరస్‌లు మొట్టమొదటిసారి కొత్త జంతు అతిథిలోకి చేరతాయని అంచనా. క్షీరదాలు, పక్షుల వలస మార్గాలను కృత్రిమ మేధ సాయంతో అంచనా కట్టి... వ్యాధికారక సూక్ష్మజీవులు ఎక్కడెక్కడ అధికం అవుతాయో గుర్తించి తగిన చర్యలు తీసుకోవటం, గట్టి ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటం ఇందుకు పరిష్కారం.

దేశంలో మళ్లీ ఇప్పుడు వైరస్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఒక పక్క ప్యారిస్‌లో భారీ మహోత్సవాల మధ్య ఒలింపిక్స్ జరుగుతుండగా... ఇంకోపక్క దేశంలో నిఫా, చాందీపుర వైరస్‌లు కూడా ఒలింపిక్స్ మాదిరిగానే వార్తల్లోకి ఎక్కుతున్నాయి. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా కోవిడ్ కారణంగా ఇప్పటికీ మరణాలు కొనసాగుతున్నట్లు మనల్ని హెచ్చరి స్తుండటం గమనార్హం. వీటన్నింటినీ పక్కనపెట్టినా, సాధారణ జలుబు రూపంలో బోలెడన్ని వైరస్ రకాలు తెరిపి లేకుండా మనిషిని జబ్బున పడేస్తూనే ఉన్నాయి.

అనేక వైరస్ వ్యాధులు జంతువుల నుంచి మనుషులకు సోకుతున్నవే. అదేదో జంతువులు మనపై కక్షకట్టి చేస్తున్న పనేమీ కాదు. మానవులు ఆక్రమించుకున్న తమ ఆవాసాలను మళ్లీ సంపాదించుకునే పనిలో ఉన్నాయనీ కాదు. అడవిలో బతికే జంతుజాలాన్ని మనం మన ఆవాసాల్లోకి చేర్చుకున్నాం కాబట్టి! అలాగే మన మధ్యలో ఉన్న జంతువులు అటవీ ప్రాంతాల్లోకి చేరేందుకు తగిన 'మార్గం' వేశాము కాబట్టి! అటవీ ప్రాంతాల విచ్చలవిడి విధ్వంసం, పాడి పశువులను పెద్ద ఎత్తున పెంచుతూండటం, రకరకాల పెంపుడు జంతువుల ఎగుమతి, దిగుమతులు, దేశాల మధ్య మనిషి విపరీతంగా తిరిగేస్తూండటం వంటివన్నీ వైరస్‌లు కూడా మనుషుల్లోకి జొరబడేందుకు అవకాశాలు పెంచుతున్నాయి.

పెరుగుతున్న వేడి... తరుగుతున్న నీరు

వాతావరణ సంక్షోభం కారణంగా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జంతువుల నుంచి మనుషులకు వైరస్ సోకే ప్రక్రియ వేగవంతమైంది. ఉష్ణోగ్రతలు పెరిగిపోతూండటం, మంచినీటి లభ్యత తగ్గిపోతూండటం, తమ సహజ ఆవాస ప్రాంతాల నుండి బయటకు మనుషులతోపాటు జంతువులూ కదులుతూండటం వల్ల సమస్య మరింత జటిలమవుతోంది. వైరస్‌లు స్వేచ్ఛగా ఒక జంతువు నుంచి ఇంకోదాంట్లోకి చేరేందుకు ఈ పరిస్థితులు వీలు కల్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే సురక్షితంగా ఉండేందుకు లేదా తీవ్రస్థాయి అనారోగ్యం కలిగించేందుకు వీలు కల్పించే కొత్త కొత్త జంతు అతిథులు వైరస్‌లకు లభిస్తున్నాయి. సైన్స్ రచయిత ఎడ్ యంగ్ ఇటీవల 'ది అట్లాంటిక్'లో రాస్తూ... మనిషి 'ప్యాండెమిసీన్' యుగాన్ని సృష్టించుకున్నాడని ప్రస్తుత పరిస్థితిని అభివర్ణించారు. భూమిపై మనిషికి ముందు ఉన్న యుగాన్ని హోలోసీన్ అని, మనిషి పుట్టుక తరువాతి యుగాన్ని ఆంత్రోపసీన్ అని పిలిస్తే... ప్రస్తుత మహమ్మారుల యుగాన్ని ప్యాండెమిసీన్ (పాండమిక్ = మహమ్మారి) అని పిలిచాడన్నమాట.

జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన గ్లోబల్ ఛేంజ్ జీవశాస్త్రవేత్త కాలిన్ కార్ల్‌సన్ ఈ మధ్యే ఈ ప్యాండెమిసీన్‌కు సంబంధించి భవిష్యత్తు దర్శనం చేయించారు. వాతావరణ మార్పుల కారణంగా భవిష్యత్తులో ఎలాంటి వైరస్‌లు మనుషులకు సోకే అవకాశముందో అంచనా



కట్టారు. 'నేచర్'లో ప్రచురితమైన ఈ అంచనా ప్రకారం... మనిషిని ముట్టడించేందుకు అవకాశమున్న వైరస్‌ల సంఖ్య ఏకంగా పదివేల రకాలు! ప్రస్తుతం వీటిల్లో అత్యధికం జంతువుల్లో మాత్రమే తిరుగుతూ ఉన్నాయి. ప్రకృతి సిద్ధమైన హద్దులు చెరిగిపోతూండటంతో అవి ఇతర జంతువులకు అంటే మనుషులకు కూడా సోకే ప్రమాదం పెరిగింది. వాతావరణ సంక్షోభం కాస్తా జంతువులు, మనుషులు కొత్త ప్రాంతాలకు వలస వెళ్లేలా చేస్తూండటం గోరుచుట్టుపై రోకటిపోటు అన్న చందం అయిందన్నమాట. ఇట్లాంటి పరిస్థితులు వైరస్‌లకు జాతర లాంటిది అంటే అతిశయోక్తి కాదు. అసలు పరిచయమే లేని బోలెడన్ని వైరస్‌లు ఒక దగ్గర చేరితే ఎన్ని కొత్త స్నేహాలు, బంధుత్వాలు కలుస్తాయో ఊహించుకోవచ్చు.

వినాశకర మార్పులు

వేర్వేరు వాతావరణ, భూ వినియోగ మార్పు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కార్ల్‌సన్ వేసిన అంచనాల ప్రకారం 2070 నాటికి కనీసం 3,139 క్షీరద జాతులు (పాలిచ్చి పెంచే జంతువులు) సహజ ఆవాసాలకు దూరంగా వలస వెళతాయి. ఈ మార్పు కూడా ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని ఎత్తైన, జీవవైవిధ్య భరిత, జనసాంద్రత అధికంగా ఉన్న చోట్ల జరుగుతుంది. దీనివల్ల జీవజాతుల మధ్య వైరస్‌ల సంచారం నాలుగు వేల రెట్లు ఎక్కువ అవుతుందని వీరు లెక్క కట్టారు. ఒకప్పుడు పశ్చిమ ఆఫ్రికాకు మాత్రమే పరిమితమైన ఎబోలా వైరస్ ఇప్పుడు ఖండమంతా విస్తరించింది. అలాగే దక్షిణాసియాలోనూ మునుపు నిర్ధారించిన ప్రాంతాలను దాటుకుని వైరస్‌లు మనుషులకు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాతావరణ మార్పు తీవ్రతను ఎంత కనిష్ఠంగా లెక్క కట్టినా కనీసం మూడు లక్షల వైరస్‌లు మొట్టమొదటిసారి కొత్త జంతు అతిథిలోకి చేరతాయని కార్ల్‌సన్ బృందం అంచనా వేస్తోంది. వీటిల్లో 15,000 వరకూ క్షీరదాలు ఉంటాయి. వాస్తవానికి ఈ మార్పిడి ఇప్పటికే మొదలైందని కార్ల్‌సన్ హెచ్చరిస్తున్నారు. 2100 నాటికి భూమి సగటు ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీ సెల్సియస్ వరకూ పెరగవచ్చునని వాతావరణ శాస్త్రవేత్తలు ప్యారిస్ ఒప్పందంలో చెప్పిన విషయం ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఉష్ణోగ్రతలు ఆ స్థాయికి చేరక ముందే పరిస్థితి ఇలా ఉంటే ఇక చేరితే ఇంకెలా ఉంటుందో ఊహించడం కష్టమే.

కనిపించేది కొంతే... పొంచివున్నది ఎంతో!

కార్ల్‌సన్ బృందం చేపట్టిన ఈ అధ్యయనం పేరు 'ఐస్‌బర్గ్ స్టడీ'. అంటే పైకి కనిపించే భాగం మాత్రమే. కనిపించనిది ఇంకా చాలానే ఉందన్నమాట. ప్రస్తుతం ఎక్కువ అవుతున్న జూనోటిక్ వ్యాధులు రాగల ప్రమాదాలతో పోలిస్తే చిన్న భాగం మాత్రమేనని అర్థమవుతుంది. క్షీరదాల్లో గబ్బిలాలు జూనోటిక్ వైరస్‌ల విజృంభణలో ముందు వరసలో ఉన్నాయి. సార్స్ కోవ్-2 కూడా వూహాన్ ప్రాంతంలోని గుహల్లో ఉన్న గబ్బిలాల నుంచి మనుషులకు సోకిందే. ఎక్కువ దూరాలు ప్రయాణించగల సామర్థ్యం వల్ల ఈ గబ్బిలాలు వాతావరణ మార్పులకు వేగంగా స్పందిస్తాయి. వందల కిలోమీటర్ల దూరాన్ని దాటేస్తాయి. తమతోపాటు వైరస్‌లను కూడా మోసుకొస్తాయి. పండ్లను ఆహారంగా తీసుకుంటాయి కాబట్టి ఈ వైరస్ జాడలు పండ్ల నుంచి మనకూ సోకుతాయన్నమాట. నిఫా వైరస్ ప్రస్థానం కూడా దాదాపుగా ఇలాంటిదే. ఆగ్నేయాసియా ప్రాంతంలో గబ్బిలాల జీవవైవిధ్యం చాలా ఎక్కువ. ఫలితంగా ఈ ప్రాంతం నుంచి సరికొత్త వ్యాధులు పుట్టుకొచ్చే, వ్యాప్తి చెందే అవకాశం కూడా ఎక్కువే.

అయితే జలచరాలు, పక్షుల ద్వారా కూడా వైరస్‌లు మనిషికి సోకవచ్చు. ఇన్‌ఫ్లుయెంజా వైరస్ రకాలకు పక్షులు ఆతిథ్యమిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణ మార్పులు అనేవి వ్యవస్థ మొత్తాన్ని గందరగోళానికి గురి చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో వాతావరణ మార్పుల సమస్యను మనం మరింత తీవ్రతతో పరిష్కరించాల్సిన అవసరాన్ని ఈ ఐస్‌బర్గ్ స్టడీ స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతిపాదించిన వన్ హెల్త్ (మనుషులతోపాటు పరిసరాల్లోని జంతువులపై కూడా పర్యవేక్షణ) మైక్రోబియల్ నిఘా వ్యవస్థ, వేర్వేరు ప్రాంతాలు, జీవజాతుల సమాచారాన్ని క్రోడీకరించడం వంటివి ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. క్షీరదాలు, పక్షుల వలస మార్గాలను కృత్రిమ మేధ సాయంతో అంచనా కట్టి... బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి వ్యాధికారక సూక్ష్మజీవులు ఎక్కడెక్కడ ఎక్కువ అవుతాయో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తు అవసరాలను సరిగ్గా అంచనా కట్టే ఆరోగ్య వ్యవస్థల ఏర్పాటూ తప్పనిసరి. అప్పుడే కొత్త వ్యాధుల ఆగమనం, వాటిని అడ్డుకోవడం, సమర్థంగా తిప్పికొట్టడం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త 'పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' మాజీ అధ్యక్షులు ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మంచి జరిగేనా?



ఓ వెయ్యి మంది తమ జీవితకాలాల్లో కూడా అనుభవించలేనిది రెజ్లర్ వినేశ్ ఫొగాట్ 29 ఏళ్లకే అనుభవించింది. రాజకీయా లను పక్కనపెడితే, ఇది తీవ్రమైన క్షోభ. దేవుడు ఏం చేసినా మంచికే చేస్తాడు అనేదాని మీదే సందేహం వస్తోంది. దీన్నుంచి ఆమెకు ఏం మంచి జరగనుందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా.

– అశోక్ లవాసా, మాజీ ఉన్నతాధికారి

గమనించడం లేదా?



భారతీయ ముస్లింలుగా పాలస్తీనా గురించి మనం మాట్లాడకుండా ఉండలేదు. చాలామంది మన తోటి హిందువులు కూడా మనతో గొంతు కలిపారు. ఇప్పుడు మన పొరుగు దేశంలో హిందువులు నరమేధానికి గురవుతున్నప్పుడు, గొంతెత్తడం అటుండనీ, కనీసం దాన్ని గుర్తించక పోతే ఎలా?

– ఒమర్ ఘాజీ, రచయిత


హృదయం ముక్కలు



నేను ప్రేమించే నా దేశం బంగ్లాదేశ్‌లో మనుషులు ప్రాణాలు కోల్పోతుండటం నా గుండెను ముక్కలు చేస్తోంది. ఇలాంటి కష్టకాలంలో మా అమ్మను చూడలేకపోవడం, హత్తుకోలేకపోవడం మరింత వేదన కలిగిస్తోంది. ఏమైనా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా రీజినల్ డైరెక్టర్‌గా నా విధులకు కట్టుబడి ఉంటాను.

– సైమా వాజెద్, షేక్ హసీనా కూతురు

ఆహార ప్రభావం



పిండిపదార్థాలు తింటూ, అరుదుగా జిమ్‌కు వెళ్తూ కూడా యూరోపియన్లు ఫిట్‌గా ఉంటారు. అదే ఆచరిస్తే అమెరికన్లు మాత్రం లావెక్కుతారు. స్థూలకాయ రేటు యూరప్‌లో 17 శాతం అయితే, అమెరికాలో 42 శాతం. దీనికి ముఖ్య కారణం, అమెరికాలో అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారం తింటుంటే, యూరోపియన్లు సహజమైన ఆహారం తింటున్నారు.

– మైకేల్ మొరెల్లీ, ఆరోగ్య నిపుణుడు

ఎందుకు కనాలి?



ప్రపంచానికి పిల్లల్ని కనిచ్చే బాధ్యత మహిళల మీద లేదు. మగవాళ్లకు పిల్లల్ని కనిచ్చే బాధ్యత మహిళల మీద లేదు. దీనికి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కూడా వారి మీద లేదు.

– లారీ పెన్నీ, రచయిత్రి

దక్షిణాది భాషల

మహా సాహిత్య ఉత్సవం

దక్షిణాది దేశీభాషల మధ్య ఎంత సారూప్యత, సామీప్యం ఉన్నా, సంస్కృతుల ఆదాన ప్రదానాలున్నా, భావోద్వేగాల దగ్గరితనం ఉన్నా ఈ అన్ని భాషల కళా, సాంస్కృతిక రంగాల ఉమ్మడి సమ్మేళనాలు జరిగేది తక్కువ. జాతీయంగా జరిగే వేడుకలలో దక్షిణాది కళా సాహిత్య సాంస్కృతిక రంగాల సభ్యులు కలవడమే తప్ప స్థానికంగా వీరికై వీరు నిర్వహించుకునే సామూహిక సమ్మేళనాలు అరుదు. సాహిత్య రంగంలో అయితే తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషా రచయితలు ఒకచోట కూడి సాహిత్యాన్ని చర్చించుకునే మహా ఉత్సవాలు కొన్ని దశాబ్దాలుగా లేవు. సాహిత్య అకాడెమీ నిర్వహించుకునే సమావేశాలలో కొద్ది మంది కలవడమే కాని పెద్ద సంఖ్యలో కలిసే మహా ఉత్సవాలు ఏనాడూ జరగలేదు.

ఈ వెలితిని పూడ్చేందుకు బహుశా తొట్ట తొలిసారిగా సందర్భం వచ్చింది. బెంగళూరులో పుస్తక ప్రచురణ, ప్రచార రంగంలో కృషి చేస్తున్న 'బుక్‌బ్రహ్మ' సంస్థ ఆగస్టు 9, 10, 11 తేదీలలో 'బుక్‌బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్- 2024' పేరుతో భారీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నది. కోరమంగళలోని సెయింట్ జాన్స్ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో నాలుగు భాషల నుంచి దాదాపు 300 మంది రచయితలు, విమర్శకులు, అనువాదకులు, ప్రచురణకర్తలు పాల్గొననున్నారు. ఆడిటోరియంలో ఐదు వేదికలలో సమాంతరంగా ప్రతి గంట ఒక సమావేశం జరగనుంది. కన్నడ సాహిత్యకారుడు సతీష్ చప్పరికె ఈ ఫెస్టివల్‌కు డైరెక్టర్. అనువాదకుడు అజయ్ వర్మ తెలుగు భాషకు అనుసంధానకర్తగా ఉన్నారు. ఓల్గా, మృణాళిని, కుప్పిలి పద్మ, వివినమూర్తి, వాడ్రేవు చినవీరభద్రుడు, కాత్యాయని విద్మహే, వినోదిని, జూపాక సుభద్ర, గోగు శ్యామల తదితర 30 మంది తెలుగు రచయితలు ఈ ఉత్సవంలో పాల్గొననున్నారు. పెరుమాళ్ మురుగన్, కె.సచ్చిదానందన్, వివేక్ శాన్‌భాగ్, జయమోహన్ వంటి సుప్రసిద్ధులు వేదికల మీద ప్రసంగించనున్నారు. ప్రధానంగా కథ, నవలా సాహిత్యంపై చర్చ ఉంటుంది.

ఇంగ్లిష్ భాష ద్వారా కాకుండా నేరుగా దక్షణాది భాషల మధ్య అనుసంధానం ఏర్పరచడమే ఈ ఉత్సవం లక్ష్యం. ప్రతి ఉదయ, సాయంత్రాలు నాలుగు భాషల ఉద్దండ కళాకారులు సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్న ఈ ఉత్సవంలో విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. ద్రవిడ భాషలలో సాహిత్య వికాసానికి ఈ వేడుక ఒక మేలైన చోదకశక్తి కాగలదని పలువురు సాహిత్యకారులు భావిస్తున్నారు. ఈ ఉత్సవానికి ప్రవేశం ఉచితం. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎవరైనా పాల్గొనవచ్చు.

ఉన్నవాడికి చుట్టాలు... పేదవానికి కష్టాలు!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

కొత్త నేర చట్టాలను అనుసరించి మొత్తం 90 రోజులు నిందితులను కస్టడీలో పెట్టవచ్చు. పోలీసు కస్టడీ, కోర్ట్ కస్టడీల పేరుతో లాకప్‌లో లేదా జైళ్లలో బంధించేందుకు పోలీస్, న్యాయ వ్యవస్థలకు వీలు కల్పిస్తున్న ఈ చట్టాలు సాధారణ పౌరుల పాలిట శాపాలే అనడం అతిశయోక్తి కాదు. పోలీసులు తలచుకుంటే ఎవరినైనా శంకరగిరి మాన్యాలు పట్టించడానికి సకల అధికారాలనూ కట్టబెడుతున్న ఈ చట్టాల వల్ల... ధనవంతులకు అంతగా ఇబ్బంది ఉండకపోవచ్చు. వారు లంచాలు ఇవ్వగలుగుతారు. ఖరీదైన లాయర్లను నియమించుకొని బెయిల్ పొందగలుగుతారు. ష్యూరిటీలు ఇవ్వగలుగుతారు. కొత్త చట్టాల పుణ్యమా అని రాజకీయనాయకుల ప్రమేయం, డబ్బులు... పోలీస్ కేసుల వ్యవహారంలో మునుపటి కన్నా ఎక్కువ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయి.

ఒక వ్యక్తి నేరం చేశాడనే అభియోగంతో అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు తీరికగా నేర ఆరోపణ చేసి కోర్టుకు పంపిస్తారు. ఆరోపణలపై విచారణకు ఎన్నేళ్లయినా పట్టవచ్చు. చివరికి ఆరోపించిన నేరం రుజువు కాకపోవచ్చు. అప్పటివరకూ జైల్లో ఉన్న ఆ పౌరుని స్వేచ్ఛ ఖరీదెంత అంటే ఎవరూ సమాధానం చెప్పలేరు. ఒక వేళ నేరస్థుడు అని కోర్టు తీర్పు ఇస్తే ఇక అప్పీళ్లలో గెలవడం అనేది డబ్బుతో కూడుకున్న వ్యవహారం అవుతుంది. వకీళ్లకు సంబంధించిన డబ్బు, లంచగాళ్లను మేపడానికి చెల్లించడాలు ఉండనే ఉంటాయి.

పాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌తో పోల్చితే కొత్త చట్టాలు (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023) ప్రమాదకరమైనవి. పాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్– 1973 కింద 'అత్యధికంలో అధికం' 15 రోజులకు మించి ఎవరినీ అరెస్టు చేయడానికి వీల్లేదు. ఇది పార్లమెంట్ చేసిన చట్టం కాదు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాయక సభ 1950లోనే నిర్ణయించిన విషయం. రాజ్యాంగం మూడో భాగంలో అతి కీలకమైన పౌరుని ప్రాథమిక హక్కుల గురించిన వివరాలు ఉన్నాయి. ఇందులో 21వ ఆర్టికల్ జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛల ప్రాముఖ్యాన్ని చెబితే... 22వ ఆర్టికల్ అరెస్ట్, డిటెన్షన్‌లకు సంబంధించిన వివరాలను పేర్కొంటోంది. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల లోపే కోర్టు ముందు కచ్చితంగా హాజరు పరచాలని ఈ ఆర్టికల్ చెబుతోంది. ఈ రాజ్యాంగ నిబంధనలను అనుసరించి చేసిన చట్టాలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. ఇలా 24 గంటలని ప్రత్యేకంగా పేర్కొనడానికి కారణం... పోలీసుల కస్టడీలో దర్యాప్తు (ఇన్వెస్టిగేషన్)కు ఒక్క 24 గంటలు చాలని భావించడమే! సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులను గమనిస్తే ఇదే సంగతి బోధపడుతుంది.

అయితే 24 గంటలకు మించి కస్టడీలో ఉంచుకోవడానికి పోలీసులు రకరకాల కారణాలు చెప్పడానికీ, ఏ కారణాలూ ఇవ్వకుండానే అరెస్టు చేసి కస్టడీ చేసేందుకూ పోలీసులకు ఈ నేర చట్టాలు విపరీతమైన అధికారాలను ఇస్తున్నాయి. సింపుల్‌గా 'తరువాత చూద్దాంలే, ముందు కస్టడీలో పడేయండి' అనే అధికారం ఇస్తున్నాయి. ఎంపీలు, డబ్బున్నవారు, ఎమ్మెల్యేలు, మంత్రుల పలుకుబడి ఉన్నవారు ఈ కస్టడీల నుంచి బయట పడిపోగలుగుతారు. కానీ కనీసం జరిమానా కూడా కట్టలేక, బెయిల్ కండిషన్ల కింద డబ్బు చెల్లించలేక ఎంతోమంది పేద, మధ్యతరగతి పౌరులు జైలు పాలు అయ్యేవారే అధికం అని ఈ చట్ట నిబంధనల వల్ల అర్థమవుతుంది.

ఇవీ మన కొత్త చట్టాలు-3



భారతీయ సురక్ష సంహిత కింద 15 రోజుల నుంచి, విడి విడిగా 40 రోజులు, 60 రోజుల దాకా; ఇంకా కొన్ని కేసుల్లో 90 రోజులూ జ్యుడిషియల్ కస్టడీ (అంటే కోర్టు సమీక్షించే కస్టడీ) పెంచడానికి చట్టాన్ని తయారు చేశారు.

పోలీసు కస్టడీ అయితే ఇంకా మరీ ఇబ్బందికరమైనది. పోలీసులు కస్టడీలో ఉంచే కాలం 15 రోజుల నుంచి 60 రోజుల దాకా పెరుగుతుంది. మొదట 15 రోజుల దాకా కస్టడీలో పడేస్తారు. దర్యాప్తు చేయడానికి సమయం చాలలేదని... కస్టడీ సమయాన్ని పొడిగించమని కోరితే సురక్ష సంహిత నియమాల ప్రకారం మరో 15 రోజులు కస్టడీకి పంపుతారు. ఇలా 60 రోజుల దాకా కస్టడీలో ఉంచే అవకాశాన్ని కొత్త చట్టాలు ఇస్తున్నాయి. 10 ఏళ్ల జైలు శిక్ష విధించగలిగిన సెక్షన్ కింద అరెస్ట్ చేస్తే 40 రోజుల దాకా పోలీసులు కస్టడీలో పెట్టుకునే అధికారం పోలీసులకు దఖలుపడుతోంది.

పోలీసులకు అపరిమిత అధికారాలు ఇచ్చి, పౌర హక్కులకు భంగం కలిగే అవకాశాన్ని కొత్తచట్టాలు ఇస్తున్నాయనేది మొత్తంగా మనం అర్థం చేసుకోవలసిన అంశం.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

చట్టాలను అమలుపరచండి!

ఆధునిక సమాజ గత కాలపు ఆనవాళ్లు ఆదివాసీ ప్రజలు. సమష్టి జీవన పద్ధతులు, సహజీవనం, పారదర్శకతకు నిలువెత్తు సాక్షులు వారు. బ్రెజిల్, పెరూ దేశాలలో వందకుపైగా ఆదివాసీ తెగలు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా ఉన్నారు. పెరూలో 50-60 వేల ఏళ్ల నుంచి అటవీ దుంపలు ప్రధాన ఆహార వనరుగా జీవిస్తూ... మొక్కజొన్న, బంగాళాదుంప సాగుకు ఈ తెగలు ఎంతో తోడ్పడ్డాయి. తాము వేటాడే జంతువులకు ఎరగా వేసే క్యూరారే మొక్క నేడు ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సకు ఔషధంగా మారింది. గత సునామీలో అండమాన్‌లో ఆదివాసీ తెగలవారు ఎవరూ చనిపోలేదు. కారణం సముద్రం వెనక్కి వెళ్లగానే వారు ఎత్తైన కొండలపైకి వేగంగా కదిలి వెళ్లారు. జారవా, సెంటినిల్ తెగల ఆదివాసీల్లో కళ్లుతెరచి సముద్రపు నీటిలో చేపలవేటను సాగించేందుకు అనువుగా 50 శాతం మంది కళ్ల రూపాంతరం చెందాయి. '...ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ సనాతన ప్రజలను కాపాడవలసిన బాధ్యత మనపై ఉంది. అందుకు ప్రతి దేశం కొత్త చట్టాలు రూపొందించడం, వాటిని అమలుచేయడం, తద్వారా జీవించే హక్కుతో సహా ఆధునిక మానవునికి గల అన్ని హక్కులూ వారికి ఇవ్వవలసి ఉన్నది' అని 1994 డిసెంబర్ 23న ఐక్యరాజ్య సమితి జనరల్‌అసెంబ్లీ 49/214 తీర్మానంలో పేర్కొన్నది.

పై తీర్మానంపై 148 దేశాలు సంతకాలు చేసినా, కొంత మేరకు అమలుచేసిన దేశాలు కేవలం 60 మాత్రమే. ఈ 60లో భారతదేశం లేదు. ప్రపంచవ్యాప్తంగానే తొలుత ఈ తీర్మానాన్ని అమలు చేయాలని ప్రయత్నించిన వారు ప్రపంచస్థాయి ఎన్‌జీఓలు మాత్రమే. మనదేశంలో ఇప్పటికీ అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వాలు జరపడం లేదు. ఎన్‌జీఓలు చేసే కార్యకలాపాలకు కొన్ని రాష్ట్రాలలో కేవలం ఆర్థిక తోడ్పాటును మాత్రమే ప్రభుత్వాలు అందిస్తున్నాయి. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తింపు పొందాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. అవే 5వ, 6వ షెడ్యూళ్లు. ప్రాంతీయ, పరిమిత స్వయంపాలనా హక్కు వీటిద్వారా ఆదివాసీలకు సంక్రమించాయి. ఆచరణకు వీలుగా పీసా చట్టం (పి.ఇ.ఎస్.ఎ–1996) వచ్చింది. అయినా బూర్జువా పాలకవర్గాలు దేశంలో గిరిజన తెగలకు స్వయం పాలనా హక్కులు ఇవ్వలేదు. నేడు జరుగుతున్న ఉత్సవాలు పాలకవర్గాల అవసరాల కోసమే తప్ప ఆదివాసీలను కాపాడడానికి కాదు. నిజమైన ఆదివాసీ దినోత్సవం ఆదివాసుల 'అవసరాలు–ఆకాంక్షలు' నెరవేర్చేదిగా ఉండాలి.

– వూకె రామకృష్ణ దొర, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.పంచమి రా.11.49 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** హస్త రా.12.46 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.7.26 నుండి 9.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** రా.6.07 నుండి 7.55 వరకు, గరుడ పంచమి ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

ఏపీ.. ఆ నాలుగేళ్లలో హ్యాపీ

వ్యవసాయ అనుబంధ రంగాల్లో స్థిరమైన, సమ్మిళిత వృద్ధి సాధన

చేపల ఉత్పత్తిలో నాలుగేళ్లుగా దేశంలోనే ఏపీ టాప్‌–1

పశు సంపద ఉత్పత్తిలో నాలుగో స్థానం


పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ఐదో స్థానం

స్థిర ధరల ఆధారంగా ఏటా పెరుగుతున్న ఉత్పత్తి విలువ

వెల్లడించిన కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ–2024 నివేదిక

దేశానికి ఆహార ధాన్యాలను అందించడంలో గడచిన ఐదేళ్లలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసిన మన రాష్ట్రం వ్యవసాయ అనుబంధ రంగాల్లోనూ అదే ఒరవడి కొనసాగించింది. తద్వారా స్థిరమైన, సమ్మిళిత వృద్ధి వైపు దూసుకెళ్లిందని కేంద్రం వెల్లడించింది. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ– 2024 నివేదిక స్పష్టం చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాలైన పండ్లు, కూరగాయలు, చేపలు, పశు సంపద ఉత్పత్తుల్లో గడచిన నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తుల పెరుగుదలపై ఆ శాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది.

\- సాక్షి, అమరావతి



మత్స్య ఉత్పత్తుల్లో నంబర్‌–1

2011–12 స్థిర ధరల ఆధారంగా గడచిన నాలుగేళ్లలో చేపల ఉత్పత్తులు, విలువ పెరుగుదలల్లో ఆంధ్రప్రదేశ్‌ దేశంలోనే నంబర్‌–1 స్థానంలో నిలిచిందని ఆ నివేదిక స్పష్టం చేసింది. 2019–20 నుంచి 2022–23 వరకు నాలుగేళ్లలో చేపల ఉత్పత్తితో పాటు విలువ కూడా భారీగా పెరుగుతూ వచ్చిందని నివేదిక పేర్కొంది. 2019–20 సంవత్సరంలో స్థిర ధరల ఆధారంగా రూ.58,700 కోట్ల విలువ చేసే చేపల ఉత్పత్తి జరగ్గా.. 2022–23లో రూ.79,900 కోట్లకు పెరిగిందని నివేదిక స్పష్టం చేసింది. స్థిర ధరల ఆధారంగా 2022–23లో దేశం మొత్తంలో ఆంధ్రప్రదేశ్‌లో చేపలు, ఆక్వా ఉత్పత్తుల వాటా 40.9 శాతంగా ఉందని నివేదిక వెల్లడించింది. ఆ తరువాత స్థానంలో పశ్చిమ బెంగాల్‌లో 14.4 శాతం ఉండగా, ఒడిశాలో 4.9 శాతం, బీహార్‌లో 4.5 శాతం, అస్సాంలో 4.1 శాతం ఉంది. మిగతా అన్ని రాష్ట్రాల్లో కలిపి 31.1 శాతం వాటా ఉందని వెల్లడించింది.

పశు ఉత్పత్తిలోనూ టాప్‌

పశు సంపద అంటే పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తుల విలువ ఆంధ్రప్రదేశ్‌లో నాలుగేళ్లుగా పెరుగుతూనే ఉందని నివేదిక వెల్లడించింది. 2019–20లో స్థిర ధరల ఆధారంగా పశు సంపద ఉత్పత్తుల విలువ రూ.54,200 కోట్లు ఉండగా.. 2022–23లో రూ.64,000 కోట్లకు పెరిగింది. తద్వారా దేశంలో ఏపీ దిగువ నుంచి నాలుగో స్థానానికి ఎగబాకిందని స్పష్టం చేసింది. స్థిర ధరల ఆధారంగా 2022–23లో దేశవ్యాప్తంగా చూస్తే.. ఏపీలో పశు సంపద ఉత్పత్తుల వాటా 7.8 శాతంగా ఉంది. రాజస్థాన్‌లో 12.5 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 12.3 శాతం, తమిళనాడులో 9.1 శాతం, మహారాష్ట్రలో 7.3 శాతం వాటా ఉండగా.. మిగతా అన్ని రాష్ట్రాల్లో కలిపి 50.9 శాతం వాటా ఉందని నివేదిక పేర్కొంది.

ఉద్యాన పంటల్లోనూ..

పండ్లు, కూరగాయల ఉత్పత్తి విలువ పెరుగుదలలో గత నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌ దేశంలో ఐదో స్థానంలో ఉందని నివేదిక వెల్లడించింది. పండ్లు, కూరగాయల ఉత్పత్తుల విలువ స్థిర ధరల ఆధారంగా ఏపీలో 2019–20లో రూ.35,500 కోట్లు ఉండగా.. 2022–23లో రూ.35,800 కోట్లకు పెరిగింది. స్థిర ధరల ఆధారంగా 2022–23లో దేశం మొత్తంలో ఏపీలో పండ్లు కూరగాయల ఉత్పత్తుల వాటా 8.2 శాతంగా ఉందని నివేదిక వెల్లడించింది. పశ్చిమబెంగాల్లో 11.4 శాతం, మధ్యప్రదేశ్‌లో 10.9 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 10.5 శాతం, మహారాష్ట్రలో 8.9 శాతం వాటా ఉండగా.. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కలిపి 49.2 శాతం వాటా ఉందని నివేదిక వివరించింది.

డిగ్రీ ప్రవేశాల్లో పాత విధానాన్ని పునరుద్ధరించాలి

ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల అసోసియేషన్‌



నరసరావుపేట రూరల్‌: డిగ్రీలో ఆన్‌లైన్‌ ప్రవేశాల విధానాన్ని రద్దు చేసి.. పాత విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఏపీ ప్రైవేట్‌ డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కె.గుండారెడ్డి కోరారు. అలాగే 2018, 2019 నాటి ఫీజుల బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం నరసరావుపేటలో జరిగిన అసోసియేషన్‌ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'డిగ్రీ కాలేజీల అఫిలియేషన్‌ను ఐదేళ్ల కాలపరిమితితో ఇవ్వాలి. నూతన, అదనపు కోర్సులను ప్రవేశపెట్టేందుకు అడ్డంగా ఉన్న జీఓ 36ను రద్దు చేయాలి. కోర్సుల ఫీజుల నిర్ణయాధికారం యూనివర్సిటీలకు అప్పగిస్తూ జారీ చేసిన జీఓ 22ను రద్దు చేయాలి. డిగ్రీ కాలేజీల రుసుం నిర్ణయించే అధికారం యూనివర్సిటీలకు ఇవ్వాలి. పీజీ కోర్సుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా ప్రిన్సిపాల్స్‌ ఖాతాలో జమ చేయాలి' అని ప్రభుత్వాన్ని కోరారు. కాగా, ఏఎన్‌యూ అనుబంధ ప్రైవేటు డిగ్రీ కాలేజీల అసోసియేషన్‌ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా రాయల శ్రీనివాసరావు, కార్యదర్శిగా ప్రగడ రాజశేఖర్, కోశాధికారిగా మైనీడి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

24, 25 తేదీల్లో 'సౌత్‌కాన్‌ 2024'



సౌత్‌కాన్‌–2024 పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న రామ్‌రెడ్డి, రాజా శ్రీనివాస్, రాంబాబు, శివారెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): కాన్ఫెడరేషన్‌ ఆఫ్‌ రియల్‌ ఎస్టేట్‌ డెవలపర్స్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా (క్రెడాయ్‌) ఏపీ చాప్టర్‌ ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో సౌత్‌కాన్‌–2024 నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జాతీయ కార్యదర్శి జి.రామ్‌రెడ్డి తెలిపారు. విజయవాడ సమీపంలోని అయాన్‌ కన్వెన్షన్‌ సెంటర్‌లో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి విజయవాడలోని హోటల్‌ వివంతలో పోస్టర్‌ ఆవిష్కరించారు. అనంతరం రామ్‌రెడ్డి మాట్లాడుతూ రియల్‌ ఎస్టేట్‌ రంగంలోని నూతన ఆవిష్కరణలు, ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశం ఐక్యతను పెంపొందించడంతో పాటు, పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి, పరిశ్రమ అంతటా సహకారాన్ని ప్రోత్సహించేలా ప్రభావంతమైన వ్యక్తులను ఈ వేదిక అందిస్తుందని తెలిపారు. ఈ సదస్సును సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సౌత్‌కాన్‌ కన్వీనర్‌ డి.రాంబాబు, క్రెడాయ్‌ జాతీయ సంయుక్త కార్యదర్శి బి.రాజాశ్రీనివాస్‌ రాష్ట్ర చైర్మన్‌ ఆళ్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌత్‌కాన్‌–24 లోగో విడుదల చేశారు.

కొత్త మెడికల్‌ కాలేజీలు ప్రైవేట్‌కా?

- ప్రైవేటీకరణ విడనాడకుంటే ఉద్యమిస్తాం: మేరుగ నాగార్జున



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఆధ్వర్యంలో నెలకొల్పిన కొత్త మెడికల్‌ కాలేజీలను ప్రభుత్వ ప్రైవేట్‌ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోకి మార్చే యత్నాలను కూటమి సర్కారు విరమించుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ నేత మేరుగ నాగార్జున డిమాండ్‌ చేశారు. ఇది కచ్చితంగా ప్రైవేటీకరణ చేయడమేనన్నారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ పేద విద్యార్థుల పక్షాన పోరాడుతుందని ప్రకటించారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్‌ జగన్‌ క్యాంపు కార్యాలయం వద్ద మేరుగ మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త మెడికల్‌ కాలేజీలపై ఎన్నికల ముందు పచ్చి అబద్ధాలు వల్లించిన కూటమి నేతలు ఇప్పుడు వాటిని ప్రైవేటుపరం చేయడానికి సిద్ధమవడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న 17 మెడికల్‌ కాలేజీల నిర్వహణలో ఇబ్బంది లేకుండా ఆర్థికంగా స్వయం సమృద్ధి చెంది పేద విద్యార్థులు కూడా వైద్య విద్య అభ్యసించే గొప్ప ఆశయంతో సెల్ఫ్‌ ఫైనాన్స్‌ సీట్లపై నాడు వైఎస్‌ జగన్‌ నిర్ణయం తీసుకుంటే కూటమి నేతలు వక్రీకరించి తప్పుడు ప్రచారం చేశారన్నారు. గతంలో నారా లోకేశ్, పవన్‌ కళ్యాణ్‌ మాట్లాడిన వీడియోలు, క్లిప్పింగ్స్‌ను ఈ సందర్భంగా ఆయన మీడియాకు ప్రదర్శించారు. నాడు విమర్శించిన వారు నేడు నిస్సిగ్గుగా కొత్త మెడికల్‌ కాలేజీలను పీపీపీ విధానంలోకి మార్చడంపై కేబినెట్‌లో ఎలా చర్చించారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే జీవోలన్నీ రద్దు చేసి కొత్త మెడికల్‌ కాలేజీల్లో అన్ని సీట్లూ ప్రభుత్వ రంగంలోనే భర్తీ చేస్తామని హామీలిచ్చి ఇప్పుడు ప్రైవేటుపరం చేసేందుకు ప్రణాళిక రూపొందించారని ధ్వజమెత్తారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు కనీసం ఒక్క ప్రభుత్వ మెడికల్‌ కాలేజీనైనా ఏర్పాటు చేయలేదన్నారు. మరోవైపు వైఎస్‌ జగన్‌ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 కొత్త మెడికల్‌ కాలేజీలను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం 12 కాలేజీలను అందుబాటులోకి తెచ్చి కన్వీనర్‌ కోటాలో సీట్లు భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. ఇప్పటికే ప్రారంభమైన ఐదు కొత్త మెడికల్‌ కాలేజీల్లో సీట్లు కన్వీనర్‌ కోటాలో ఎందుకు భర్తీ చేయడం లేదని నిలదీశారు.

వక్ఫ్‌ చట్ట సవరణ రాజ్యాంగ ఉల్లంఘనే

- పార్లమెంట్‌లో వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీకి కృతజ్ఞతలు
- ముస్లింలకు ద్రోహం చేసిన టీడీపీ, జనసేన
- ఏపీ ముస్లిం జేఏసీ కన్వీనర్‌ షేక్‌ మునీర్‌ అహ్మద్‌



సాక్షి, అమరావతి: వక్ఫ్‌ బోర్డు నిబంధనల్లో సవరణలు చేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ఏపీ ముస్లిం జాయింట్‌ యాక్షన్‌ కమిటీ కన్వీనర్‌ షేక్‌ మునీర్‌ అహ్మద్‌ స్పష్టంచేశారు. పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు వక్ఫ్‌ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించడంపై ఆయన హర్షంవ్యక్తంచేశారు. ఈ మేరకు మునీర్‌ అహ్మద్‌ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వక్ఫ్‌ భూములు పట్టణ ప్రాంతాల్లో అతి విలువైనవిగా ఉండటంతో వాటిని కొట్టేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లిం మనోభావాలను గొప్ప మనసుతో అర్థం చేసుకుని మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్‌ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించి మైనార్టీలకు మరోసారి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ తెచ్చిన వక్ఫ్‌ సవరణలకు మద్దతు పలికిన టీడీపీ, జనసేన కూటమి ముస్లింలకు తీరని ద్రోహం చేశాయన్నారు.

ముస్లింలకు టీడీపీ వ్యతిరేకం: నాగుల్‌మీరా

ఎన్నికల ప్రచారంలో ముస్లింల హక్కులను కాపాడతానని నమ్మించి, నేడు కేంద్ర ప్రభుత్వం ముస్లిం సమాజ ఆస్తులను కాజేయాలనే కుట్రతో వక్ఫ్‌ చట్ట సవరణ బిల్లు తీసుకొస్తే సంపూర్ణ మద్దతు ఇచ్చిన టీడీపీ మరోసారి ముస్లింల వ్యతిరేక పార్టీ అని తేటతెల్లమైందని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ నాగుల్‌ మీరా అన్నారు. వక్ఫ్‌ చట్ట సవరణ బిల్లుకు తాము వ్యతిరేకమని పార్లమెంటులో తెలిపిన వైఎస్సార్‌సీపీకి ముస్లిం సమాజం రుణపడి ఉంటుందని ఆయన చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ టీడీపీకి మద్దతు ఇచ్చిన ముస్లిం మైనార్టీ సంఘాలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ముస్లిం సమాజంలో తిరుగుతాయని ప్రశ్నించారు. కాగా, వివాదాస్పద వక్ఫ్‌ సవరణ బిల్లును వ్యతిరేకించి సెలెక్ట్‌ కమిటీకి పంపేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సీఎం చంద్రబాబు, మంత్రి ఫరూఖ్‌ను పలు మైనారిటీ సంఘాల నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు.

పొన్నవోలుకు భద్రత కొనసాగించండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు మాజీ అదనపు అడ్వొకేట్‌ జనరల్‌ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి తదుపరి విచారణ వరకు 2+2 భద్రత కొనసాగించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే భద్రతా సిబ్బందికి అయ్యే వ్యయాన్ని భరించాలని సుధాకర్‌రెడ్డిని ఆదేశించింది. ప్రాణహాని లేదంటూ ఎస్‌ఆర్‌సీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఆ నివేదికను సవాలు చేస్తూ వ్యాజ్యంలో సవరణ చేసేందుకు సుధాకర్‌రెడ్డికి అనుమతినిచ్చింది. తదుపరి విచారణను 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పటి వరకు వాసుదేవరెడ్డిపై కఠిన చర్యలొద్దు

సాక్షి, అమరావతి: బలవంతంగా మద్యం షాపు నుంచి తనను ఖాళీ చేయించి దానిని వేరొకరికి ఇవ్వడంవల్ల తనకు రూ. 50 లక్షల నష్టం వాటిల్లిందని, దీని వెనుక బేవరేజెస్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారని వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్‌ మంజూరు చేయాలంటూ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై గురువారం న్యాయమూర్తి డాక్టర్‌ జస్టిస్‌ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌ విచారణ జరిపారు. వాసుదేవరెడ్డి తరఫు న్యాయవాది ఎస్‌.నగేష్‌ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలకూ పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ మెండా లక్ష్మీనారాయణ స్పందిస్తూ, పిటిషనర్‌పై నాలుగు కేసులున్నాయన్నారు. అన్ని కేసుల వివరాలను కోర్టు ముందుంచుతానని తెలిపారు. దీంతో న్యాయమూర్తి విచారణను రెండు వారాలకు వాయిదా వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో లక్ష్మీనారాయణ జోక్యం చేసుకుంటూ విచారణను సోమవారానికి వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ అప్పటి వరకు వాసుదేవరెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలొద్దని పోలీసులను ఆదేశించారు.

భద్రత ఉపసంహరణపై హైకోర్టులో బాలినేని పిటిషన్‌

సాక్షి, అమరావతి: తనకు భద్రతను ఉపసంహరించడాన్ని సవాలు చేస్తూ ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ప్రాణహాని నేపథ్యంలో గతంలో ఉన్న విధంగా తనకు 2+2 భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ ఆయన పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై గురువారం న్యాయమూర్తి జస్టిస్‌ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి విచారణ జరిపారు. బాలినేని తరఫు న్యాయవాది ఆలపాటి వివేకానంద వాదనలు వినిపిస్తూ, ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసులు ఏకపక్షంగా భద్రతను ఉపసంహరించారని తెలిపారు. పిటిషనర్‌కు ఉన్న ప్రాణహానిని పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ, బాలినేనికి ప్రాణహాని లేదని, ఈ మేరకు భద్రత సమీక్ష కమిటీ (ఎస్‌ఆర్‌సీ) నివేదిక కూడా ఇచ్చిందని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, పూర్తి వివరాలతో కౌంటర్‌ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఎస్‌ఆర్‌సీ నివేదికపై అభ్యంతరం ఉంటే, ఆ నివేదికను సవాలు చేసుకోవచ్చునని బాలినేనికి వెసులుబాటునిచ్చారు. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

'అంటువ్యాధుల నివారణకు ఆదేశాలు ఇవ్వండి'

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున గిరిజన గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లోని తండాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని రాష్ట్ర గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌కు ఏపీ ఎస్టీ కమిషన్‌ సభ్యుడు వడిత్యా శంకర్‌ నాయక్‌ విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన శంకర్‌ నాయక్‌ కమిషన్‌ పని తీరును వివరించడంతోపాటు పలు గిరిజన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో గిరిజన మైనర్‌ బాలికలపై అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కొన్ని గిరిజన ప్రాంతాలు కనీస సౌకర్యాలు లేక వెనుకబడి ఉన్నాయన్నారు. డోలీ మోత తప్పని గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గిరిజన చట్టాల అమలులో వైఫల్యాల కారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో సంక్షేమం గిరిజనుల గడపకు చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మత్స్యకారుల పొట్ట కొట్టొద్దు

జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): తమ స్వార్థం కోసం మత్స్యకారుల పొట్ట కొట్టడం తగదని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు టీడీపీ నేతలకు హితవు పలికారు. గురువారం ఆయన నక్కపల్లి మండలం మోసయ్యపేటలో పలువురు బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. తీరప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హేచరీల్లో ప్యాకింగ్‌ ఏజెన్సీ పనులు స్థానికంగా ఉన్న మత్స్యకారులు, యాదవ సామాజిక వర్గానికి చెందినవారికి ఇచ్చినట్లు చెప్పారు. సుమారు 660 మందికి పైగా ఈ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు హేచరీల్లో కాంట్రాక్ట్‌ ఏజెన్సీలను తమ వర్గీయులకే ఇవ్వాలని, వేరొక పార్టీ వారికి ఏజెంట్‌ కమీషన్‌ ఇవ్వడానికి వీల్లేదని హేచరీ యాజమాన్యాలకు హుకుం జారీ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీకి ఓటెయ్యలేదన్న అక్కసుతోనే వారు ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని చెప్పారు.

మాజీ ఎంపీ 'కెంబూరి' మృతి

అంత్యక్రియలు నిర్వహించిన పెద్దకుమార్తె



రామ్మోహనరావు (ఫైల్‌)

చీపురుపల్లి: టీడీపీ తొలితరం నేతల్లో ఒకరయిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే కెంబూరి రామ్మోహనరావు గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతి చెందారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రుక్మేంద్రమణి, మైథిలి, సౌజన్య ఇద్దరు కుమార్తెలున్నారు. మైథిలి లండన్‌లో ఉండగా సౌజన్య చీపురుపల్లిలోనే నివసిస్తున్నారు. 1985లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ తరఫున చీపురుపల్లి ఎమ్మెల్యేగా కెంబూరి రామ్మోహనరావు గెలుపొందారు. 1989లో అసెంబ్లీ, లోక్‌సభకు ఒకేసారి జరిగిన ఎన్నికల్లో బొబ్బిలి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 పార్లమెంటు స్థానాలు ఉండగా.. అందులో టీడీపీ నుంచి ఇద్దరు ఎంపీలు మాత్రమే గెలుపొందగా అందులో కెంబూరి ఒకరు కావడం గమనార్హం. కాగా, పెద్ద కుమార్తె మైథిలి తండ్రికి సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. రామ్మోహనరావు మృతి వార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావుతో పాటు పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కొత్త క్రిమినల్‌ చట్టాలు రద్దు చేయాల్సిందే: ఐలు



క్రిమినల్‌ చట్టాలకు విరుద్ధంగా న్యాయవాదులందరూ ఏకమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐలు ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, ఐలూ హైకోర్టు కమిటీ అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త క్రిమినల్‌ చట్టాలను రద్దు చేయాలని ఆల్‌ ఇండియా లాయర్స్‌ యూనియన్‌ (ఐలు) గురువారం హైకోర్టు వద్ద ఆందోళన చేపట్టింది. 'ఐలు' జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సుంకర రాజేంద్ర ప్రసాద్‌ నేతృత్వంలో న్యాయవాదులు భోజన విరామ సమయంలో హైకోర్టు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుంకర మాట్లాడుతూ, కొత్త క్రిమినల్‌ చట్టాలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కొత్త

టీడీపీ ఆఫీసుపై దాడి వెనుక కుట్ర ఉంది

హైకోర్టుకు నివేదించిన పోలీసుల తరఫు సీనియర్‌ న్యాయవాదులు

సాక్షి, అమరావతి: టీడీపీ కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్‌ మంజూరు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై గత కొద్ది రోజులుగా విచారణ జరుపుతున్న న్యాయమూర్తి డాక్టర్‌ జస్టిస్‌ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌ గురువారం వాటిని మరోసారి విచారించారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేష్, విజయవాడ నేత దేవినేని అవినాష్‌ మరికొందరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరఫు న్యాయవాదుల వాదనలు ముగియడంతో పోలీసుల తరఫున సీనియర్‌ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు తమ వాదనలు వినిపించారు. ఈ దాడి వెనుక ఉన్న కుట్రను బయటకు తీయాల్సి ఉందన్నారు. దాడి వెనుక పిటిషనర్లు ఉన్నారని, వాస్తవాలను రాబట్టేందుకు వారి కస్టోడియల్‌ విచారణ అవసరమని తెలిపారు. అప్పటి దర్యాప్తు అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సాంకేతిక ఆధారాల విషయంలో శ్రద్ధ చూపలేదన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపినందుకు ముగ్గురు పోలీసులను సస్పెండ్‌ చేశామని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి వాదనల నిమిత్తం విచారణను 14కి వాయిదా వేశారు. ఆ రోజున పోలీసుల తరఫున న్యాయవాదులు లూథ్రా, పోసాని తమ తమ వాదనలను కొనసాగిస్తారు.

ముందస్తు బెయిల్‌ ఇవ్వాలంటూ విజయ్‌ పాల్‌ పిటిషన్‌

సాక్షి, అమరావతి: తనపై టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు, నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్‌ మంజూరు చేయాలంటూ సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌ పాల్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం న్యాయమూర్తి డాక్టర్‌ జస్టిస్‌ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌ విచారణ జరిపారు. పిటిషనర్‌ తరఫు న్యాయవాది జీవీఎస్‌ కిషోర్‌ కుమార్‌ వాదనలు వినిపిస్తూ ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. పిటిషనర్‌ను అరెస్ట్‌ చేసే అవకాశం ఉందన్నారు. దీంతో న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. పాల్‌ వ్యాజ్యంలో తనను కూడా ప్రతివాదిగా చేర్చుకుని తన వాదనలు కూడా వినాలంటూ రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్‌ పిటిషన్‌ దాఖలు చేశారు.

శ్రీసిటీలో 500 మంది రక్తదానం

శ్రీసిటీ (వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా)): శ్రీసిటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్‌ జీఎస్టీ కమిషనరేట్, శ్రీసిటీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని మూడు వేర్వేరు ప్రదేశాలలో రక్తదాన శిబిరాలను గురువారం నిర్వహించారు. యాక్సలెంట్‌ ఫార్మా, బ్రేక్స్‌ ఇండియా, ఇసుజు, నిట్టాన్‌ ఇండియా, రాక్‌వర్త్, వెర్మీరియన్, టిల్, ఈప్యాక్‌ సహా 40 పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, సూళ్లూరుపేట గోకులకృష్ణ ఇంజినీరింగ్, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సుమారు 500 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ప్రాణాలను రక్షించే రక్తదానంలో భాగస్వాములైన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు జీఎస్టీ కమిషనరేట్‌ సూపరింటెండెంట్‌ సునీల్‌ గౌతమ్, శ్రీసిటీ వైస్‌ ప్రెసిడెంట్‌ (కస్టమర్‌ రిలేషన్స్‌) రమేష్‌ కుమార్, సీఎస్‌ఆర్‌ మేనేజర్‌ నిరీషా సన్నారెడ్డి, హెచ్‌ఆర్‌ ప్రతినిధి శివకుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్‌ సీనియర్‌ మేనేజర్‌ సురేంద్ర కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేత!

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షలో సీఎం నిర్ణయం



గుంటూరు జిల్లా ఉప్పలపాడు గ్రామ సచివాలయం

సాక్షి, అమరావతి : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రజలు స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేకుండా గ్రామ స్థాయిలోనే సచివాలయాల్లో పూర్తి చేసుకొనేలా రెండేళ్ల క్రితం అప్పటి వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ఈ విధానాన్ని తెచ్చింది. భూముల రీ సర్వే పూర్తయిన 4 వేలకుపైగా గ్రామాల్లో రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. ప్రజలకు అత్యంత సౌకర్యంగా ఉన్న ఈ విధానాన్ని తమ ఆదాయం పోతుందని డాక్యుమెంట్‌ రైటర్లు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉనికికే ప్రమాదమంటూ ఆ శాఖలోని పలువురు సిబ్బంది వ్యతిరేకించారు. అయినప్పటికీ, ప్రజల మేలు కోరిన వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం గ్రామాల్లోనే రిజిస్ట్రేషన్‌ సేవలను అందించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు పెద్దగా జరగడంలేదనే సాకుతో దానిని నిలిపివేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

డాక్టర్‌ అనంత్‌ దర్శన్‌ శంకర్‌కు స్వామినాథన్‌ అవార్డు ప్రదానం



ఈనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ సెంథిల్‌ కుమార్‌ రామమూర్తి హాజరై అవార్డును అనంత్‌ దర్శన్‌ శంకర్‌కు అందజేశారు.

సాక్షి చెన్నై: పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఆయుర్వేద, ఇంటిగ్రేటివ్‌ మెడిసిన్‌ చైర్మన్, ట్రాన్స్‌–డిసిప్లినరీ యూనివర్సిటీ (టీడీయూ)–బెంగళూరు వ్యవస్థాపక వైస్‌ చాన్సలర్‌ పద్మశ్రీ డాక్టర్‌ అనంత్‌ దర్శన్‌ శంకర్‌కు ప్రతిష్టాత్మక డాక్టర్‌ ఎంఎస్‌ స్వామినాథన్‌ అవార్డ్‌–2024ను గురువారం ప్రదానం చేశారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్‌ స్వామినాథన్‌ ఫౌండేషన్‌ నేతృత్వంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఆర్‌సీఎంఈ అధ్యక్షుడు పి.మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తమి

నా భార్య బతికే ఉందయ్యా..

వెంటనే సవరించండి.. భార్యతో కలిసి భర్త నిరసన

సత్యవేడు(తిరుపతి జిల్లా): 'నా భార్య బతికే ఉన్నా.. సచివాలయం రికార్డుల్లో చనిపోయినట్టు ఉంది.. సవరించండి' అంటూ సత్యవేడు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట బాధితులు నిరసన తెలిపారు. సత్యవేడు మండలంలో రేపల్లెవాడ పంచాయతీ నారాయణపురం గ్రామానికి చెందిన టి.మాతయ్య, భార్య టి.సుభద్రకు ఆధార్‌ కార్డు, ఓటరు కార్డులున్నాయి. తన భార్య పేరున రేషన్‌ కార్డు కోసం మాతయ్య దరఖాస్తు చేసుకుంటే.. రేపల్లెవాడ సచివాలయంలోని కంప్యూటర్‌లో తన భార్య చనిపోయినట్టు నమోదై ఉందని అక్కడి సిబ్బంది చెప్పారని టి.మాతయ్య, ఆయన భార్య సుభద్రలు ఆందోళన వ్యక్తం చేశారు. సత్యవేడు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ విషయమై సంబంధిత వీఆర్వోను వివరణ కోరగా కొత్త రేషన్‌ కార్డులు నమోదు కావడం లేదని, కొత్త కార్డులిచ్చే సమయంలో మార్పు చేసేందుకు వీలుంటుందని తెలిపారు.

జేపీసీకి వక్ఫ్ (సవరణ) బిల్లు

లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం


తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు	సమాజాన్ని విచ్ఛిన్నం చేసే క్రూరమైన బిల్లు వద్దంటూ నినాదాలు
వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్	వెనక్కి తగ్గిన ప్రభుత్వం.. బిల్లును జేపీసీ పరిశీలనకు పంపాలని నిర్ణయం

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టం-1995లో పలు మార్పులు తీసుకురావడంతోపాటు చట్టం పేరును 'యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ, డెవలప్‌మెంట్ యాక్ట్-1995'గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్(సవరణ) బిల్లు-2024ను పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, అడ్డుకొనేందుకు ప్రయత్నించాయి. సమాజంలో ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని రూపొందించిన ఈ క్రూరమైన బిల్లు వద్దే వద్దంటూ నినదించాయి. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఈ బిల్లును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. బీజేపీ సహా అధికార ఎన్డీయే కూటమి పక్షాలు బిల్లుకు మద్దతు ప్రకటించాయి. చివరకు ప్రతిపక్షాల నిరసనతో ప్రభుత్వం దిగొచ్చింది. జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు బిల్లును పంపిస్తున్నట్లు ప్రకటించింది.


కిరెణ్ రిజిజు

కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు వక్ఫ్(సవరణ) బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై చర్చ ప్రారంభించారు. బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ నోటీసు ఇచ్చారు. దేశంలో మత స్వేచ్ఛను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, సమాఖ్య వ్యవస్థపై దాడి చేస్తోందని మండిపడ్డారు. ప్రజల మధ్య చిచ్చు పెడుతూ విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, అయినప్పటికీ హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధికోసమే బిల్లును తీసుకొచ్చిందని విమర్శించారు. ఇప్పుడు ముస్లింలపై దాడి చేస్తున్నారని, తర్వాత క్రైస్తవులపై, జైన్‌లపై దాడి చేస్తారని ధ్వజమెత్తారు. అనంతరం విపక్ష సభ్యులు బిల్లుపై దుమ్మెత్తిపోశారు. డీఎంకే ఎంపీ కనిమొళి, తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీ బషీర్ బిల్లును వ్యతిరేకించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెప్పారు. ఎన్డీయేలోని కొన్ని పార్టీ సభ్యులు మాత్రం బిల్లుకు మద్దతు ప్రకటించారు. సభలో వాడీవేడిగా జరిగిన చర్చ తర్వాత మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. బిల్లును జేపీసీ పరిశీలనకు పంపిస్తున్నట్లు తెలిపారు. జేపీసీ ఏర్పాటు కోసం త్వరలో అన్ని పార్టీల నేతలో చర్చిస్తామని వివరించారు. ముసల్మాన్ వక్ఫ్ యాక్ట్-1923ని రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లును సైతం రిజిజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే..


వేణుగోపాల్

బీజేపీ రియల్ ఎస్టేట్ కంపెనీ



''కరడుగట్టిన బీజేపీ మద్దతు దారులను సంతోషపర్చడానికి బిల్లును తీసుకొచ్చారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమిస్తారా? ఇతర మత సంస్థల విషయంలో ఇలాగే చేయగలరా? ఎన్నికల్లో లబ్ధి కోసం బిల్లు రూపొందించారు. బీజేపీ రియల్ ఎస్టేట్ కంపెనీలా పనిచేస్తోంది. ఆ పార్టీ పేరును భారతీయ జమీన్ పార్టీగా మార్చుకోవాలి. వక్ఫ్ బోర్డుల భూములను కాజేయాలని చూస్తున్నారు. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వక్ఫ్ బోర్డు భూములు అమ్మబోమంటూ గ్యారంటీ ఇవ్వాలి. ముస్లింల హక్కులను దోచుకుంటామంటే చూస్తూ ఊరుకోం. కచ్చితంగా అడ్డుకుంటాం''

- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ

మైనార్టీలను రక్షించుకోవడం బాధ్యత



''బిల్లును మేము వ్యతిరేకిస్తున్నాం. ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకోవడం తగదు. బంగ్లాదేశ్‌లో ఏం జరుగుతోందో చూడండి. మైనార్టీలను రక్షించుకోవడం మన నైతిక బాధ్యత. బిల్లు వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం బయటపెట్టాలి. బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. అందరితో చర్చించి పారదర్శకమైన బిల్లు రూపొందించాలి''

- సుప్రియా సూలే, ఎన్సీపీ(శరద్ పవార్)

పారదర్శకత కోసమే మద్దతు



''బిల్లుకు మద్దతిస్తున్నాం. వక్ఫ్ బోర్డుల నిర్వహణలో పారదర్శకతకు ఈ బిల్లు దోహదపడుతుంది. ముస్లిం వ్యతిరేక చర్య అనడంలో అర్థం లేదు. ఎవరికీ వ్యతిరేకం కాదు'' -చిరాగ్ పాశ్వాన్, ఎల్జేపీ చీఫ్, కేంద్ర మంత్రి

ముస్లింలను శత్రువులుగా చూస్తున్నారు



''వక్ఫ్ చట్టంలో ఇష్టారాజ్యంగా సవరణలు చేయడాన్ని ఖండిస్తున్నాం. రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి చేయడం దుర్మార్గం. ముస్లింలను శత్రువులుగా భావిస్తున్నారు. అందుకు ఈ బిల్లే నిదర్శనం. దర్గా, మసీదు, వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నారా? ఈ బిల్లు ద్వారా దేశాన్ని ముక్కలు చేద్దామనుకుంటున్నారా? ఏకం చేద్దామనుకుంటున్నారా? బిల్లుకు వ్యతిరేకంగా ఇప్పటికే రూల్ 72 కింద నోటీసు ఇచ్చాం. ప్రభుత్వం తక్షణమే బిల్లును ఉపసంహరించుకోవాలి''

- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం

వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించింది. సభలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని పార్టీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి తెలిపారు. 'ముస్లిం వర్గాల్లో అనేక ఆందోళనలు ఉన్నాయి. కాబట్టి ఈ బిల్లు మరింత ముందుకు తీసుకెళ్లే క్రమంలో ముస్లిం సమాజాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుకుంటున్నాం. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ లేవనెత్తిన ఆందోళనలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాం. వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉంది'అని ఎంపీ మిథున్ రెడ్డి పేర్కొన్నారు.

టీడీపీ మద్దతు



లోక్‌సభలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లు-2024కు టీడీపీ మద్దతు ప్రకటించింది. బిల్లును స్వాగతిస్తున్నామని టీడీపీ ఎంపీ హరీశ్ చెప్పారు. అన్ని మతాల వారు తమ మత కార్యక్రమాలకు భూములు, ఆస్తులను విరాళంగా ఇస్తుంటారని తెలిపారు. దాతల ప్రయోజనాలు కాపాడేలా సంస్కరణలు తీసుకొచ్చి ఆ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.

ముస్లింలకు వ్యతిరేకం కాదు



ఈ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదు. మతపరమైన విభజనలను ప్రోత్సహించడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. పారదర్శకత కోసమే బిల్లు రూపొందించారు. ప్రతిపక్షాలు ఈ బిల్లును ఆలయాలతో పోలుస్తున్నాయి. అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ పాలనలో వేలాది మంది సిక్కులను ఊచకోత కోశారు. ఇందిరా గాంధీ హత్యకు ఏ ట్యాక్సీ డ్రైవర్ కారణం? దీనిపై కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ సమాధానం చెప్పాలి - రాజీవ్ రంజన్ సింగ్, జేడీ(యూ) సభ్యుడు, కేంద్ర మంత్రి

రాజ్యసభలో వక్ఫ్ ఆస్తుల బిల్లు ఉపసంహరణ

వక్ఫ్ ఆస్తుల(ఆక్రమణదార్ల తొలగింపు) బిల్లు-2014ను ప్రభుత్వం గురువారం రాజ్యసభ నుంచి ఉపసంహరించుకుంది. బిల్లు ఉపసంహరణకు మూజువాణి ఓటుతో సభ్యులు ఆమోదం తెలిపారు. వక్ఫ్ ఆస్తుల్లో ఎవరైనా అనధికారికంగా తిష్టవేస్తే వారిని అక్కడి నుంచి తొలగించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా 2014 ఫిబ్రవరి 18న అప్పటి కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కె.రెహ్మాన్ ఖాన్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 2014 మార్చి 5న బిల్లును పార్లమెంట్ స్థాయీ సంఘం పరిశీలనకు పంపించారు. అప్పటినుంచి బిల్లు పెండింగ్‌లో ఉంది


ప్రమాణం చేస్తున్న యూనస్

బంగ్లా సారథిగా యూనస్

- ప్రమాణం చేయించిన అధ్యక్షుడు
- 16 మందితో సలహామండలి

ఢాకా: నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్(84)ను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా నియమితులయ్యారు. ఈ హోదా ప్రధానమంత్రితో సమానమైనది. గురువారం అధ్యక్ష భవనం 'బంగభవన్'లో అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ ఆయనతో ప్రమాణం చేయించారు. యూనస్‌కు 16 మందితో కూడిన సలహాదారుల మండలి పాలనలో సహకరించనుంది. ఈ మండలికి ఎంపికైన వారిలో రిజర్వేషన్ కోటా ఉద్యమానికి నాయకత్వం వహించిన నాహిద్ ఇస్లాం, ఆసిఫ్ మహ్మూద్‌తోపాటు మహిళా హక్కుల కార్యకర్త ఫరీదా అఖ్తర్ తదితరులున్నారు. వీరితో కూడా అధ్యక్షుడు ప్రమాణం చేయించారు. పౌరులకు భద్రత కల్పించడానికి తన ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందుకు తనకు సాయపడాలని యూనస్ ఈ సందర్భంగా అన్ని వర్గాల వారిని కోరారు.

రాజ్యసభలో తీవ్ర రగడ

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌పై అనర్హత వేటు అంశం పట్ల రాజ్యసభలో అలజడి రేగింది. ప్రతిపక్ష సభ్యులు, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. వినేశ్ ఫోగాట్ అంశంపై సభలో చర్చించేందుకు చైర్మన్ అనుమతి ఇవ్వకపోవడంపై విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ సభ నుంచి వెళ్లిపోయారు. ఎగువ సభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. వినేశ్ ఫోగాట్‌పై అనర్హత అంశంపై తక్షణమే చర్చించాలని పట్టుబట్టారు. అందుకు ధన్‌ఖడ్ అంగీకరించకపోవడంతో తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ ఆయనతో వాగ్వాదానికి దిగారు. డెరెక్ ఓబ్రెయిన్‌తోపాటు విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండడంతో సభలో గందరగోళం నెలకొంది. ఫోగాట్‌పై చర్చించేందుకు ధన్‌ఖడ్ అనుమతి ఇవ్వకపోవడంతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. విపక్ష ఎంపీల తీరు పట్ల ధన్‌ఖడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ఉండలేనని చెప్పారు. భారమైన హృదయంతో సభ నుంచి నిష్క్రమిస్తున్నానని తెలిపారు.

వివాదాస్పద భూములపై... నిర్ణయాధికారం కలెక్టర్లకే

- వక్ఫ్ ట్రిబ్యునల్ నుంచి ఈ అధికారం తొలగింపు
- కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో, రాష్ట్రాల బోర్డుల్లో ఇద్దరేసి మహిళలు
- ముస్లిమేతరులకూ చోటు
- వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించే బోర్డుల అధికారం రద్దు

కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ (సవరణ) బిల్లు తేనెతుట్టను కదిపింది. విపక్షాలు, ముస్లిం సంస్థలు దీనిపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సెంట్రల్ పోర్టల్ ద్వారా క్రమబద్ధీకరించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. వక్ఫ్ భూముల యాజమాన్య హక్కులపై వివాదం తలెత్తితే ఇప్పటిదాకా వక్ఫ్ ట్రిబ్యునల్‌కు నిర్ణయాధికారం ఉండేది. కొత్త బిల్లు ఈ అధికారాన్ని కలెక్టర్లకు కట్టబెడుతోంది. వక్ఫ్ చట్టం-1995ను ఇకపై యునిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్‌గా మారుస్తోంది. మొత్తం 44 సవరణలను ప్రతిపాదిస్తోంది.

వక్ఫ్ అంటే ఏమిటి?

ఇస్లామిక్ చట్టం కింద మతపరమైన, ధార్మిక కార్యక్రమాల నిమిత్తం అంకితం చేసిన ఆస్తిని వక్ఫ్‌గా పేర్కొంటారు. ఒకసారి వక్ఫ్ ఆస్తిగా ప్రకటిస్తే.. ఇక అది అంతిమం. దాన్ని తిరగదోడటానికి ఉండదు. ఈ అంశంపై దృష్టి సారించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.

9 లక్షల ఎకరాలు

దేశంలోని 30 వక్ఫ్ బోర్డులు 9 లక్షల పైచిలుకు ఎకరాలను నియంత్రిస్తున్నాయి. వీటి విలువ రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. భారత్‌లో పెద్ద మొత్తంలో భూములు కలిగి ఉన్న వాటిల్లో రైల్వేలు, రక్షణ శాఖ తర్వాత వక్ఫ్ బోర్డులు మూడో స్థానంలో ఉన్నాయి.

బిల్లులోని కీలకాంశాలు

- ఏదైనా ఒక ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అధికారాన్ని వక్ఫ్ బోర్డులకు కట్టబెట్టింది వక్ఫ్ చట్టం- 1995. అందులోని సెక్షన్-40 ఇందుకు వీలు కల్పించింది. కొత్త బిల్లులో ఈ సెక్షన్- 40 రద్దుకు ప్రతిపాదించారు. ఇలా చేయడం ద్వారా వక్ఫ్ బోర్డుల చేతుల్లో నుంచి కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని లాగేసుకుంటోందని తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దుమారం రేగుతోంది.
- కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ ఏర్పాటు. కౌన్సిల్‌లో, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరేసి ముస్లిం మహిళలకు చోటు. ముస్లిమేతరులకూ స్థానం. ఇద్దరు లోక్‌సభ, ఒక రాజ్యసభ ఎంపీకి కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో చోటు కల్పించాలి. ఈ ముగ్గురు ఎంపీలు ముస్లింలే అయ్యుండాలనే నిబంధనేమీ లేదు. పాత చట్టం ప్రకారం తప్పనిసరిగా ముస్లిం ఎంపీలకే కౌన్సిల్‌లో చోటు ఉండేది. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కూర్పును మార్చే అధికారాన్ని కూడా బిల్లు కేంద్రానికి కట్టబెడుతోంది.
- ఒక ఆస్తి వక్ఫ్‌కు చెందినదా, ప్రభుత్వానిదా అనే వివాదం తలెత్తితే ఇక కలెక్టర్లదే నిర్ణయాధికారం. వక్ఫ్ చట్టం-1995 సెక్షన్- 6 ప్రకారం ఇలాంటి వివాదాల్లో వక్ఫ్ ట్రిబ్యునళ్లు తీర్పు చెప్పేవి. వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటున్న దేన్నైనా కలెక్టర్ ప్రభుత్వ భూమిగా తేల్చితే ఆ మేరకు రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పించొచ్చు. అక్రమంగా ఆస్తులు దక్కించుకోవడానికి స్వార్థపరులు ట్రిబ్యునళ్లను అడ్డం పెట్టుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఏదైనా ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా నమోదు చేసే ముందు సంబంధిత పక్షాలన్నిటికీ నోటీసులు ఇవ్వడం. రెవెన్యూ చట్టాల ప్రకారం నిర్దిష్ట ప్రక్రియను అనుసరించి మ్యూటేషన్ చేయడానికి మార్గదర్శకాలను రూపొందించడం.
- కాగ్ నియమించిన ఆడిటర్ ద్వారా ఏదేని వక్ఫ్ బోర్డు ఆస్తుల తనిఖీకి ఆదేశించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఈ బిల్లు దఖలు పరుస్తుంది.
- బోరాలు, అగాఖానీల కోసం ప్రత్యేకంగా ఔఖాఫ్ బోర్డును ఏర్పాటు చేస్తారు. వక్ఫ్ బోర్డుల్లో షియాలు, సున్నీలు, బోరాలు, ఆగాఖానీలు, ముస్లింలోని ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూస్తుంది.
- తన ఆస్తిని దానంగా ఇవ్వడానికి ఒక వ్యక్తి సిద్ధపడినపుడు.. అతను రాసిన చెల్లుబాటయ్యే అంగీకారపత్రాన్ని (వక్ఫ్‌నామా)ను కొత్త బిల్లు తప్పనిసరి చేస్తోంది. ప్రస్తుతం ఒక వ్యక్తి మౌఖికంగా కూడా తన ఆస్తిని వక్ఫ్‌కు ఇవ్వొచ్చు.
- ఐదేళ్లుగా ఇస్లాంను ఆచరిస్తూ.. ఆస్తిపై యాజమాన్య హక్కులున్నపుడే వక్ఫ్ ఇవ్వొచ్చు.
- వక్ఫ్ బోర్డులకు వచ్చే డబ్బును వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథల సంక్షేమం కోసం వినియోగించాలి. అదీ ప్రభుత్వం సూచించిన పద్ధతుల్లో.

- నేషనల్ డెస్క్, సాక్షి

బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత

- శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ తుదిశ్వాస
- నేడు అంతిమయాత్ర... మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత
- డీవైఎఫ్ఐ కార్యకర్త నుంచి సీఎం స్థాయికి ఎదిగిన బుద్ధదేవ్

కోల్‌కతా: సీపీఎం సీనియర్ నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూశారు. 80 ఏళ్ల బుద్ధదేవ్ గురువారం ఉదయం 8.20 గంటలకు మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. శ్వాసకోస వ్యాధితో దీర్ఘకాలంగా బాధపడుతున్న ఆయన కోల్‌కతాలోని పామ్ అవెన్యూలో ఉన్న తన ఫ్లాట్‌లో తుదిశ్వాస విడిచారు. గతేడాదే ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో ఆస్పత్రిలో చేరారు. ఆ తర్వాత కోలుకున్నారు. మళ్లీ ఇటీవల అనారోగ్యం పాలయ్యారు. ఆయనకు భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు. ప్రజల సందర్శనార్థం భట్టాచార్య భౌతికకాయాన్ని శుక్రవారం తొలుత బెంగాల్ అసెంబ్లీ, తర్వాత సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి, డీవైఎఫ్ఐ కార్యాలయానికి తరలిస్తారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించి, మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తారు.

కార్యకర్త నుంచి ముఖ్యమంత్రిగా..

సీపీఎం అత్యున్నత నిర్ణాయక విభాగమైన పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు అయిన భట్టాచార్య 1944 మార్చి 1న కోల్‌కతాలో జన్మించారు. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కళాశాల నుండి బెంగాలీలో బీఏ ఆనర్స్ చేశారు. 1966లో పార్టీలో చేరారు. సీపీఎం యువజన విభాగమైన డీవైఎఫ్ఐలో చేరారు. రాజకీయాల్లోకి రాకముందు పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సేవలందించిన ఆయన 2000లో జ్యోతిబసు సీఎం పదవి నుంచి వైదొలగక ముందు ఉపముఖ్యమంత్రిగా పదోన్నతి పొందారు. జ్యోతిబసు తరువాత సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2000 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. జ్యోతిబసు పాలనతో పోలిస్తే భట్టాచార్య హయాంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం పారిశ్రామిక వర్గాల పట్ల సానుకూలంగా వ్యవహరించింది. విచిత్రమేమిటంటే పారిశ్రామికీకరణకు సంబంధించిన సీపీఎం విధానాలే 2011 ఎన్నికల్లో వామపక్షాల పరాజయానికి బాటలు వేశాయి.

'పద్మభూషణ్' తిరస్కరణ

కేంద్రం 2021లో బుద్ధదేవ్‌కు పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది. ఆ అవార్డును ఆయన తిరస్కరించారు.

ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

బుద్ధదేవ్ మరణం పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. బెంగాల్ అభివృద్ధికి కృషి చేశారని, ప్రజలకు విశిష్టమైన సేవలు అందించారని బుద్ధదేవ్‌ను మోదీ కొనియాడారు. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితరులు సంతాపం తెలిపారు.





మద్దతు ధర టీడీపీ, జేడీ(యూ)కేనా?

- పంటలకు కనీస మద్దతు ధర కల్పించాల్సిందే
- పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర కల్పించి, రైతన్నలకు న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు గురువారం పార్లమెంట్ ఆవరణలో ప్రదర్శన చేపట్టారు. తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్), శివసేన (ఉద్ధవ్) తదితర పార్టీల సభ్యులు పార్లమెంట్ మకర ద్వారం మెట్లపై గుమికూడారు. ఉల్లిపాయలు, కూరగాయల దండలను మెడపై ధరించి కేంద్ర ప్రభుత్వ తీరు పట్ల నిరసన వ్యక్తం చేశారు. 'పంటలకు కనీస మద్దతు ధర కల్పించండి', 'రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోండి' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. శివసేన(ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ... ''తెలుగుదేశం పార్టీ, జేడీ(యూ)లకు బీజేపీ ప్రభుత్వం కనీస మద్దతు ధర(స్పెషల్ ప్యాకేజీ) అందించింది. అదే తరహాలో రైతులకు కూడా కనీస మద్దతు ధర అందించాలి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ సమానమేనని గుర్తించుకోవాలి. రైతులు దేశంలో ప్రధాన వాటాదార్లు. అందుకే వారికి మద్దతు ప్రకటిస్తున్నాం'' అని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి విదేశాలకు ఉల్లిపాయల ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేయాలని కేంద్రానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగేలా చూడడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

జపాన్‌ను కుదిపేసిన తీవ్ర భూకంపం

టోక్యో: జపాన్ దక్షిణ తీర ప్రాంతంలో గురువారం శక్తివంతమైన భూకంపం సంభవించింది. క్యుషు దీవిలో ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదైంది. భూమికి సుమారు 30 కిలోమీటర్ల అడుగున భూకంప కేంద్రం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. నిచినన్ నగరంతోపాటు మియజాకి ప్రిఫెక్చర్ తీవ్ర ప్రభావానికి గురైంది. భూకంప కేంద్రానికి సమీపంలోని మియజాకి విమానాశ్రయంలో భవనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. ముందు జాగ్రత్తగా అధికారులు రన్‌వేను మూసివేశారు. పొరుగునే ఉన్న కగోషియా ప్రిఫెక్చర్‌లోని ఒసాకిలో కాంక్రీట్ గోడలు ధ్వంసమయ్యాయి. క్యుషు, షికోకు దీవుల తీరం వెంబడి అలలు సుమారు 1.6 అడుగుల ఎత్తున సుమారు అరగంటసేపు ఎగిసిపడ్డాయి. దీంతో, అధికారులు ముందు జాగ్రత్తగా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీరప్రాంతాల వైపు వెళ్లరాదని ప్రజలకు సూచనలిచ్చారు. భూకంపం తాకిడితో ముగ్గురు గాయపడినట్లు అధికారులు తెలిపారు.

అక్టోబర్‌లో కశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా

కేంద్ర మంత్రి అథవాలె వెల్లడి



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు అక్టోబర్‌లో రాష్ట్ర హోదా పునరుద్ధరణతోపాటు అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలె చెప్పారు. శ్రీనగర్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీలకు అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. అప్పుడే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ ప్రకటన వెలువడే అవకాశాలు కూడా ఉన్నాయి'అని మంత్రి అథవాలె వివరించారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామంటూ గతంలో ఆర్టికల్ 370 రద్దు సమయంలోనే హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు జరపండి

ఈసీకి కశ్మీర్ రాజకీయ పార్టీల డిమాండ్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఆ కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన రాజకీయ పార్టీలు ప్రధానంగా డిమాండ్ చేశాయి. గురువారం శ్రీనగర్‌లో ఎన్నికల కమిషన్ ఇక్కడి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సారథ్యంలోని బృందం షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ), పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ(పీడీపీ), బీజేపీ, కాంగ్రెస్, జమ్మూకశ్మీర్ పాంథర్స్ పార్టీ(జేకేపీపీ) తదితర పార్టీల ప్రతినిధులతో సమావేశమైంది. సీఈసీతోపాటు కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, ఎస్ఎస్ సంధుల బృందం ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఈసీ అధికారులు మీడియాతో మాట్లాడారు. కేంద్ర పాలితప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు జరపాలన్న డిమాండ్‌ను ప్రధానంగా అన్ని రాజకీయ పార్టీలు వినిపించాయని వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు నిష్పాక్షికంగా, పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించాలని కూడా పార్టీల ప్రతినిధులు కోరారన్నారు. అనంతరం ఈసీ బృందం ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లతోపాటు చీఫ్ సెక్రటరీ, పోలీస్ డైరెక్టర్ జనరల్‌తో సమీక్ష సమావేశం జరిపింది. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై వారితో చర్చించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30వ తేదీలోగా కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు.

రేపు వయనాడ్‌కు ప్రధాని మోదీ



తిరువనంతపురం: కేరళలోని వయనాడ్‌లో ఈనెల 10న ప్రధాని మోదీ పర్యటించనున్నారని సీఎం పినరయి విజయన్ చెప్పారు. జిల్లాలో ఇటీవల భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి వందలాదిమంది చనిపోవడం తెల్సిందే. బాధిత ప్రాంతాల్లో ప్రధాని పర్యటిస్తారని విజయన్ వివరించారు. ఈ దుర్ఘటనలో బాధితులకు పునరావాసం కల్పించే విషయంలో ప్రధాని మోదీ సానుకూలంగా ఉన్నారని సీఎం విజయన్ చెప్పారు. తమ వినతి మేరకు 9 మంది నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ అంగీకరించిందన్నారు. ఈ కమిటీ విపత్తు తీవ్రతను అంచనా వేసి, నివేదిక ఇస్తుందన్నారు. ఈ దుర్ఘటనలో 131 మంది వరకు గల్లంతైనట్లు గుర్తించామన్నారు. వీరి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు. కాగా, కొండచరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలంటూ డిమాండ్లు వినిపిస్తున్న వేళ ప్రధాని మోదీ వయనాడ్‌లో పర్యటనకు రానుండటం గమనార్హం.

టేలర్ స్విఫ్ట్ కచేరీపై ఉగ్రదాడికి కుట్ర

భగ్నం చేసిన ఆస్ట్రియా అధికారులు



వియన్నా: ఆస్ట్రియా భద్రతాధికారులు సకాలంలో స్పందించి పెనుముప్పు నివారించగలిగారు. అమెరికా గాయని టేలర్ స్విఫ్ట్ గురువారం రాజధాని వియన్నాలో తలపెట్టిన కచేరీలో నరమేధానికి ఉగ్రవాదులు పన్నిన కుట్రను భగ్నం చేశారు. 19 ఏళ్ల ప్రధాన సూత్రధారి సహా 17 ఏళ్ల మరో యువకుడిని అరెస్ట్ చేశారు. 15 ఏళ్ల మరో అనుమానితుడిని ప్రశ్నిస్తున్నారు. ఎర్నెస్ట్ హాపెల్ స్టేడియానికి వచ్చే వారిని పేలుడు పదార్థాలు వాడి లేదా కత్తులతో పొడిచి సాధ్యమైనంత ఎక్కువమందిని చంపాలని పథకం వేసినట్లు తేలింది. వీరికి ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)తో సంబంధాలున్నట్లు సోదాల్లో అధికారులు గుర్తించారు. ఈ పరిణామం నేపథ్యంలో టేలర్ పాల్గొనాల్సిన మొత్తం మూడు కచేరీలను రద్దు చేశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024


గురువారం నెలమంగళ వద్ద దాసనపురకు చేరిన 50 వసంతాల కన్నడ జ్యోతి రథ యాత్ర


బెంగళూరు హడ్సన్ కూడలిలో గంధభేరుండ ప్రతిమ ఏర్పాటు పనులు

న్యూస్‌రీల్

దర్శన్‌కు ఇంటి భోజనం లేనట్టే!

- జైలు అధికారుల విముఖత


భోజనం ఆరగిస్తున్న దర్శన్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పరప్పన అగ్రహార జైలులో ఉన్న హీరో దర్శన్ ఇంటి భోజనం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దర్శన్‌కు ఇంటి భోజనాన్ని అనుమతించలేమని, ఆ అవసరం కూడా లేదని జైలు అధికారులు కోర్టుకు తెలిపారు. ఇంటి భోజనం కోసం దర్శన్ హైకోర్టును ఆశ్రయించగా, మీ వైఖరి ఏమిటో చెప్పాలని జైలు అధికారులకు హైకోర్టు ఆదేశించింది. గత నెల రోజులుగా ఇంటి భోజనం కేసు సాగుతోంది. హత్య కేసులో నిందితుడికి ఇంటి భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించలేమని కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణ 20వ తేదీకి వాయిదా వేశారు.

ప్రజ్వల్ బెయిలు అర్జీపై వాదనలు

మహిళలపై లైంగిక దౌర్జన్యం కేసులో పరప్పన జైలులో ఉన్న జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ పిటిషన్ విచారణను కోర్టు ఆగస్టు 29కి వాయిదా వేసింది. బెయిలు ఇవ్వడంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 29లోపు పిటిషన్ వేసుకోవాలని పోలీసుల వకీలుకు ఆదేశించింది. ఈ కేసుల్లో రేవన్న తల్లిదండ్రులు, మరో కేసులో సోదరుడు సూరజ్‌కు గతంలనే బెయిలు వచ్చింది.

సీఎం, డీసీఎంలకు సమన్లు

గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఈడీ విచారణ చేయడాన్ని ఖండిస్తూ ధర్నాలో పాల్గొన్న 102 మందికి కోర్టు సమన్లు పంపించింది. వీరిలో సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ కూడా ఉన్నారు. ధర్నా చట్ట వ్యతిరేకమని నగర విల్సన్ గార్డెన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో బెంగళూరు 42వ ఏసీఎంఎం కోర్టు విచారణకు సంబంధించి సమన్స్ జారీ చేసింది.

దోమల వ్యాప్తి కారకులను శిక్షించాలి

- సర్కారుకు హైకోర్టు సూచన
- డెంగీ జ్వరాల బెడదపై ఆగ్రహం



శివాజీనగర: నగరంలో పాటుగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో డెంగీ జ్వరాల నియంత్రణకు మరిన్ని చర్యలు తీసుకోవాలని, దోమల ఉత్పత్తికి కారణమయ్యేవారికి జరిమానా విధించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, బీబీఎంపీకి హైకోర్టు సూచించింది. రాష్ట్రంలో ఈ సంవత్సరం డెంగీ జ్వర పీడితుల సంఖ్య 20 వేలకు చేరినట్లు మీడియాలో జోరుగా వార్తలు రావడంపై సుమోటోగా విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీ అంజారియా.. జ్వర నివారణకు కఠిన సూచనలు చేశారు. అంతకు ముందుగా ప్రభుత్వం , బీబీఎంపీల న్యాయవాదులు.. డెంగీ జ్వరం కేసుల నియంత్రణ, సోకితుల చికిత్సకు చేపట్టిన చర్యలను వివరించారు. అయితే జ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని అనిపిస్తుంది, అందుచేత మరిన్ని నివారణ చర్యలు తీసుకోవాలని జడ్జి ఆదేశించారు. బెంగళూరులో దోమలు ఉత్పత్తి అయ్యే 51 హాట్ స్పాట్‌లను గుర్తించడమైనదని బీబీఎంపీ తరపు వకీలు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో హాట్ స్పాట్‌లు ఉండడానికి వీల్లేదు, దోమల ఉత్పత్తికి కారణమయ్యేవారిపై జరిమానా విధించడం, లేదా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ధర్మాసనం సలహానిచ్చింది. ఆపై కేసును ఆగస్టు 28కి వాయిదా వేశారు.





గురువారం పుష్ప ప్రదర్శనలో సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు


పూల రూపాలను తిలకిస్తున్న బాలలు

సుగంధాల పుష్ప సరాగం

- లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షో ఆరంభం
- పూల రూపాల కనువిందు


సీఎం సిద్దు, మంత్రులు

బనశంకరి: స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా బెంగళూరు లాల్‌బాగ్‌లో లక్షలాది పుష్పాలతో మది దోచే ఫ్లవర్ షో ఆరంభమైంది. 216వ పుష్ప ప్రదర్శనను గురువారం సీఎం సిద్దరామయ్య ప్రారంభించారు. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర, పార్లమెంటు భవనం థీమ్ ఆధారంగా ఈసారి పుష్ప ప్రదర్శనను తీర్చిదిద్దారు. ఈ నెల 19వ తేదీ వరకు ఫ్లవర్ షో కొనసాగుతుంది.

సీఎం మాట్లాడుతూ భారత సమాజానికి అంబేడ్కర్ అందించిన సేవలు అపారమన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మనవడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్, మంత్రులు ఎస్ఎస్.మల్లికార్జున్, రామలింగారెడ్డి, జమీర్‌అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

రూ. 2.80 కోట్ల వ్యయం

ఫ్లవర్ షోలో 3.6 లక్షలు గులాబీలు, 2.4 లక్షలు చామంతులతో పార్లమెంటు థీమ్, గ్లాజ్ హౌస్ కుడివైపున 3.4 లక్షల పూలతో అంబేడ్కర్ స్మారకాలను ఏర్పాటు చేశారు. ఈసారి రూ.2.80 కోట్లను వెచ్చించారు. గత ఏడాది ఫ్లవర్ షోకు రూ. 2 కోట్లు ఖర్చు చేశారు. సుందరమైన అనేక పూల రూపాలు కనువిందు చేస్తాయి. దివంగత సీఎం కెంగల్ హనుమంతయ్య గురించి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భద్రత కోసం ఫ్లవర్ షో ఆవరణలో సుమారు 139 చోట్ల సీసీ కెమెరాలతో నిఘాపెట్టారు. 400 మందికి పైగా పోలీసులు , బీబీఎంపీ మార్షల్స్‌ను నియమించారు. తొలిరోజు ఓ మోస్తరుగా సందర్శకులు, బాలల సందడి కనిపించింది.

వాహనాల పార్కింగ్ ఇక్కడ

- మరిగౌడ రోడ్డు- అల్ అమీన్ కాలేజీ ఆవరణలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయాలి
- కేహెచ్ రోడ్డు- శాంతినగర బీఎంటీసీ బస్టాండు పైన కార్లు పార్కింగ్
- మరిగౌడ రోడ్డు- హాప్‌కామ్స్‌లో బైక్‌లు, కార్లు పార్కింగ్ చేయవచ్చు
- జేసీ రోడ్డు- కార్పొరేషన్ పార్కింగ్ స్థలంలోనూ బైక్‌లు, కార్లు తదితరాలకు పార్కింగ్ వసతి.



పుష్పాలలో ఒదిగిన త్రివర్ణ భారతం, చిత్రం ముందు ఫోటోకు యువతి పోజు

యథేచ్ఛగా కాల్ డేటా సేకరణ

- డిటెక్టివ్ కంపెనీ దందా
- నిందితుల్లో సీఐడీ పోలీస్



బనశంకరి: నగరంలో ప్రైవేటు డిటెక్టిక్ ఏజెన్సీల పేరుతో ప్రజల మొబైల్‌ఫోన్ కాల్ డేటా సేకరించడం, వారి కాల్స్‌ను రహస్యంగా వింటున్న ఉదంతాలు జరుగుతున్నాయి.

ఇలాంటి కేసులో సీఐడీ పోలీస్ సిబ్బంది మునిరత్న, మరో వ్యక్తి నాగేశ్వరరెడ్డిని అరెస్టు చేశారు. మేలో మహానగర డిటెక్టివ్, సెక్యూరిటీ ప్రై.లి. సిబ్బంది అక్రమంగా కాల్ డేటా పొందారని మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు విచారించి పురుషోత్తం, సతీశ్‌కుమార్, తిప్పేస్వామి, మహంతగౌడ, రేవంత, గురుపాదస్వామి, శ్రీనివాస, భరత్ అనేవారిని అరెస్ట్‌చేశారు. నాగేశ్వరరెడ్డికి కాల్ డేటా అందిస్తున్నారని సీఐడీ పోలీస్ మునిరత్నను కూడా అరెస్ట్‌చేశారు.

ఉద్యోగం దుర్వినియోగం

మునిరత్న గత కొన్నేళ్లుగా సీఐడీ టెక్నికల్ సెల్‌లో పని చేస్తున్నాడు. టెలికాం కంపెనీలకు ఉన్నతాధికారులు సీడీఆర్ కావాలని లేఖలు పంపేవారు. అందులో మునిరత్న తనకు కావలసిన నంబర్లను కూడా చేర్చి కాల్ డేటా తీసుకుని నాగేశ్వరరెడ్డికి ఇచ్చేవాడు, ఇందుకు డబ్బు ముట్టేది. ఎక్కువగా భార్యాభర్తలు, ప్రేమ జంటలు తమ భాగస్వాములు ఎవరితో ఎక్కువగా మాట్లాడుతున్నారో తెలుసుకునేందుకు కాల్ డేటా అడిగేవారు. పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు కూడా తమ ప్రత్యర్థుల సీడీఆర్ తీసుకుంటున్నట్లు అనుమానం వ్యక్తమైంది. కొందరు పోలీస్ అధికారులు తమ భార్యల ఫోన్ కాల్స్ వివరాలు తీసుకుంటున్నట్లు తెలిసింది. మామూలుగా కాల్ డేటా పొందడం చట్ట విరుద్ధం. కేసు విచారణలో ఉంది.

సీఎంపై ప్రైవేటు కేసు దాఖలు

శివాజీనగర: ముడా ఇళ్ల స్థలాలకు సంబంధించి సీఎం సిద్దరామయ్యపై ప్రజా ప్రతినిధుల కోర్టులో మైసూరుకు చెందిన ఆర్‌టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. అక్రమాలపై ఆధారాలు అని పలు పత్రాలను జడ్జి గజానన భట్‌కు అప్పగించారు. త్వరలో విచారణకు వచ్చే అవకాశముంది. కృష్ణ తరఫున హైకోర్టు న్యాయవాది లక్ష్మీ అయ్యంగార్ గురువారం మధ్యాహ్నం ఈ ప్రైవేట్ కేసును వేశారు.

బెంగళూరు.. మెట్రో సిటీ కాదు



- ఆ హోదా ఇవ్వలేం: కేంద్రం
- మరోసారి మొండిచేయి

సాక్షి, బెంగళూరు: దేశంలో ఐటీ రాజధాని, ఉద్యాన నగరిగా పేరు గాంచిన బెంగళూరు నగరానికి మెట్రో హోదా దక్కలేదు. బెంగళూరుకు మెట్రో స్థానం ఇవ్వలేదని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా బెంగళూరుకు మెట్రో నగర హోదా ఇవ్వాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. కానీ ప్రతిసారీ నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుత లోకసభ సమావేశాల్లో ఆర్థిక శాఖ స్వతంత్ర మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ 1962 ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 2ఏ ప్రకారం మెట్రో నగరాలకు, ఇతర నగరాలకు వ్యత్యాసం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల్లో ఎలాంటి మార్పు చేయలేదని తెలిపారు. ఆ నిబంధనలకు అనుగుణంగా బెంగళూరుకు మెట్రో నగర హోదా కల్పించలేదని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై మాత్రమే మెట్రో నగర హోదాను కలిగి ఉన్నాయి.

ఏమిటీ ప్రయోజనం?

మెట్రో హోదా వల్ల ఉపయోగం ఏమిటమంటే.. ఈ నగరాల్లో నివసించే ప్రజలకు కొన్ని పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇంటి అద్దె భత్యానికి ఐటీ నుంచి మినహాయింపు ఉంటుంది. మెట్రో నగరాల్లో ఆదాయ పన్ను దాఖలు సమయంలో 50 శాతం జీతాన్ని మాత్రమే పరిగణిస్తారు.

వక్ఫ్ చట్ట సవరణ తగదు

- కేంద్ర సర్కారుపై సీఎం సిద్దు ధ్వజం

శివాజీనగర: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అల్పసంఖ్యాకులకు వ్యతిరేకం. కాబట్టే వక్ఫ్ చట్టానికి సవరణ చేస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎస్.నిజలింగప్ప వర్ధంతి సందర్భంగా గురువారం విధానసౌధ ఆవరణలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. విలేకరులతో మాట్లాడిన సీఎం.. మైనారిటీలకు వ్యతిరేకంగా వక్ఫ్ చట్టం తెస్తున్నారని కేంద్రంపై మండిపడ్డారు. బీజేపీ మతతత్వ పార్టీ అని అన్నారు. తాము ఆ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

బద్ధవైరితో భేటీ గురించి..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బీ.కే.హరిప్రసాద్‌ను తాను భేటీ చేయడంలో ప్రత్యేకత ఏమీ లేదు. చాలా రోజుల నుండి హరిప్రసాద్‌ను కలవలేదు. అందుకే సమావేశమై క్షేమ సమాచారాలు మాట్లాడుకున్నట్లు సిద్దరామయ్య చెప్పారు. తనకు మంత్రి పదవి ఇవ్వలేదని హరిప్రసాద్ సీఎంపై గతంలో తీవ్ర ఆరోపణలు చేయడం తెలిసిందే. కాగా, శుక్రవారం మైసూరులో జరిగే సమావేశంలో బీజేపీ అబద్ధాల ఆరోపణలకు తగిన సమాధానం చెబుతామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎస్.నిజలింగప్ప రాష్ట్ర అభివృద్ధికి పునాది వేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర చాలా ప్రాముఖ్యమైనదని సీఎం తెలిపారు.

మైసూరులో అవయవదానం

మైసూరు: చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకా బేగూరు ఫిర్కా హొసపుర గ్రామానికి చెందిన సిద్దప్ప (58) అనే వ్యక్తి ఐదు రోజుల క్రితం హిరికాటి గేట్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స ఫలించక బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. దీంతో వైద్యుల వినతి మేరకు కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. సిద్దప్ప దేహం నుంచి ముఖ్యమైన అవయవాలను సేకరించి అవసరమైన రోగుల కోసం పంపించారు.

బలప్రదర్శనకు రాచనగరి సిద్ధం


గురువారం మండ్య జిల్లా తూబిగెరె వద్ద బీజేపీ, జేడీఎస్ పాదయాత్ర


కళాకారుల నృత్య సంభ్రమం

- నేడు కాంగ్రెస్ జనాందోళన సభ
- రేపు బీజేపీ పాదయాత్ర ముగింపు సభ

మైసూరు: సీఎం సిద్దరామయ్య మైసూరులో ముడా నుంచి 14 స్థలాలను పొందిన వివాదంలో అనుకూలంగా, వ్యతిరేక ప్రదర్శనకు ఆయన సొంత జిల్లా కేంద్రం మైసూరు సిద్ధమైంది. సిద్దరామయ్యకు మద్దతుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మైసూరులో జనాందోళన సభ ద్వారా సత్తా చాటేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. మరో వైపు సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలని , కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని జేడీఎస్‌తో కలిసి బీజేపీ కెంగేరి నుంచి మైసూరు వరకు అట్టహాసంగా చేపట్టిన చలో మైసూరు పాదయాత్ర ముగింపు సమావేశం శనివారం మైసూరులో జరగనుంది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల బలప్రదర్శనకు మైసూరు ముస్తాబవుతోంది. రెండు సభలకు కేంద్ర నాయకులు రాబోతున్నందున విజయవంతానికి పాటుపడుతున్నారు.

మండ్యకు చేరిన పాదయాత్ర

బీజేపీ, జేడీఎస్ ఉభయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా చలో మైసూరు పాదయాత్రను కొనసాగిస్తున్నారు. యాత్ర పొడవునా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. పాదయాత్ర గురువారం మండ్య జిల్లా తూబినకెరెకు చేరుకుంది. విజయేంద్ర, హెచ్‌డీ నిఖిల్ సహా పెద్దసంఖ్యలో నేతలు జెండాలు చేపట్టి కదిలారు. కళాకారుల ప్రదర్శనలు అలరించాయి.

క్లుప్తంగా

దివ్యాంగ బాలలను ఆదరించాలి



దివ్యాంగ బాలలకు మిఠాయి పంచుతున్న దృశ్యం

తుమకూరు: దివ్యాంగ బాలల పోషణ వారి తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజా ప్రతినిధులు, ప్రతి ఒక్క పౌరుని బాధ్యత అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీ.సోమశేఖర్ అభిప్రాయపడ్డారు. నగరంలోని గాంధీనగర్‌లోని మానస బుద్ధిమాంద్య బాలల పాఠశాలలో దివ్యాంగుల మధ్య ఆయన తన జన్మదిన వేడుక నిర్వహించుకున్నారు.
అనంతరం డాక్టర్ సోమశేఖర్, సర్వమంగళ దంపతులు కేక్ కత్తిరించి బాలలకు పంచిపెట్టడమేగాక మధ్యాహ్న భోజనం అందించారు. దివ్యాంగ బాలల కోసం శాశ్వత భవన నిర్మాణానికి పాలక మండలి పూనుకుంటే తన చేతనైన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలి



సమావేశంలో పాల్గొన్న మంత్రి కెజె జార్జ్

చిక్కబళ్లాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం కుసుమ సోలార్ ప్లాంట్లు మంజూరు చేస్తున్నాయని, వాటిని ఏర్పాటు చేసుకొని లబ్ధి పొందాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జార్జ్ పిలుపునిచ్చారు. జిల్లా పాలక మండలి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రగతి పరిశీలనా సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. వరుణుడు కరుణించినందున జలాశయాలు నిండి విద్యుత్ ఉత్పత్తి పెరిగిందన్నారు. ఇతర రాష్ట్రాలకు సైతం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 80 శాతం రాయితీ లభిస్తుందన్నారు. రైతులు తమ పొలాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. దిబ్బూరు, కేతేనహళ్లి మార్గంలో విద్యుత్ అంతరాయాన్ని సరిచేస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, గౌరిబిదనూరు ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ, కలెక్టర్ రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.

14 బోర్లు మంజూరు



బోరు వేస్తున్న దృశ్యం

చింతామణి: చింతామణి పట్టణంలో తాగునీటి సమస్య తీర్చడానికి 14 బోర్లు మంజూరయ్యాయి. దీంతో గురువారం పట్టణంలోని శ్రీరామనగరలో బోర్లు వేసే కార్యక్రమాన్ని కౌన్సిలర్లు ప్రారంభించారు. కౌన్సిలర్ రెడ్డెప్ప మాట్లాడుతూ నాయనహళ్లి దగ్గర రెండు బోర్లు, నెక్కుంది పేటలో రెండు, చేలూరు రోడ్డులో రెండు, శ్రీరామనగరలో రెండు, కోలారు క్రాస్‌లో మూడు, మిగతావి సమస్యలున్న చోట వేస్తామని తెలిపారు. కౌన్సిలర్లు సుమిత్ర, రేఖా, జగదీశ్‌రెడ్డి, అనీల్, రాజాచారి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యత అభినందనీయం



పదాధికారులతో స్వామీజీ

తుమకూరు: తుమకూరు రోటరీ క్లబ్ చరిత్రలోనే మొదటిసారిగా రాజేశ్వరి అనే మహిళ అధ్యక్షురాలుగా ఎన్నిక కావడం సువర్ణాక్షరాలతో లిఖించదగిన పరిణామమని సిద్దగంగా మఠం అధ్యక్షులు సిద్ధలింగ స్వామీజీ పేర్కొన్నారు. రోటరీ తుమకూరు సేవా సంస్థ నగరంలోని బీహెచ్ రోడ్డులోని రోటరీ బాలభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్వామీజీ అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ఇకపై రోటరీలో మహిళలు ఎక్కువ సంఖ్యలో చేరాలని అన్నారు. అనంతరం స్వామీజీకి పాదపూజ నెరవేర్చారు. వీరశైవ మహాసభ జిల్లాధ్యక్షుడుగా ఎంపికైన సిద్ధగంగా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పరమేశ్‌ను సన్మానించారు. ఇన్నర్ వీల్ సంస్థ అధ్యక్షురాలు శీలా మధు, కాడదేవర మఠ, బసవరాజ హిరేమఠ, ఉమేష్ పాల్గొన్నారు.

శివరాజ్‌కుమార్ షష్టిపూర్తి వేడుక

యశవంతపుర: నటుడు శివరాజ్‌కుమార్ షష్టిపూర్తి వేడుకను ఆచరించారు. తమిళనాడులోని అభిరామి అమృత కదేశ్వరర్ ఆలయంలో శివరాజ్‌కుమార్ తన సతీమణి గీత శివరాజ్‌కుమార్‌కు మాంగళ్యధారణ చేశారు. అనంతరం దంపతులు దండలు మార్చుకున్నారు. కార్యక్రమంలో కుమార్తెలు నివేదిత, నిరుపమ పాల్గొన్నారు.

జాడ లేని గృహలక్ష్మి, యువనిధి

- కాంగ్రెస్ సర్కార్ నగదు గ్యారెంటీలకు తప్పని ఎదురు చూపులు
- మూడు నెలలుగా మహిళల ఖాతాలకు జమ కాని నగదు



గృహలక్ష్మి పథకం లోగో



యువనిధి పథకం లోగో

సాక్షి బళ్లారి: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన భూమిక పోషించిన ఐదు గ్యారెంటీలు ఆరంభ శూరత్వమేనా? అమలు చేసిన సంక్షేమ పథకాలను లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారా? సంక్షేమ పథకాల ద్వారా అధికారం చేజిక్కించుకొన్న కాంగ్రెస్ పార్టీ పాలకులు వాటిని గాలికి వదిలేస్తున్నారా? అనే ప్రశ్నలకు ఔను అనే సమాధానం వినిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 ఆగస్టు 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళా లబ్ధిదారులకు ప్రతి నెల రూ.2 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసింది. దాదాపు 9 నెలల పాటు గృహలక్ష్మి పథకం కింద మహిళల ఖాతాల్లోకి ప్రతి నెల క్రమం తప్పకుండా మహిళలకు నగదు అందజేయడంతో గృహలక్ష్మి పథకంపై మహిళలు ఎంతో ఆశతో నెలనెలా నగదు వస్తుందని వివిధ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. అయితే గత మూడు నెలల నుంచి గృహలక్ష్మి పథకం కింద మహిళల ఖాతాల్లోకి నగదు జమ కాకపోవడంతో మహిళలు నగదు కోసం ఎదురుచూస్తున్నారు.

ఇదిగో ఇస్తాం, అదిగో జమ చేస్తాం అంటున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

సంబంధిత మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వివిధ జిల్లాల పర్యటనల నేపథ్యంలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు అదిగో నగదు జమ చేస్తాం, ఇదిగో నగదు ఇస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ మహిళల ఖాతాల్లోకి నగదు మాత్రం జమ కావడం లేదు. సాంకేతిక కారణాల నెపం చూపి, నిధులు కొరత లేదనే మాటను చెప్పకపోవడం గమనార్హం. గృహలక్ష్మి కోసం మహిళలు ఎదురు చూస్తుండగా యువనిధి కూడా యువతకు సక్రమంగా చేరడం లేదు. డిగ్రీ పూర్తి చేసిన వారికి ఉద్యోగం రాకపోతే రూ.3 వేల నగదు జమ చేస్తామని హామీ ఇచ్చారే కానీ గత ఏడాది నుంచి ఇంజినీరింగ్, బీఏ, ఎంఏ, వివిధ డిగ్రీలు పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు యువనిధి ద్వారా నగదు ఇవ్వడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యువనిధి, గృహలక్ష్మి రెండు పథకాల ద్వారా లబ్ధిదారులకు నెల నెల నగదు జమ కాకపోవడం, ఐదు గ్యారెంటీల్లో మరొక సంక్షేమ పథకం అయిన రేషన్ కార్డులున్న వారికి ఐదు కేజీల ఉచిత బియ్యానికి బదులుగా సంబంధిత నగదు కూడా జమ కావడం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఐదు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు అంతంత మాత్రంగానే ప్రయోజనం చేకూరుతోంది.

సర్వత్రా వెల్లువెత్తుతున్న విమర్శలు

ఈనేపథ్యంలో సంక్షేమ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన పాలకులు ఓట్లు వేసిన ఓటర్లను మోసం చేస్తూ లబ్ధిదారులకు నెల నెలా వారు ప్రకటించిన పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన తీరును గమనించిన పొరుగు రాష్ట్రాల్లో కూడా గ్యారెంటీల పేరుతో అధికారంలోకి రావడం తెలిసిందే. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే ఫార్ములాతో గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల ద్వారా తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల ద్వారా అధికారంలోకి వచ్చింది. అక్కడ కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు పాలకులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లో సంక్షేమ పథకాల ఆశతో ఓట్లు వేసిన జనం వాటిని అమలు చేయకపోవడంతో పాలకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో 9 నెలల పాటు గృహలక్ష్మి పథకం అష్టకష్టాలతో అమలు చేసి ప్రస్తుతం సాంకేతిక కారణాలతో కాలయాపనం చేస్తుండటంతో గృహలక్ష్మి, యువనిధి, 5 కేజీల రేషన్ బియ్యం నగదు కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



భవిష్యచారి(ఫైల్)

యశవంతపుర: పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకాలో బుధవారం రాత్రి జరిగింది. బెంజనపదవు కరావళి సైట్‌కు చెందిన ఉదయ ఆచార్య కుమారుడు భవిష్య ఆచారి(15) బడకబైలులోని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి 7:30 గంటలకు స్నానం చేసేందుకు వెళ్లాడు. 8 గంటలైనా బాత్‌రూమ్‌నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు తలుపు తెరిచేందుకు యత్నించగా లోపల గడి పెట్టినట్లు తేలింది. దీంతో తలుపు బద్దలు కొట్టగా బాలుడు ఉరి వేసుకున్న దృశ్యం కనిపించింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బంట్వాళ నగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మరొకరి మృతి

రాయచూరు రూరల్: ఇటీవల భోజనం వికటించి నలుగురు దుర్మరణం పాలైన ఘటనలో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మల్లమ్మ(18) బుధవారం సాయంత్రం మరణించింది. జిల్లాలోని సిరవార తాలూకా కల్లూరులో ఒకే కుటుంబానికి చెందిన భీమన్న(60), అతని భార్య ఈరమ్మ(54), కొడుకు మల్లేష్(19), కూతురు పార్వతి(17) గురువారం రాత్రి మరణించారు. రాయచూరు ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ఆస్పత్రిలో చేరిన కోమాలోకి వెళ్లిన మల్లమ్మ చికిత్స పొందుతూ మరణించింది.

పర్యాటక శాఖ స్కాంలో 19 మంది అరెస్ట్

హుబ్లీ: బాగలకోటె జిల్లా పర్యాటక శాఖలో జరిగిన నిధుల దుర్వినియోగం కుంభకోణానికి సంబంధించి అక్కడి పోలీసులు బుధవారం తిరిగి నలుగురిని అరెస్ట్ చేశారు. దీంతో అరెస్ట్ అయిన వారి సంఖ్య 19కి చేరుకుంది. బాగలకోటలోని మల్లప్ప నగర, రవి నగర, ఇలకల్‌కు చెందిన హర్షద్ దోతిహాళ, అమీనా దోతిహాళ అరెస్టయిన నిందితులు. వీరి బ్యాంక్ ఖాతాలకు స్కామ్ సూత్రధారి సురత్‌సగర ప్రభుత్వ నిధులను అక్రమంగా బదలాయించాడు. ఐడీబీఐ బ్యాంక్ కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన సురజ్ పర్యాటక అభివృద్ధి కమిటీ ఖాతా, అలాగే 5 ప్రభుత్వ శాఖల ఖాతాల్లో ఉన్న సుమారు రూ.6 కోట్ల నిధులను అక్రమంగా బదిలీ చేశాడన్న ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

కొత్త వంతెనపై రాకపోకలు షురూ



పరిశీలిస్తున్న అధికారులు

యశవంతపుర: ఉత్తరకన్నడ జిల్లా కాళీనది వద్ద వంతెన కూలిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు గురువారం జిల్లా కలెక్టర్ లక్ష్మీప్రియ, జాతీయ హైవే అథార్టీ, ఐఆర్‌బీ అధికారులు వెళ్లి పరిశీలించారు. కొత్త వంతెనపై రెండువైపుల వాహనాల సంచారానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. వంతెనకు సంబంధించి నాణ్యత ప్రమాణ పత్రం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతానికి వంతెనపై బస్సులు మినహా ఇతర వాహనాలకు అనుతించారు. రెండు వైపుల బారికేడ్లు ఏర్పాటు చేశారు. నాణ్యత ప్రమాణ పత్రం వచ్చిన తరువాత అన్ని వాహనాలను వంతెనపై అనుమతిస్తామన్నారు.

కూలిన పీహెచ్‌సీ పైకప్పు

హుబ్లీ: ఎడతెగని వానల వల్ల శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) కొత్త కట్టడ నిర్మాణానికి విజ్ఞప్తి చేసినా మంజూరు కాక పోవడంతో అదే కట్టడంలో రోగులకు చికిత్స అందిస్తున్న హావేరి జిల్లాలో పీహెచ్‌సీ పైకప్పు చికిత్స అందిస్తున్న వైద్యులపైనే కూలి పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. హావేరి జిల్లా హిరేకెరూరు తాలూకా కోడా గ్రామ పరిధిలోని పీహెచ్‌సీ భారీ వర్షాలతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ కట్టడాన్ని మార్చి కొత్త కట్టడం నిర్మించాలని ఆరోగ్య శాఖకు విజ్ఞప్తి చేసినా పని ఏం జరగలేదు. ఈ క్రమంలోనే గురువారం సదరు కట్టడంలో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులపైనే పైకప్పు ఉన్న ఫళంగా కూలి పడింది. ఎవరికీ పెద్దగా గాయాలు కాలేదు. ప్రత్యేక షెడ్డును నిర్మించి రోగులకు చికిత్స అందించారు. కోడా పీహెచ్‌సీ సుమారు 25 గ్రామాల ప్రజలకు చికిత్స అందించే కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది. ప్రస్తుతం రెండు గదుల్లో రోగులకు చికిత్స ఔషధాలు, ఇతర పనుల్లో ఆరోగ్య శాఖ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ కట్టడాన్ని తక్షణమే మార్చి కొత్త కట్టడం నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

మండ్య: తాలూకాలోని కెరగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని సిద్దేగౌడనదొడ్డి, కెరగోడు గ్రామాల్లో రూ.1.50 లక్షలతో రోడ్డు పనులకు ఎమ్మెల్యే పీ.రవికుమార్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌సీపీ పథకం కింద రోడ్లు, 4 చిన్న వంతెనల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో మన్ముల్ డైరెక్టర్ యూసీ శివకుమార్, జీపీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సభ్యురాలు వసంతమ్మ, టీపీ మాజీ సభ్యుడు ప్రశాంత్ బాబు, పీడీఓ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి కిడ్నాప్

యశవంతపుర: కేరళ వ్యక్తి కిడ్నాప్ అయిన ఘటన మంగళూరులో జరిగింది. నర్సింగ్ కాలేజీలో సీటు ఇప్పిస్తానని కేరళకు చెందిన ఓ వ్యక్తి మరో వ్యక్తి నుంచి రూ. 9 లక్షలు వసూలు చేశాడని సమాచారం. సీటు రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన వ్యక్తి కేరళ వాసిని మంగళవారం సాయంత్రం కిడ్నాప్ చేసినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్యాలయం ఎదుట కన్నడ సంఘాల ధర్నా



ధర్నా చేస్తున్న కన్నడ భాష సంఘాల కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం: రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న గూడ్స్ వాహనాన్ని రిపేరీ అనంతరం యజమానికి ఇవ్వకుండా వేధిస్తున్న కంపెనీ కార్యాలయం ముందు కన్నడ భాషా సంఘాల కార్యకర్తలు గురువారం ధర్నా చేసి వినియోగదారుడికి న్యాయం చేశారు. వివరాలు.. అశ్వత్థనారాయణ అనే వ్యక్తికి చెందిన గూడ్సు వాహనం ఈ ఏడాది మార్చి 29న ఏపీలోని పెనుకొండ వద్ద ప్రమాదానికి గురైంది. రిపేరీ చేసివ్వాలని దొడ్డబళ్లాపురం తాలూకా కెస్తూరు గేట్ వద్ద ఉన్న పీఎస్ఎన్ ఆటోమోటివ్ మార్కెటింగ్ కంపెనీకి అప్పగించారు. ఇన్సూరెన్స్ డబ్బులు కూడా విడుదలయ్యాయి. అయితే ఎక్కువ డబ్బు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కంపెనీ సిబ్బంది వేధించారు. కన్నడ భాషా సంఘాల నాయకులు గురువారం ఆ కార్యాలయం ముందు ధర్నా చేయడంతో వాహనాన్ని తిరిగి ఇచ్చేశారు. కాగా తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు దొడ్డ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గెలిపించేది, గద్దె దించేది ప్రజలే

- ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య

మైసూరు: తమను గెలిపించేది, గద్దె దించేది ప్రజలేనని, తాము ప్రజాప్రభుత్వ వ్యవస్థలో పని చేస్తున్నామని, తమ పార్టీకి ప్రజలు మెజార్టీ కట్టబెట్టారని ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ సిద్ధరామయ్యను గద్దె దించే వరకు తమ పోరాటం ఆగదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ప్రధాన విపక్షాల నేతలు ముందు నుంచి సీఎం సిద్ధరామయ్యను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. వారు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపనమ్మకాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం మహారాజ కాలేజీ మైదానంలో జరిగే కాంగ్రెస్ పార్టీ జనాందోళన సమావేశానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలివస్తారన్నారు. సమావేశంలో సీఎం సిద్ధరామయ్య గత బీజేపీ ప్రభుత్వ కుంభకోణాల గురించి వివరిస్తారని, వాటికి బీజేపీ సమాధానం ఇవ్వాలని సవాలు విసిరారు.

మాజీ సీఎం ప్రత్యేక పూజలు



సిద్ధలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న యడియూరప్ప

మండ్య: మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప తాలూకాలోని బూకనకెరె ఫిర్కా గవిమఠంలో స్వతంత్ర సిద్ధలింగేశ్వర ఆలయాన్ని ఎమ్మెల్యే హెచ్‌టీ మంజుతో కలిసి సందర్శించారు. మఠం పీఠాధ్యక్షుడు చెన్నవీరమహాస్వామి దివ్యసాన్నిధ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో శుభ్రతను కాపాడాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. కేఎంఎఫ్ మాజీ డైరెక్టర్ అశోక్, టీపీ మాజీ సభ్యుడు బూకనకెరె హుల్లేగౌడ, బీజేపీ నేత చోకనహళ్లి ప్రకాష్, నాయకులు తోటప్ప శెట్టి, మెళ్లహళ్లి రవికుమార్, కరోటి సుబ్రమణ్య, పురోహితుడు హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కేంద్రం కుట్ర

- మంత్రి హెచ్‌సీ మహదేవప్ప

మైసూరు: సిద్ధరామయ్య నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని సాంఘిక సంక్షేమ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప ఆరోపించారు. కాంగ్రెస్ జనాందోళన సమావేశం జరగనున్న మహారాజ కాలేజీ మైదానంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముడా సమావేశంలో నిర్ణయం తీసుకుని సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించారే తప్ప ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపులో సిద్ధరామయ్య పాత్ర ఏమీ లేదన్నారు. అయినా విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజాప్రభుత్వంపై విశ్వాసం లేని బీజేపీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చేందుకు గవర్నర్‌ను పావుగా వాడుకుంటోందన్నారు. రాజ్యసభ సభ్యుడు చంద్రశేఖర్, మంత్రి కే.వెంకటేష్, వసతి శాఖా మంత్రి జమీర్ అహ్మద్, ఎమ్మెల్యే తన్వీర్ సేట్, కేపీసీసీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ పుష్పా అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడిగా అమరేష్



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

కోలారు: తాలూకా ప్రాథమిక వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (పీఎల్‌డీ) అధ్యక్షుడిగా హోళలి హోసూరు జీ అమరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షుడు యలవార సొణ్ణేగౌడ రాజీనామాతో ఖాళీ అయిన ఆ స్థానానికి గురువారం ఆ బ్యాంకు ఆవరణలో ఎన్నిక నిర్వహించారు. టీకే భైరేగౌడ, కేసీ మంజునాథ్, జి అమరేష్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే కేసీ మంజునాథ్, భైరేగౌడలకు జేడీఎస్, బీజేపీ నాయకులు నచ్చచెప్పి పోటీ నుంచి విరమింప జేశారు. దీంతో జీ అమరేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గీతా ప్రకటించారు. సభ్యుల సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త అధ్యక్షుడు తెలిపారు. జేడీఎస్ నాయకులు సీఎంఆర్ శ్రీనాథ్, బీజేపీ నాయకుడు బెగ్లి ప్రకాష్, కోచిముల్ డైరెక్టర్ వడగూరు డీవీహరీష్, టీఏపీసీఎంఎస్ అధ్యక్షుడు వడగూరు రాము, యలవార సొణ్ణేగౌడ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జీర్ణోద్ధరణ వేడుకలు



పూర్ణకుంభాలతో ఆలయానికి వెళ్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: శ్రీనివాసపురం పట్టణంలోని శ్రీ భూనీళ సమేతా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి నూతన శిలాబింబ ప్రతిష్టాపన, ఆభయాంజనేయ స్వామి, మహాగణపతి, గరుడ, జయవిజయ ప్రతిష్టాపన, దేవాలయ జీర్ణోద్ధారణ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మహిళలు పూర్ణ కుంభంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ట్రస్టు అధ్యక్షుడు బీఎం ప్రకాష్, హోదలి శ్రీనివాస్, కలాశంకర్, పూల అంగడి ప్రసాద్, హేమంత్, శ్రీనాథ్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నారాయణగురు జయంతి నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మంగళ

కోలారు: శ్రీ నారాయణగురు జయంతిని అర్థవంతంగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ మంగళ అధికారులకు సూచించారు. గురువారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై జయంతి ఆచరణపై చర్చించారు. ఈ నెల 20న నిర్వహించే జయంతి కార్యక్రమంలో భక్తులకు ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. కన్నడ సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో వృత్తిలో నైపుణ్యత



న్యాయమూర్తి బీ కేశవమూర్తి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: న్యాయవాదులు వృత్తిలో నైపుణ్యత సాధించేందుకు నిరంతరం అధ్యయనం చేయాలని బదిలీపై వెళుతున్న బంగారుపేట సివిల్ న్యాయమూర్తి బీ కేశవమూర్తి అన్నారు. బంగారుపేట న్యాయవాదుల సంఘం నుంచి గురువారం ఆయన వీడ్కోలు సన్మానం స్వీకరించి మాట్లాడారు. కక్షిదారుల హిత రక్షణకు న్యాయవాదులు శ్రమించాలన్నారు. లోక్‌అదాలత్, విజయవంతంగా నిర్వహించడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం న్యాయమూర్తి దంపతులను సన్మానించారు. బంగారుపేట న్యాయమూర్తి రమాలి నదాఫ్, చంద్రశేఖర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్ నారాయణప్ప పాల్గొన్నారు.

కఠోర సాధనతో విజయం సాధ్యం



పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

కేజీఎఫ్: క్రీడాకారులు కఠోర సాధనతో విజయం సాధించవచ్చని జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు అము లక్ష్మీ నారాయణ అన్నారు. బేతమంగల గ్రామీణ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన ఫిర్కా స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యమని, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాల్లో పోటీలు జరగ్గా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజేయేంద్ర, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగభూషణ్, కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు శ్రీహరి, ఉపాధ్యాయులు ప్రభాకర్, సురేష్, కవితా తదితరులు పాల్గొన్నారు.

మండలి నిధుల లూటీకి వర్మ ప్లాన్

బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలిలో చోటుచేసుకున్న కోట్లాది రూపాయలు కుంభకోణంలో అరెస్టైన ప్రధాన నిందితుడు, హైదరాబాద్ ఫస్ట్ క్రెడిట్ కో– ఆపరేటివ్ బ్యాంక్ ఎండీ సత్యనారాయణవర్మ లీలలు మరిన్ని బయటపడ్డాయి. మండలి నిధులను కాజేయడానికి నకిలీ అధికారిని సృష్టించి బ్యాంక్ అధికారులతో ఇలా ప్రవర్తించాలని శిక్షణ ఇచ్చినట్లు సిట్ దర్యాప్తులో వెలుగుచూసింది. వసంతనగర యూనియన్ బ్యాంక్ నుంచి ఎంజీ రోడ్‌లోని యూనియన్‌బ్యాంక్ శాఖకు మండలి అకౌంట్‌కు నగదు బదిలీ చేసి, ఆ ఖాతా నుంచి రూ.93 కోట్లు నగదు కాజేయడానికి కుట్ర చేశారు. శివకుమార్ పేరుతో నకిలీ ఆధార్ కార్డు, మండలి ఉద్యోగి అని గుర్తింపు కార్డు సృష్టించారు. శివకుమార్ పేరుతో సాయితేజ అనే వ్యక్తి బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి, జగదీశ్, చంద్రమోహన్ అనే ఇద్దరు సాయితేజతో కలిసి మండలి అధికారులను కలిసి నగదు బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. మండలి అధికారులతో ఎలా మాట్లాడాలి అనేది సత్యనారాయణవర్మ పూర్తి శిక్షణ అందించినట్లు సిట్ అధికారులు చార్జిషీట్‌లో ప్రస్తావించారు. గత ఏడాది అక్టోబరులో బెంగళూరుకు వచ్చిన సత్యనారాయణవర్మ ముందుగా తన స్నేహితుడు కాకి శ్రీనివాసన్ తో చర్చించాడు. నాగేశ్వరరావ్ ద్వారా నెక్కంటి నాగరాజును సంప్రదించాడు. మండలి ఎండీ పద్మనాభతోనూ చర్చించారు. తరువాత నగదు బదిలీ పూర్తి చేశారు.

సరుకుల కిట్లు అందచేత

పావగడ: ఉత్తర కర్ణాటక గోకాక్ తాలూకాలోని అత్యంత కుగ్రామాలైన మసాగుప్పె, హుణసెహాల్ గ్రామాల్లో సుమారు వెయ్యి మంది రైతులు, కూలీలు, కార్మికులకు వరద పరిహార సామగ్రిని స్వామి జపానంద గురువారం పంపిణీ చేశారు. వరద బాధితులకు స్వామి జపానంద ఆసరాగా నిలిచారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో బాధితులకు సరుకుల కిట్లు అందిస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. సుమారు 500 కిలోమీటర్లు పర్యటించి బాధితులకు సరుకుల కిట్లు అందించినట్లు స్వామిజీ తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి బృందం తదితర వలంటీర్లు సహకరించారన్నారు.

కర్తవ్యలోపం లేకుండా విధుల నిర్వహణ అభినందనీయం



విషయ పరీక్షకులను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: పది పరీక్షల్లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చేందుకు విషయ పరీక్షకులు చేసిన కృషి అభినందనీయమని డీఈఓ కృష్ణమూర్తి అన్నారు. విషయ పరీక్షకులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కృష్ణప్ప, గాయత్రి, శివధన, మోహన్‌బాబు, సాంకేతిక సహాయకురాలు మానస, సిరాజుద్దీన్‌ను గురువారం ఆయన తన కార్యాలయంలో ఘనంగా సన్మానించి మాట్లాడారు. పరీక్షల నిర్వహణ, బోధన, కౌశల్యాల వృద్ధి, పాఠశాలల సందర్శన, యువ సంసత్ తదితర క్లబ్‌ల నిర్వహణను సక్రమంగా నిర్వహించారని కితాబు నిచ్చారు. విద్యాశాఖాధికారి వీణా, శిక్షణాధికారులు వీణా, సగీరా, అంజుం, డీవైపీసీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం బదిలీని రద్దు చేయాలని ధర్నా



ప్రతిఘటన నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: పట్టణంలోని త్యాగరాజ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భైరేగౌడ బదిలీ ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు, బీఈఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఆందోళనకారులు మాట్లాడుతూ పాఠశాలలో 520 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాల అభివృద్ధికి భైరేగౌడ ఎంతో శ్రమించారన్నారు. పాఠశాలను తాలూకాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దారన్నారు. పాఠశాలకు రాష్ట్రస్థాయి స్వాభిమాని పబ్లిక్ పాఠశాల అవార్డు, స్వచ్ఛ విద్యాలయ అవార్డు లభించిందన్నారు. రాజకీయ కారణాలతో హెచ్ఎంను బదిలీ చేశారని, ఆ ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఈఓ బీసీ మునిలక్ష్మయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఎస్‌డీఎంసీ మాజీ అధ్యక్షుడు నరసింహమూర్తి, నాగరాజ్, నరేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెన్నతో మారెమ్మదేవికి అలంకరణ



బొమ్మనహళ్లి : శ్రావణ మాసం గురువారం సందర్భంగా బొమ్మనహళ్లి పరిధిలోని హెచ్ ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో మారెమ్మ దేవికి వెన్నతో అలంకరణ చేశారు. అర్చకులు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచే పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం వెన్నతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దొడ్డగణపతికి పూజలు

బొమ్మనహళ్లి : బసవనగుడిలో కొలువైన దొడ్డ గణపతి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డగణపతికి వెన్నతో ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. బెంగళూరు దక్షిణ బీజేపీ ఎమ్మెల్యే ఎం. కృష్ణప్ప, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాజీ మంత్రి ఉమాశ్రీకి ఊరట

శివాజీనగర: నటి, మాజీ మంత్రి ఉమాశ్రీకి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును రద్దుచేస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2019లో బనహట్టి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును రద్దు చేయాలని నటి, మాజీ మంత్రి ఉమాశ్రీ హైకోర్టు మెట్లెక్కారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. ఉమాశ్రీపై నమోదైన కేసు రద్దుచేస్తూ ఆదేశాలు జారీచేసింది.

సెప్టెంబర్ నుంచి ఇంటి వద్దకే వైద్యులు

దొడ్డబళ్లాపురం: ఏపీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ ఫిజిషియన్ తరహా పథకాన్ని కర్ణాటక ప్రభుత్వం కూడా చేపట్టనుంది. గృహ ఆరోగ్యం పేరుతో ఇకపై ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యులు వచ్చి రోగులకు వైద్య పరీక్షలు జరిపి చికిత్స అందించనున్నారు. సెప్టెంబర్ నెల నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు చాలామంది క్రమబద్ధంగా మందులు తీసుకోవడం లేదని, అందుకు అనేక కారణాలు ఉన్నాయని గుర్తించి గృహ ఆరోగ్యం పథకం కింద ఇళ్ల వద్దకే వైద్యులను పంపించి మందులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. షుగర్,బీపీ ఉన్న వారికి మూడు నెలలకు సరిపడా మాత్రలు, మందులు అందజేస్తారు.

గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యత



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ

గౌరిబిదనూరు: నియోజకవర్గంలో త్వరలో రూ.30 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా నగరగెరె హోబళీలో రూ. 17 లక్షలతో వాటంకొత్తపల్లి రోడ్డు, రూ.19.53 లక్షలతో మణివాల-శ్రీనివాసాచార్లహళ్లి రోడ్డు పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కేహెచ్‌పీ నాయకుడు మణివాల నాగేంద్ర, ఆర్ఆర్ రెడ్డి, శ్రీనివాసగౌడ, వాటంకొత్తపల్లి జీపీ అధ్యక్షురాలు సునీతా మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త దాడి.. లంచం డబ్బుతో ఉద్యోగి పరారీ



ఉద్యోగి మహేశ్

దొడ్డబళ్లాపురం: లోకాయుక్త పోలీసులు దాడి చేయనున్నారని పసిగట్టిన ఓ రెవెన్యూ ఉద్యోగి లంచం డబ్బుతో ఉడాయించాడు. ఈ ఘటన దేవనహళ్లి తాలూకా కార్యాలయంలో చోటుచేసుకుంది. చిక్కబళ్లాపురానికి చెందిన జయసూర్య అనే వ్యక్తికి వెంకటగిరికోట వద్ద పెట్రోల్ బంక్ మంజూరైంది. సదరు పత్రాల కోసం దేవనహళ్లి రెవెన్యూ కార్యాలయంలో మహేశ్ అనే ఉద్యోగిని ఆశ్రయించగా రూ.2.50 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో జయసూర్య లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.లోకాయుక్త పోలీసుల సూచన మేరకు జయసూర్య బుధవారం సాయంత్రం అడ్వాన్స్ కింద రూ.50 వేలు అందజేశాడు. లోకాయుక్త అధికారులు అక్కడ ఉన్నట్లు తెలుసుకున్న మహేశ్ నగదుతోపాటు పారిపోయాడు. దీంతో లోకాయుక్త పోలీసులు రాత్రి 9 గంటల వరకూ కార్యాలయంలో సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించారు.

జలకళ లేని చెరువులు.. రైతులు దిగాలు

- వర్షాలు వచ్చినా చెరువుల్లో చేరని నీరు
- ఎండిపోయిన 15 శాతం చెరువులు





కోలారు జిల్లాలో అరకొరగా నిండిన చెరువులు

సాక్షి బెంగళూరు: రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. కుండపోతగా వర్షాలు కురిసి వరదలు వచ్చి రిజర్వాయర్లు జలకళ సంతరించుకున్నా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్యకలాపాలకు జీవనాడిగా ఉన్న చెరువులకు మాత్రం ఇంకా నీరు చేరలేదు. చిన్న నీటిపారుదల శాఖ పరిధిలోని 3,683 చెరువులు ఉండగా వాటిలో ఇంకా 15 శాతం చెరువుల్లో వేసవి ఛాయలే కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల్లో కొన్నింటిలో ఒక్క చుక్క నీరు లేకుండా ఎండిన స్థితిలో ఉన్నాయి.

రాష్ట్రంలోని కరావళి, మలేనాడు, దక్షిణ ఒళనాడు తదితర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పలకరించాయి. ఈ వర్షాల కారణంగా అన్ని జలాశయాలు నీటితో నిండుకున్నాయి. వ్యవసాయ కార్యకలాపాలకు ఇక ఢోకా ఉండదని రైతులు భావించారు. నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో ఎంచక్కా వ్యవసాయ కార్యకలాపాలు సాగించవచ్చని భావించారు. అయితే చెరువుల్లోకి వర్షపు నీరు చేరకపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశలో ఎదురుచూస్తోంది. కొన్ని చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. మొత్తం 3,683 చెరువుల పైకి 67.55 శాతం చెరువుల్లో 50 శాతం కంటే తక్కువ నీరు ఉంది. ఈ క్రమంలో గ్రామాల్లో వ్యవసాయ కార్యకలాపాలకు ఆటంకంగా మారింది. ఈ చెరువులన్నీ పూర్తి స్థాయిలో నిండితే 4.40 లక్షల హెక్టార్లకు సాగు జలాలు అందుతాయి. గత నెల చివరి నాటికి మొత్తం 3,683 చెరువుల్లో 553 చెరువులు పూర్తిగా ఖాళీగా ఉన్నాయి. తుమకూరు జిల్లాలో అత్యధిక చెరువులు నీరు లేక ఎండిపోయిన స్థితిలో ఉన్నాయి. ఇక 1,526 చెరువుల్లో 30 శాతం కంటే తక్కువగా, 409 చెరువుల్లో 50 శాతం కంటే తక్కువగా నీరు ఉంది.

చెరువుల్లో నీటి ప్రమాణం..

చేరిన నీరు	చెరువుల సంఖ్య
0 శాతం	553
1-30 శాతం	1526
31-50 శాతం	409
51-99 శాతం	564
100 శాతం	631

బ్యాంకు తీరుకు నిరసనగా 12న ధర్నా



మాట్లాడుతున్న గోవిందరాజు

తుమకూరు: కర్ణాటక బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ ఈనెల 12న ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర రైతు సంఘం కార్యాధ్యక్షుడు, తుమకూరు జిల్లాధ్యక్షుడు ఏ.గోవిందరాజు తెలిపారు. ఆయన గురువారం తుమకూరు విలేకరులతో మాట్లాడారు. తురువేకెరె తాలూకా తాళేకెరె గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతు 2005లో ట్రాక్టర్ కొనుగోలు కోసం తురువేకెరెలోని కర్ణాటక బ్యాంకు నుంచి రూ.4.50 లక్షల రుణం పొంది తిరిగి చెల్లించలేక పోయారన్నారు. వడ్డీ, చక్రవడ్డీ విధించి రూ.34.80 లక్షల రుణ బకాయి చూపించారన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇవ్వకుండా కోర్టు డిక్రీ ప్రకారం రైతుకు చెందిన రూ.3 కోట్ల ఆస్తిని కేవలం రూ.35.40 లక్షలకు వేలం వేసేందుకు బ్యాంకు అధికారులు సిద్ధమయ్యారన్నారు. కేంద్ర చట్టాన్ని అడ్డం పెట్టుకుని రైతుల భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ 12న సదరు బ్యాంకు ముందు ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి జీఎస్ శంకరప్ప, తాలూకా అధ్యక్షుడు చిక్కబోరేగౌడ, శ్రీనివాస్, తిమ్మేగౌడ, షబ్బీర్‌పాషా, అస్లాం పాషా, మహేష్, రామచంద్రప్ప, ఈశ్వరణ్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో దోపిడీ కేసు నిందితుడి పట్టివేత

- సాహసం ప్రదర్శించిన కానిస్టేబుల్



నిందితుడు హొట్టె మంజ



సాహసం ప్రదర్శించిన కానిస్టేబుల్ దొడ్డలింగయ్య

కృష్ణరాజపురం: దోపిడీ కేసు నిందితుడిని పట్టుకునేందుకు ఓ కానిస్టేబుల్ ఎంతో సాహసం చేశాడు. సినీ ఫక్కీలో నిందితుడిని పట్టుకొని పోలీసు అధికారులకు అప్పగించాడు. వివరాలు..మంజ అలియాస్ హొట్టె మంజ అనే నిందితుడిపై తుమకూరు జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులున్నాయి. మహిళలను నమ్మించి బంగారు ఆభరణాలను దోచుకునేవాడు. ఇతన్ని పట్టుకునేందుకు పోలీసులు కొన్ని రోజులుగా గాలిస్తున్నారు. ఈక్రమంలో నిందితుడు రోజూ బెంగళూరులోని సదాశివనగర పోలీసు స్టేషన్ ముందు నుంచి వెళుతున్నట్లు తుమకూరు జిల్లా కొరటిగెర పోలీస్‌స్టేషన్ క్రైం కానిస్టేబుల్ దొడ్డలింగయ్య పసిగట్టాడు. హొట్టె మంజ ఈనెల 5వ తేదీ ఉదయం హెల్మెట్ ధరించి బైక్‌పై వెళ్తుండగా క్రైం కానిస్టేబుల్ దొడ్డలింగయ్య వెంటాడాడు. అయితే నిందితుడు బైక్‌తో పోలీసులను ఢీకొట్టగా క్రైం కానిస్టేబుల్ పట్టు వీడలేదు.సదాశివనగర ట్రాఫిక్ ఏఎస్ఐ మాయమ్మ, స్థానికుల సహకారంతో నిందితుడిని పట్టుకున్నాడు. నిందితుడిని పట్టుకున్న దృశ్యాలు సీసీ టీవీ కెమెరా ఫుటేజీలో నమోదయ్యాయి.

ప్రీతంగౌడ ఫ్లెక్సీలకు నిప్పు



ఫ్లెక్సీలను తగులబెట్టిన దృశ్యం

మండ్య: పాదయాత్ర నేపథ్యంలో నగర శివార్లలోని అమరావతి హోటల్ వద్ద, నగరంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రీతంగౌడ ఫ్లెక్సీలు, బ్యానర్లకు దుండగులు నిప్పు పెట్టారు. మైసూరు చలో పాదయాత్ర వేళ నగరంలోని జేసీ సర్కిల్‌లో భారీ సమావేశం జరిగింది. విపక్ష నేత ఆర్. అశోక్ మాట్లాడుతుండగా వచ్చిన ప్రీతంగౌడ, ఆయన మద్దతుదారులు నినాదాలు చేశారు. దీంతో జేడీఎస్, ప్రీతంగౌడ మద్దతుదారుల మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారి తీయబోతుండగా జేడీఎస్ యువనేత నిఖిల్ కుమారస్వామి, కేంద్ర మంత్రి కుమారస్వామి జోక్యం చేసుకుని సర్దిచెప్పి పరిస్థితిని చక్కదిద్దారు. పాదయాత్ర మైసూరు వైపు సాగిపోయిన అనంతరం సాయంత్రం వేళలో ఆకతాయిలు ప్రీతంగౌడ ఫ్లెక్సీలను తగులబెట్టారని చెబుతున్నారు.

గర్భిణిని చిదిమేసిన బస్సు

మైసూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని గర్భిణి మృతిచెందిన ఘటన చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూకాలో జరిగింది. అజ్జీపుర గ్రామానికి చెందిన నమిత (22) అనే మహిళ రెండు నెలల గర్భిణి. ఆమె కామగెరె హోలీ క్రాస్ ఆస్పత్రి నుంచి పరీక్ష చేయించుకుని తమ గ్రామం అజ్జీపురకు వాపసు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మహదేశ్వరబెట్ట నుంచి కొళ్లెగాలకు వెళుతున్న బస్సు ఆమెను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో మృతుల బంధువులు కామగెరె గ్రామంలో రాస్తారోకో చేపట్టారు. స్థలానికి హనూరు, కొళ్లెగాల పోలీసులు చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. బస్సు డిపో మేనేజర్ శంకర్ స్థలానికి వచ్చి మృతురాలి అంత్యక్రియల కోసం రూ.25 వేలను మంజూరు చేస్తామని, మృతురాలి కుటుంబానికి తగిన పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఘటనపై గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

హత్యకేసు ముద్దాయికి యావజ్జీవం

మైసూరు: భార్యతో అనైతిక సంబంధం పెట్టుకున్న వ్యక్తిని కడతేర్చిన కేసులో ముద్దాయికి మైసూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జీవితఖైదు శిక్ష విధించింది. వివరాలు..జిల్లాలోని సరగూరు తాలూకా అంతరసంతె గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తి రవి అనే వ్యక్తి భార్యతో అనైతిక సంబంధం పెట్టుకున్నాడు. దీంతో సునీల్‌పై రవి పగ పెంచుకున్నాడు. 2020 ఫిబ్రవరి 8న రాత్రి 7.50 గంటలకు అంతరసంతె గ్రామంలోని వెంకటేశ్వర బేకరి ముందు సునీల్ ఉండగా రవి మచ్చుకత్తితో దాడి చేసి హత్య చేశాడు. సునీల్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి హెచ్‌డీ కోటె సీఐ పుట్టస్వామి దర్యాప్తు చేపట్టి రవిపై కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. ఈ కేసును 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి టి.గోవిందయ్య విచారణ చేపట్టారు. ముద్దాయి రవిపై నేరారోపణ రుజువు కావడంతో జీవితఖైదు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మృతుడు సునీల్ తల్లికి పరిహారంగా రూ.30 వేలను అందజేయాలని ఆదేశించారు. ఈ కేసులో ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివశంకరమూర్తి వాదనలు వినిపించారు.

పెండింగ్ ఫైళ్లను నెలరోజుల్లో పరిష్కరించండి

శివాజీనగర: సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను నెల రోజుల్లో పరిష్కారంచాలని సచివాలయ ఉద్యోగుల సంఘం బృందానికి రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ సలహా ఇచ్చారు. నూతన ప్రధాన కార్యదర్శిగా అధికారం స్వీకరించిన నేపథ్యంలో విధానసౌధలో ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు రమేశ్ సంగా, పదాధికారుల బృందం గురువారం భేటీ చేసి పుష్పగుచ్ఛం అందజేసి జ్ఞాపిక అందజేసి అభినందించింది. అభినందనలు స్వీకరించి, విన్నపాలు ఆలకించిన శాలిని రజనీశ్ మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ దిశలో సచివాలయంలో కొత్త సిబ్బందికి తగిన శిక్షణ అవసరమన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించారు. ఆరోగ్య సంజీవిని పథకం అమలు, ప్రభుత్వ వసతి గృహాల నిర్మాణం, ఖాళీపోస్టుల భర్తీ, పదోన్నతులు తదితర డిమాండ్లను అత్యవసరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని శాలిని రజనీశ్ భరోసా ఇచ్చారు.

నిధుల మళ్లింపుపై తనిఖీ చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు : ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన నిధులను మళ్లించిన ఘటనలపై తనిఖీ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నాయకుడు చెన్నప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దళితులను గత బీజేపీ ప్రభుత్వం వంచించిందని, దీంతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎస్సీ,ఎస్టీల నిధులను మళ్లించి అన్యాయం చేస్తోందన్నారు. నిధుల మళ్లింపునకు అడ్డుకట్ట వేయాలని, ఎస్సీ,ఎస్టీ వర్గాల విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు సనత్‌కుమార్, సోమయ్య, బాలప్ప, నంజుండప్ప తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బస్సు

శివాజీనగర: విధానసౌధ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. బీఎంటీసీ బస్సు వేగంగా వచ్చి కారును ఢీకొనగా ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు వచ్చి బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య

మైసూరు: ఆస్తమాతో బాధపడుతున్న వృద్ధుడు ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చామరాజనగర జిల్లా కొళ్లెగాల పట్టణంలోని ఆనం దజ్యోతి కాలనీలో జరిగింది. కాలనీ నివాసి మాదయ్య(78) ఆస్తమా బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. అయినా నయం కాలేదు. దీంతో పురుగుల మందు తాగాడు. అతన్ని చామరాజనగర జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు ఇంద్రేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగరాజు తెలిపారు.

కామాంధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

యశవంతపుర: మైనర్ బాలికపై ఆత్యాచారం చేసిన కేసులో కామాంధుడికి 20 ఏళ్ల జైలు, రూ.50వేల జరిమానా విధిస్తూ మంగళూరు అడిషినల్ జిల్లా కోర్టు-2 తీర్పు వెలువరించింది. ఎడపదవు బోరుగుడ్డకు చెందిన ప్రకాశ్(32) 2023 జూన్ 17న మైనర్ బాలికను తన ఇంటిలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మహిళా పోలీసులు ప్రకాశ్‌ను అరెస్ట్ చేశారు. దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈకేసును అడిషినల్ జిల్లా జడ్జి మానుకేస్ బుధవారం విచారణ చేపట్టారు. ముద్దాయి నేరం నిరూపితం కావడంతో 20 ఏళ్ల కఠినకారాగారశిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా మొత్తాన్ని బాధిత బాలికకు అందించాలని ఆదేశించారు.

గంధపు చెక్కల పట్టివేత



నిందితులు, గంధపు చెక్కలను పట్టుకున్న పోలీసులు

శివమొగ్గ: గంధపు చెక్కలను తరలిస్తున్న ముగ్గురిని శివమొగ్గ తుంగానగర స్టేషన్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానికులైన ఇమ్రాన్‌ఖాన్ (42), సిద్దిక్‌బాషా (30), ఫైరోజ్‌ఖాన్ అలియాస్ గిడ్డ(34)లను పట్టుకుని రూ.58 వేల విలువ చేసే 14.5 కేజీల బరువుగల గంధపు దుంగల ముక్కలు, రవాణాకు ఉపయోగించిన ఆల్టో కారును పోలీసులు స్వాధీనపరచుకున్నారు. ఈనెల 6న రాత్రి నిందితులు కారులో గంధపు చెక్కలను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇన్స్పెక్టర్‌లు శివప్రసాద్, సిద్దప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల పరిశీలన



టమాటా పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి సమితిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. మొదటగా బిల్లనకుప్పం వద్ద రూ. 5.79 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేసిన శీతల గిడ్డంగిని పరిశీలించారు. ఈ గిడ్డంగిలో స్థానిక రైతులు పండిస్తున్న కాయగూరలను 4 మెట్రిక్ టన్నుల వరకు భద్రపరుచుకోవచ్చునని సూచించారు. సికరమాకనపల్లి, గంగనపల్లి గ్రామాల్లో రైతులు పండిస్తున్న టమోటో తదితర కాయగూరల పంటలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ద్వారా రూ. 33 వేల రాయితీతో రైతులు అందజేసిన పవర్ వీడర్ పనితీరును రైతు వద్ద అడిగి తెలుసుకొన్నారు. వనాచికుప్పం, విరుపసంద్రం ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికార్లు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడి మృతి



నారాయణప్ప (ఫైల్)

పావగడ: నీలమ్మహళ్లి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణప్ప (50) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందాడు. తాలూకాలోని చిక్కహళ్లికి చెందిన ఆయన కొన్ని రోజులుగా మెదడు సంబంధిత వ్యాధితో బాధ పడుతూ తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందేవాడు. వ్యాధి ముదిరి పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. బీఈఓ ఇంద్రాణమ్మ, వ్యాయామ శిక్షణ అధికారి బసవరాజు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

హోసూరు వార్తలు..

ఆర్టీసీ బస్సు బోల్తా



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో ప్రయాణికులను తీసుకెళుతున్న ఆర్టీసీ బస్సు ఆకస్మాత్తుగా బోల్తా పడింది. వివరాల మేరకు సూళగిరి నుంచి సామలపల్లి గ్రామానికి 40 మంది ప్రయాణికులను తీసుకెళ్లుతున్న ఆర్టీసీ బస్సు బైకిస్టుకు దారి వదిలే ప్రయత్నంలో అదుపుతప్పి రోడ్డుపక్కన పల్లంలో బోల్తాపడింది. ఈ ప్రమాదలో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య

కెలమంగలం: ప్రేమ పెళ్లి చేసుకున్న దంపతుల మధ్య గొడవలు ఏర్పడిన భార్య ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఉద్దనపల్లి వద్ద జరిగింది. వివరాల మేరకు సూళగిరి తాలూకా ఉద్దనపల్లి సమీపంలోని అళేసీభం గ్రామానికి చెందిన సుందరేషన్ (24), రాయకోట సమీపంలోని కోనంపట్టివాసి సత్య (20) గత రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకొన్నారు. రెండు రోజుల క్రితం సత్య కెలమంగలంలోని ఆలయానికి తీసుకెళ్లాలని భర్తను కోరింది. అతడు నిరాకరించడంతో విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఉద్దనపల్లి పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని సుందరేషన్‌ను అరెస్ట్ చేశారు.

పంటలపై గజ దాడులు

కెలమంగలం: తళి సమీపంలో రైతుల పంటలపై ఏనుగులు దాడి చేసి ధ్వంసం చేశాయి. తళి అటవీ ప్రాంతంలో మకాం వేసిన మూడు ఏనుగులు బుధవారం రాత్రి సమీపంలోని మల్లసంద్రం ప్రాంతంలో రైతులు చంద్రప్ప, చిన్నప్ప సాగు చేస్తున్న టమాటా పంటలను పాడు చేశాయి. అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటను అంచనా వేశారు. లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి పంటలు పండిస్తే పంట చేతికందే సమయంలో ఏనుగుల దాడులతో తీవ్రంగా నష్టపోతున్నామని, ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

బ్రోకర్ అరెస్టు

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో వ్యభిచార కుటీరం నిర్వహిస్తున్న వ్యక్తిని సిఫ్‌కాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరసనట్టి సమత్వపురంలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందని తెలిసి పోలీసులు బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈరోడ్డుకు చెందిన బ్రోకర్ శరవణన్ (46)ను అరెస్ట్ చేసి కర్ణాటక రాష్ట్రం మండ్యకు చెందిన మహిళకు విముక్తి కల్పించారు.

నీటిలో కొట్టుకుపోయి రైతు మృతి

మైసూరు: ఓ రైతు కాలు జారి కాలువలో పడి మృతి చెందిన ఘటన జిల్లాలోని సాలిగ్రామ తాలూకా కర్తాళ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పుట్టేగౌడ(61) తమ పొలంలో పని పూర్తయిన తర్వాత కట్టెపుర కాలువలో ఆవులను కడిగేందుకు వెళ్లాడు. ఈక్రమంలో కాలుజారి నీటిలో పడి కొట్టుకుపోయాడు. పోలీసులు గాలింపు చేపట్టగా గురువారం ఉదయం పుట్టేగౌడ మృతదేహం లభించింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఘటనపై సాలిగ్రామ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఆటో డ్రైవర్ అరెస్ట్



నిందితుడు బాబాసాబ్

కృష్ణరాజపురం: దురుసుగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌ను హెచ్ఏఎల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆటోడ్రైవర్ బాబా సాబ్ మారతహళ్లి యమలూరు సిగ్నల్ వద్ద కారు డ్రైవర్ అలెక్స్‌తో గొడవకు దిగి కారు అద్దాన్ని పగులగొట్టి డ్రైవర్ ముఖంపై ఉమ్మివేసిన సంగతి తెలిసిందే. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆటోడ్రైవర్‌ను పట్టుకుని లాఠీ రుచి చూపించారు.

భార్య వెళ్లిపోయిందని భర్త హల్‌చల్

బనశంకరి: శేషాద్రిపురం కాలేజీ వెనుక గురువారం ఉదయం ఓ వ్యక్తి ఐదంతస్తుల భవనంపైకి ఎక్కి దూకుతానని హల్‌చల్ చేశాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో శేషాద్రిపురం పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో వచ్చి అతనికి నచ్చజెప్పి కిందకు దించారు. బాధితుడిని బెంగళూరు-బళ్లారి రోడ్డులోని హుణసమారనహళ్లి నివాసిగా గుర్తించారు. ఇతని భార్య ఓ కంపెనీలో పనిచేసేదని, ఉద్యోగం వదలిపెట్టి ఇంటినుంచి వెళ్లిపోవడంతో మనోవేదనకు గురైన భర్త భవనంపైకి ఎక్కినట్లు పోలీసులు తెలిపారు.

అన్నభాగ్య బియ్యం స్వాధీనం

మైసూరు: అన్నభాగ్య పథకం బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. మైసూరు జిల్లా టీ.నరసీపుర తాలూకా దొడ్డబాగిలు గ్రామానికి చెందిన వీరభద్రస్వామి(34) మోపెడ్ వాహనంలో తరలిస్తుండగా పక్కా సమాచారంతో సంతేమరహళ్లి ఎస్ఐ తాజుద్దీన్, పోలీసు సిబ్బంది, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు చామరాజనగర తాలూకా కావుదవాడి గేట్ వద్ద కాపుగాచారు. వాహనం రాగానే తనిఖీ చేయగా 284 కేజీల అన్నభాగ్య బియ్యం తరలిస్తున్నట్లు తేలింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంతేమరహళ్లి చుట్టుపక్కల గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు నిందితుడు వెల్లడించాడని పోలీసులు తెలిపారు.

కంతు కట్టమన్నందుకు దాడి

కెలమంగలం: డెంకణీకోటలో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ ఉద్యోగిపై దాడి జరిగింది. వివరాలు.. డెంకణీకోటకు చెందిన అశోక్‌కుమార్ (37) బాధిత ఉద్యోగి. గత 6వ తేదీ శరణ్య అనే మహిళకు ఫోన్ చేసి ద్విచక్రవాహనం కంతు డబ్బులు చెల్లించాలని కోరాడు. తన సోదరుడు శరత్‌కుమార్ (35) చెల్లిస్తాడని అతని ఫోన్ నంబర్‌ను పంపింది. ఆ నంబర్‌కు కాల్ చేసి మాట్లాడగా వాగ్వాదం సాగింది. కొంతసేపటికి శరత్‌కుమార్, అతని మిత్రుడు కుళ్లన్ (30)తో కలిసి ఫైనాన్స్ సంస్థకెళ్లి అశోక్‌కుమార్‌ను తీవ్రంగా కొట్టి అక్కడి ఫర్నిచర్‌ను ధ్వంసంచేసి వెళ్లిపోయారు. తీవ్ర గాయాలపాలైన అశోక్‌కుమార్‌ను స్థానికులు చికిత్స కోసం డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

హోసూరు: హోసూరు సమీపంలో వ్యక్తి దారుణ హత్యకు గురి కాగా, ముగ్గురిని సిఫ్‌కాట్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వివరాలు.. హోసూరు పారిశ్రామికవాడ బేడరపల్లి ప్రాంతంలో స్థానికుడు ఉమేష్ (21) హత్యకు గురయ్యాడు. అస్సోం రాష్ట్రానికి చెందిన మంగల్ రవిదాస్ (25)ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. తమ గదిలో ఉంటానని శబరి సింగ్ ఐదుగురిని తీసుకొచ్చి ఉంచాడు. గదిలో చోటు లేకపోవడంతో తాను పక్కనే ఉన్న మిత్రుని గదికి వెళ్లానని, ఉదయం వచ్చి చూస్తే ఉమష్ శవమై ఉన్నాడని రవిదాస్ తెలిపాడు. దీంతో రవిదాస్, శబరిసింగ్, అత్తిపల్లికి చెందిన శేఖర్‌లను అరెస్టు చేశారు.

దుర్గమ్మకు విశేష పూజలు



అమ్మవారు

హోసూరు: హోసూరు పట్టణంలోని ముత్తురాయన్‌జీబి ప్రాంతంలో ప్రసిద్ధ గ్రామదేవత దుర్గమ్మ ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గంగాధరన్ నేతృత్వంలో అమ్మవారిని అభిషేకించి విశేషంగా అలంకరించారు. మహిళా భక్తులచే కోలాట, భరతనాట్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



“నా ఆటను ముగించేందుకు ఇంతకంటే సరైన సమయం ఉండదు. మేం పతకంతో తిరిగి వెళుతున్నాం. కొందరు అభిమానులు నన్ను కొనసాగించమని కోరుతున్నారు. కానీ నా నిర్ణయంలో మార్పు లేదు. కొన్ని నిర్ణయాలు కఠినమైనవే అయినా వాటిని సరైన సమయంలో తీసుకోవడమే బాగుంటుంది. మా జట్టు సభ్యులంతా చాలా బాగా ఆడారు. టోక్యోలో గెలిచిన కాంస్యానికి నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎందుకంటే ఒలింపిక్స్‌లో మేం పతకం గెలవగల మనే నమ్మకాన్ని అది కల్పించింది. -పీఆర్ శ్రీజేశ్

కాంస్యపతక పోరు మాకూ, మా దేశానికి ఎంతో కీలకం. ఒలింపిక్స్‌లో పోటీ పడేందుకు ఎన్నో దశలు దాటాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఫలితం మనకు అనుకూలంగా రాదు. భారత్ వరుసగా రెండు సార్లు పతకం సాధించడం గొప్ప విషయం. ఇది అంత సులువు కాదు. పెనాల్టీ కార్నర్‌లను మా బృందం చాలా అద్భుతంగా నిలువరించగలిగింది. హాకీపై ఆదరణ ఇలాగే కొనసాగుతుందని ఆశిస్తున్నా -హర్మన్‌ప్రీత్ సింగ్, కెప్టెన్

ఎన్నో తరాల పాటు గుర్తుంచుకునే ప్రదర్శన ఇది. భారత హాకీ జట్టు ఒలింపిక్ కాంస్యంతో మెరిసింది. ఇది వరుసగా రెండో పతకం కావడం మరింత ప్రత్యేకం. ప్రతిభ, పట్టుదలకు తోడు సమష్టి కృషి దీనిని అందించింది. ఆటగాళ్లకు నా అభినందనలు. ప్రతీ భారతీయుడికి మానసికంగా హాకీతో బలమైన బంధం ఉంది. ఈ విజయం వల్ల యువతలో ఆటపై మరింత ఆసక్తి పెరుగుతుంది. -నరేంద్ర మోదీ, ప్రధాని

రజత నీరాజనం


- వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన నీరజ్ చోప్రా
- జావెలిన్‌ను 89.45 మీటర్లు విసిరి రజత పతకం సొంతం
- స్వర్ణ పతకం సాధించిన పాకిస్తాన్ ప్లేయర్ అర్షద్ నదీమ్
- 92.97 మీటర్లతో ఒలింపిక్ రికార్డు నెలకొల్పిన నదీమ్



నీరజ్ చోప్రా

పారిస్: పసిడి ఆశలతో ‘పారిస్’లో అడుగు పెట్టిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. రెండో ప్రయత్నంలో 26 ఏళ్ల నీరజ్ జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరి ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. చివరకు ఈ స్కోరుతోనే నీరజ్‌కు రజత పతకం ఖరారైంది. క్వాలిఫయింగ్‌లో 89.34 మీటర్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచిన నీరజ్ ఫైనల్లో కాస్త ఒత్తిడికి లోనయ్యాడు. అతడి తొలి ప్రయత్నం ఫౌల్ అయింది. రెండో ప్రయత్నంలో నీరజ్ ఆందోళన చెందకుండా సంయమనంతో జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత నీరజ్ మూడు, నాలుగు, ఐదు, ఆరో ప్రయత్నాలు కూడా ఫౌల్‌గానే నమోదయ్యాయి. దాంతో ఈ త్రోలలో నమోదైన స్కోరును పరిగణనలోకి తీసుకోలేదు. టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు.

ఎవరూ ఊహించని విధంగా జావెలిన్ త్రోలో పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ స్వర్ణ పతకాన్ని గెల్చుకొని అందర్నీ నివ్వెరపరిచాడు. 27 ఏళ్ల నదీమ్ తొలి ప్రయత్నంలో విఫలమయ్యాడు. అయితే రెండో ప్రయత్నంలో నదీమ్ జావెలిన్‌ను



అర్షద్ నదీమ్


92.97 మీటర్ల దూరం విసిరి కొత్త ఒలింపిక్ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో ఆండ్రెస్ థోర్‌కిల్డ్‌సన్ (నార్వే; 90.57 మీటర్లు) నెలకొల్పిన రికార్డును నదీమ్ బద్దలు కొట్టాడు. ప్రపంచ మాజీ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) 88.54 మీటర్లతో కాంస్య పతకాన్ని సాధించాడు.

1 వ్యక్తిగత క్రీడాంశంలో ఒలింపిక్స్ చరిత్రలో పాకిస్తాన్‌కు తొలి స్వర్ణ పతకం నదీమ్ ద్వారా లభించింది. గతంలో పాకిస్తాన్ హాకీ జట్టు 3 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలు గెలిచింది. 1960 రోమ్ ఒలింపిక్స్ రెజ్లర్ మొహమ్మద్ బషీర్ కాంస్యం... 1988 సియోల్ ఒలింపిక్స్‌లో బాక్సర్ హుస్సేన్ షా కాంస్యం సాధించారు.

4 ఒలింపిక్స్ క్రీడల్లో రెండు వ్యక్తిగత పతకాలు సాధించిన నాలుగో భారత ప్లేయర్‌గా నీరజ్ గుర్తింపు పొందాడు. గతంలో రెజ్లర్ సుశీల్ (2008 బీజింగ్; కాంస్యం... 2012 లండన్; రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో; రజతం... 2020 టోక్యో; కాంస్యం), షూటర్ మనూ భాకర్ (2024 పారిస్; 2 కాంస్యాలు) ఈ ఘనత సాధించారు.

కాంస్యం కోసం అమన్ పోరు

నేడు ప్యూర్టోరికో రెజ్లర్ దరియన్ క్రూజ్‌తో బౌట్



పారిస్: ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తొలి ప్రయత్నంలోనే పతకం సొంతం చేసుకునేందుకు భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ ఒక విజయం దూరంలో నిలిచాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో అమన్ సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. 2016 రియో ఒలింపిక్స్ రజత పతక విజేత రె హిగుచి (జపాన్)తో జరిగిన సెమీఫైనల్లో 21 ఏళ్ల అమన్ ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో పరాజయం చవిచూశాడు. మూడు నిమిషాల నిడివిగల తొలి భాగంలో 2 నిమిషాల 14 సెకన్లలో రె హిగుచి 10–0తో ఆధిక్యాన్ని సంపాదించడంతో రిఫరీ బౌట్‌ను ముగించాడు. ఇద్దరి రెజ్లర్ల మధ్య 10 పాయింట్ల తేడా వచ్చిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపి వేసి పది పాయింట్ల ఆధిక్యం సాధించిన రెజ్లర్‌ను ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో ప్యూర్టోరికో రెజ్లర్ దరియన్‌తో అమన్ తలపడతాడు.

రెండు ఘనవిజయాలతో...

అంతకుముందు అమన్ రెండు వరుస ఘనవిజయాలతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో అమన్ 3 నిమిషాల 59 సెకన్లలో 10–0తో ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో వ్లాదిమిర్ ఇగొరోవ్ (నార్త్ మెసడోనియా)ను ఓడించాడు. క్వార్టర్ ఫైనల్లో అమన్ 3 నిమిషాల 56 సెకన్లలో 12–0తో ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో అబాకరోవ్ జెలీమ్ ఖాన్ (అల్బేనియా)పై గెలుపొందాడు. అబాకరోవ్ 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 57 కేజీల విభాగంలో స్వర్ణం, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించడం విశేషం. అమన్ తన సహజశైలిలో ఆడితే నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో దరియన్‌పై నెగ్గడం అంత కష్టమేమీ కాదు.

అన్షు తొలి రౌండ్‌లోనే...

మహిళల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత రెజ్లర్ అన్షు మలిక్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. హెలెన్ లూసీ మరూలిస్ (అమెరికా)తో జరిగిన బౌట్‌లో అన్షు 2–7 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. అయితే హెలెన్ ఫైనల్ చేరుకోకపోవడంతో అన్షుకు రెపిచాజ్ రూపంలో కాంస్య పతకం కోసం పోటీ పడే అవకాశం చేజారింది.

భారత్ @ పారిస్ ఒలింపిక్స్

నాలుగో స్థానంలో నిలిచిన ప్లేయర్లు

- **లక్ష్య సేన్** – బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్
- **అర్జున్ బబూతా** – షూటింగ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్
- **అంకిత భకత్-బొమ్మదేవర ధీరజ్** – ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్
- **మనూభాకర్** – షూటింగ్ మహిళల 25 మీటర్ల పిస్టల్ (10 మీటర్ల వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రెండు కాంస్యాలు గెలిచింది.)
- **మహేశ్వరీ చౌహాన్-అనంత్‌జీత్ సింగ్** – షూటింగ్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్
- **మీరాబాయి చాను** – వెయిట్ లిఫ్టింగ్ మహిళల 49 కేజీలు

ఆ ఆరు వచ్చి ఉంటే ‘పది’ దాటేవాళ్లం...

పారిస్ ఒలింపిక్స్‌లో అదృష్టం కూడా కలిసి వచ్చి ఉంటే భారత్ పతకాల సంఖ్య రెండంకెలు దాటేది. ఇప్పటికే ఐదు పతకాలు నెగ్గిన భారత్ త్రుటిలో నాలుగు కాంస్య పతకాలను కోల్పోయింది. షూటర్లు అదరగొట్టగా... ఆర్చరీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో మన వాళ్లు నిరాశ పరిచారు. కచ్చితంగా పతకాలు సాధిస్తారనుకున్న ఆటగాళ్లు తడబడగా... మరో ఆరుగురు ప్లేయర్లు నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో మెడల్ చేజార్చుకున్నారు.

వహ్వా హాకీ



టోక్యోలో అద్భుత ఆటతో అదరగొట్టిన భారత హాకీ జట్టు పారిస్ వరకు దానిని కొనసాగించింది. నాటి విజయం తర్వాత అంచనాలను పెంచిన మన టీమ్ ఈసారి కూడా దానికి తగినట్లుగా పతకాన్ని అందించింది. వరుసగా రెండో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించి తమ సత్తాను చాటింది. 1952–1972 మధ్య వరుసగా ఒలింపిక్ మెడల్ పోడియంపై నిలిచిన భారత జట్టు ఆ తర్వాత ఎప్పుడూ వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో పతకాలు గెలవలేకపోయింది. ఈసారి మాత్రం గత ఒలింపిక్స్ కాంస్యపు ప్రదర్శనను పునరావృతం చేసింది. రెండు సందర్భాల్లోనూ జట్టు విజయాల్లో కీలకంగా నిలిచిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ ఈ గెలుపు తర్వాత ఘనంగా తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఓవరాల్‌గా ఒలింపిక్స్ చరిత్రలో భారత హాకీకిది 13వ పతకం కావడం విశేషం.

కాంస్యం సాధించిన భారత పురుషుల హాకీ జట్టు

- 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో పతకాలు
- ప్లే ఆఫ్ మ్యాచ్‌లో 2-1తో స్పెయిన్‌పై గెలుపు
- ఘనంగా గోల్‌కీపర్ శ్రీజేశ్ రిటైర్మెంట్
- పారిస్ క్రీడల్లో భారత్‌కు నాలుగో కాంస్యం

పారిస్: మ్యాచ్‌లో 58 నిమిషాలు ముగిసేసరికి 2–1తో ఆధిక్యంలో భారత్... మరో రెండు నిమిషాలు బంతిపై పట్టు ఉంచుకుంటే చాలు మ్యాచ్ మనదే... అయితే సరిగ్గా 59వ నిమిషంలో స్పెయిన్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. దాంతో అందరిలో కాస్త ఆందోళన... గతంలో చాలా సందర్భాల్లో భారత జట్టు గెలిచే స్థితిలో ఉండి ఆఖరిలో పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్స్ ఇచ్చి మ్యాచ్ కోల్పోయింది. కాబట్టి కొంత ఉత్కంఠ! అయితే స్పెయిన్ ప్లేయర్ మిరాల్స్ ప్రయత్నాన్ని భారత గోల్ కీపర్ శ్రీజేశ్ అడ్డుకున్నాడు. ఆ వెంటనే 60వ నిమిషంలో కూడా వారికి మరో పెనాల్టీ కార్నర్. ఈసారి కూడా శ్రీజేశ్ నిలువరించాడు. దాంతో పాటు చురుగ్గా ఉన్న మన ఆటగాళ్లు బంతిని అందుకొని తమ ఆధీనంలోకి తెచ్చేసుకున్నారు. స్పెయిన్ ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నించినా మళ్లీ మన సర్కిల్‌లోకి రాలేకపోయారు. అంతే... టీమిండియా బృందంలో సంబరాలు మొదలయ్యాయి. శ్రీజేశ్ తన కీపింగ్ పోస్ట్ వద్ద కుప్పకూలిపోగా... సహచరులంతా



చుట్టుముట్టి తమ ఆనందాన్ని ప్రదర్శించారు. సెమీస్‌లో అనూహ్యంగా ఓడినా... చివరకు కాంస్య పతకం గెలుచుకొని భారత జట్టు తమ స్థాయిని ప్రదర్శించింది. ఈ ‘ప్లే ఆఫ్’ పోరులో భారత్ 2–1 గోల్స్ తేడాతో స్పెయిన్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 2 గోల్స్ (30వ నిమిషం, 33వ నిమిషం) సాధించగా... స్పెయిన్ తరఫున మార్క్ మిరాల్స్ (18వ నిమిషం) ఏకైక గోల్ కొట్టాడు. తాజా ఫలితంతో పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ ఖాతాలో నాలుగో కాంస్యం చేరింది.

ఒక్కొక్కరికీ 15 లక్షలు

ప్లేయర్లకు హాకీ ఇండియా నజరానా

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన భారత పురుషుల హాకీ జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ఒక్కో ఆటగాడికి రూ. 15 లక్షలు, సహాయక సిబ్బందికి ఏడున్నరల లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు హాకీ ఇండియా వెల్లడించింది. ఒలింపిక్స్ హాకీలో ఘనచరిత్ర ఉన్న భారత్‌కు విశ్వక్రీడల్లో ఇది 13వ పతకం కావడం విశేషం.

సమష్టి ప్రదర్శనతో...

1980 తర్వాత ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయిన భారత్ 41 ఏళ్ల తర్వాత టోక్యోలో కాంస్యం గెలిచి అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. ఇప్పుడు మూడేళ్ల తర్వాత మళ్లీ అదే తరహాలో భారతీయుల నమ్మకాన్ని జట్టు వమ్ము చేయలేదు. అటు అటాకింగ్‌లో, ఇటు డిఫెన్స్‌లో కూడా జట్టు ప్రభావం చూపించింది. సస్పెన్షన్ కారణంగా గత మ్యాచ్ ఆడని డిఫెండర్ అమిత్ ఈ మ్యాచ్‌లో తిరిగొచ్చి బలంగా నిలబడ్డాడు. 6వ నిమిషంలో సుఖ్‌జీత్‌కు గోల్ అవకాశం వచ్చినా అతను పోస్ట్‌కు దూరంగా కొట్టాడు. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు సమ ఉజ్జీలుగా పోరాడటంతో గోల్ నమోదు కాలేదు. అయితే రెండో క్వార్టర్‌లో స్పెయిన్ శుభారంభం చేసింది. క్లేప్స్‌ను టాకింగ్ చేసే ప్రయత్నంలో ‘డి’లో మన్‌ప్రీత్ ఫౌల్ చేయడంతో స్పెయిన్ పెనాల్టీ స్ట్రోక్ లభించగా, దానిని మిరాల్స్ సులువుగా గోల్‌గా మలిచాడు. అయితే 21 సెకన్లలో రెండో క్వార్టర్ ముగుస్తుందనగా పెనాల్టీతో భారత్ స్కోరు సమం చేసింది. మరో మూడు నిమిషాలకే మళ్లీ పెనాల్టీ ద్వారానే హర్మన్ స్కోరు చేయడంతో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మన జట్టు దానిని చివరి వరకు నిలబెట్టుకోగా... ఆఖరి మూడు నిమిషాల్లో గోల్ కీపర్‌ను తప్పించి స్కోరును సమం చేసేందుకు స్పెయిన్ తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. తమకు లభించిన 6 పెనాల్టీ కార్నర్‌లను భారత్ 2 గోల్స్‌తో సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్‌కు 9 పెనాల్టీలు లభించినా ఆ జట్టు ఒక్కదానినీ గోల్‌గా మలచలేకపోయింది. ‘గ్రేట్ వాల్ ఆఫ్ భారత్’ శ్రీజేశ్ అద్భుత ప్రదర్శనే అందుకు కారణం. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ హాకీకి వీడ్కోలు పలుకుతున్నట్లు శ్రీజేశ్ ముందే ప్రకటించాడు. అతనికి ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు జట్టు సభ్యులు వెల్లడించారు.

నెదర్లాండ్స్‌కు స్వర్ణం

24 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో నెదర్లాండ్స్ పురుషుల హాకీ జట్టు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో నెదర్లాండ్స్ ‘పెనాల్టీ షూటౌట్’లో 3–1తో జర్మనీ జట్టుపై గెలిచింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు ‘షూటౌట్’ నిర్వహించారు. గతంలో నెదర్లాండ్స్ జట్టు 1996 అట్లాంటా, 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లలో పసిడి పతకాలు సాధించింది. భారత జట్టు అత్యధికంగా 8 స్వర్ణాలు నెగ్గగా... నెదర్లాండ్స్, పాకిస్తాన్, బ్రిటన్, జర్మనీ జట్లు మూడు సార్లు చొప్పున బంగారు పతకాలు గెలిచాయి.

జ్యోతికి మళ్లీ నిరాశ

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ నిరాశ పరిచింది. గురువారం మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రెపిచాజ్ రేసులో జ్యోతి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అంతకుముందు బుధవారం హీట్స్‌లో ఏడో స్థానంలో నిలిచిన జ్యోతి... రెపిచాజ్‌లోనూ ఆకట్టుకోలేకపోయింది. ఈ విభాగంలో పోటీ పడుతున్న తొలి భారతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందిన జ్యోతి 13.17 సెకన్లలో గమ్యానికి చేరింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన 24 ఏళ్ల జ్యోతి గతంలో 12.78 సెకన్లతో 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు నెలకొల్పింది.

వెనుకంజలో గోల్ఫర్లు

పారిస్ ఒలింపిక్స్ గోల్ఫ్ మహిళల వ్యక్తిగత స్ట్రోక్ ప్లేలో భారత గోల్ఫర్లు ఆకట్టుకోలేకపోయారు. గురువారం రెండు రౌండ్లు ముగిసేసరికి దీక్ష డాగర్, అదితి అశోక్ చెరో 143 పాయింట్లతో మరో ముగ్గురు గోల్ఫర్లతో కలిసి సంయుక్తంగా 14వ స్థానంలో ఉన్నారు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	28	25	18	71
2	అమెరికా	27	36	34	97
3	ఆస్ట్రేలియా	18	14	11	43
4	ఫ్రాన్స్	14	18	21	53
5	బ్రిటన్	13	17	21	51
6	దక్షిణ కొరియా	12	8	7	27
7	జపాన్	12	7	13	32
8	నెదర్లాండ్స్	11	6	7	24
9	ఇటలీ	10	11	9	30
10	జర్మనీ	9	7	5	21
11	కెనడా	6	5	10	21
63	భారత్	0	1	4	5

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

పడి.. లేచి.. మరో పతకం వైపు...



2023 మార్చి... సొంతగడ్డపై జరిగిన వరల్డ్ కప్‌లో భారత జట్టు అత్యంత చెత్త ప్రదర్శనను నమోదు చేసింది. పేలవ ఆటతో సంయుక్తంగా 9వ స్థానంలో నిలిచిన టీమ్... గతంలో ఏ ఆతిథ్య జట్టూ ఎదుర్కోని అవమానాన్ని భరించాల్సి వచ్చింది. దాంతో మరోసారి భారత హాకీ పాత రోజులు గుర్తుకొచ్చాయి. దాదాపు రెండేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించి ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించిన జట్టు ఇదేనా అనిపించింది. అప్పుడప్పుడే మళ్లీ ఆటపై ఆసక్తి పెరుగుతున్న దశలో స్వదేశంలో జట్టు ఆట మళ్లీ నిరాశపర్చింది. దాంతో సహజంగానే జరిగిన మార్పుల్లో భాగంగా ముందుగా కోచ్ గ్రాహం రీడ్‌పై వేటు పడింది. కొత్త కోచ్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన క్రెయిగ్ ఫుల్టన్ వచ్చాడు. ఆటగాడిగా, కోచ్‌గా విశేష అనుభవం ఉన్న అతను భారత జట్టును మళ్లీ దారిలోకి తీసుకురాగలడని అంతా భావించారు. ఈ నమ్మకాన్ని ఫుల్టన్ నిలబెట్టుకున్నాడు. తనదైన శైలిలో ఆటగాళ్లను మరింత పదునుగా మార్చే పనిలో పడ్డాడు. అప్పటికే సీనియర్లుగా దేశం తరఫున ఎన్నో చిరస్మరణీయ మ్యాచ్‌లు ఆడిన వారిని కూడా తనకు కావాల్సిన రీతిలో మలచుకున్నాడు. ముఖ్యంగా అవుట్‌ఫీల్డ్‌లో వేగం పెంచడం, ఆరంభం నుంచే దూకుడు పెంచి ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచడం వంటి విషయంలో ఆటగాళ్లలో కొత్త తరహా ఆటను తీసుకొచ్చాడు. ముందుగా ఆటగాళ్లు కొంత ఇబ్బంది పడ్డా మెల్లగా ఇవి మంచి ఫలితాలు అందించాయి. ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో స్వర్ణాలు గెలిచిన భారత్ ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆటగాళ్లందరిలోనూ కొత్త ఉత్సాహం కనిపించింది. వరల్డ్ కప్ వైఫల్యాన్ని దాటి ముున్ముందు పెద్ద విజయం సాధించాలనే కసి, పట్టుదల వారిలో పెరిగాయి.

ఒలింపిక్స్‌లో భారత జట్టు ఆట చూస్తే ఫుల్టన్ ప్రణాళికలు ఎంత అద్భుతంగా పని చేశాయో తెలుస్తుంది. సరిగ్గా చెప్పాలంటే ఒకే తరహా ఆటతో కాకుండా వేర్వేరు ప్రత్యర్థుల కోసం జట్టు వేర్వేరు వ్యూహాలు పన్నింది. బెల్జియం జట్టు తమ డిఫెన్స్‌ను పటిష్టంగా ఉంచుకుంటూనే దూకుడుగా ఆడింది. అదే ఆస్ట్రేలియాపై వచ్చేసరికి ఆట మారింది. క్షణకాలం డిఫెన్స్‌లో పడినా ప్రత్యర్థి పైచేయి సాధిస్తుందని తెలుసు కాబట్టి తొలి నిమిషం నుంచి పూర్తిగా అటాకింగ్‌పైనే దృష్టి పెట్టింది. మళ్లీ బ్రిటన్‌తో మ్యాచ్ వచ్చేసరికి డిఫెన్స్‌కు కట్టుబడింది. ఒక ఆటగాడు తగ్గినా కీపర్‌తో కలిసి గోల్స్‌ను కాపాడుకోవడంలో జట్టు సఫలమైంది. సెమీస్‌లో జర్మనీతో ఓడినా గతంలో ఎన్నడూ చూడని అటాకింగ్, ఓటమిని అంగీకరించకుండా పోరాడే తత్వం మన టీమ్ నుంచి కనిపించిందని మాజీ ఆటగాడు వీరేన్ రస్కిన్హా వ్యాఖ్యానించడం విశేషం. క్షణాల వ్యవధిలో వ్యూహాలు మార్చుకోవడం, పరిస్థితికి అనుగుణంగా అప్పటికప్పుడు ఆటతీరును మలచుకోవడం గతంలో భారత జట్టు విషయంలో ఎప్పుడూ చూడనిది.

భారత జట్టు గెలుపు మరో వ్యక్తి ప్రధాన పాత్ర పోషించాడు. అతనే ప్యాడీ ఆప్టన్. స్పోర్ట్స్ సైకాలిజిస్ట్ అయిన ఆప్టన్ భారత హాకీ ఆటగాళ్లను మానసికంగా సంసిద్ధం చేయడంలో, ఒత్తిడిని ఎదుర్కోకుండా బలంగా నిలబడే విషయంలో సరైన దిశలో తీర్చిదిద్దాడు. 2011లో క్రికెట్ వన్డే వరల్డ్ కప్ గెలిచిన సమయంలో భారత జట్టు ఇదే ఆప్టన్ స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌గా వ్యవహరించిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. కోచ్‌ల వ్యూహాలను అమలు చేసే విషయంలో ఆటగాళ్లు ఎక్కడా గతి తప్పలేదు. ఒలింపిక్స్‌తో రిటైర్ అవుతున్న గోల్ కీపర్ శ్రీజేశ్ అడ్డుగోడలా ప్రత్యర్థులను నిలువరించాడు. ఎనిమిది మ్యాచ్‌లలో అతను 62 షాట్‌లను ఎదుర్కొంటే 50 షాట్‌లను ఆపడం విశేషం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీలను గోల్స్‌గా మలచడంలో అద్భుత నైపుణ్యం చూపిస్తూ ఒలింపిక్స్‌లో 10 గోల్స్ నమోదు చేశాడు. డిఫెండర్లు రోహిదాస్, జర్మన్‌ప్రీత్‌లు అద్భుతంగా ప్రత్యర్థి ఆటగాళ్లను అడ్డుకున్నారు. అత్యంత సీనియర్ అయిన మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్ మిడ్‌ఫీల్డ్‌లో తన పదును చూపించగ, మరో సీనియర్ మన్‌దీప్ ఫార్వర్డ్‌గా జట్టును నడిపించాడు. అందరి సమష్టి ప్రదర్శన, పోరాటం, పట్టుదల భారత్‌కు వరుసగా రెండో కాంస్యాన్ని అందించాయి. గత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన భారత జట్టులోని 11 మంది సభ్యులు ‘పారిస్’లోనూ టీమిండియాకు ప్రాతినిధ్యం వహించారు.

-సాక్షి క్రీడా విభాగం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
582	180
78,886	24,117

విదేశీ సూచీలు (శని రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,652	△	455
డోజోన్స్	39,410	△	647
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,145	▽	22
డాక్స్	17,680	△	65
షాంఘై	2,870	△	1
నికాయ్	34,831	▽	414

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	69,205	▽	264
బంగారం (99.5 స్వచ్ఛత)	68,928	▽	263
వెండి (కిలో)	78,880	△	279

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.54	84.56
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.42	107.98
€	యూరో	ఒకటి	90.70	93.07
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.72	58.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.11	56.07
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.01	65.67
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.98	23.76
¥	చైనా యువాన్	ఒకటి	10.83	12.65

ధరల భయం.. వడ్డీరేట్లు యథాతథం!

- వరుసగా 9వసారి ఎక్కడి రేట్లు అక్కడే...
- దీంతో 6.5% వద్దే రెపోరేటు కొనసాగింపు
- ద్రవ్యోల్బణం 4.5శాతంగా ఉద్ఘాటన
- జీడీపీ వృద్ధి అంచనా 7.2 శాతంగానే



ముంబై: ద్రవ్య, పరపతి విధానాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం స్పష్టం చేసింది. దీనితో వరుసగా తొమ్మిదవసారి బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే బెంచ్‌మార్క్ వడ్డీ రేటు– రెపో యథాతథంగా 6.5 శాతంగా కొనసాగనుంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ రుణ రేట్లు దాదాపు యథాపూర్వం ముమ్మందూ కొనసాగనున్నాయి. గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన (ఎంపీసీ) కమిటీ మూడురోజుల సమావేశ నిర్ణయాలు గురువారం వెలువడ్డాయి.

0.25 శాతం రేటు తగ్గింపునకు ఇద్దరు మొగ్గు

గవర్నర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీలో నలుగురు యథాతథ 6.5 శాతం రేటు కొనసాగించడానికి మొగ్గుచూపగా, పావు శాతం రేటు తగ్గింపునకు ఇద్దరు ఓటువేశారు. వీరిలో ఎక్స్‌టర్నల్ సభ్యులు జయంత్ వర్మతోపాటు అషిమా గోయల్ ఉన్నారు. 'ఆహార ద్రవ్యోల్బణం తీవ్రత తాత్కాలికమే కావచ్చు. అయితే అధిక ద్రవ్యోల్బణం కొనసాగుతున్న ప్రస్తుత వాతావరణంలో ద్రవ్య విధాన కమిటీ దీనిని సహించబోదు' అని పాలసీ ప్రకటనలో గవర్నర్ ఉద్ఘాటించారు.

మారని వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలు...

ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బీఐ పాలసీ సమీక్ష వరుసగా 7.2 శాతం, 4.5 శాతాలుగా యథాతథంగా కొనసాగించింది. ఒకపక్క ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూ మరోవైపు వృద్ధికి ఊతం ఇచ్చే చర్యలను ఆర్‌బీఐ కొనసాగిస్తుందని గవర్నర్ స్పష్టం చేశారు. దీనికి దేశంలో తగిన వర్షపాతం దోహదపడుతుందని అన్నారు. 2024–25లో 4 త్రైమాసికాల్లో వృద్ధి రేట్లు వరుసగా 7.1%, 7.2%, 7.3%, 7.2%గా కొనసాగుతాయన్నది పాలసీ సమీక్ష అంచనా. 2025–26 తొలి త్రైమాసికంలో (2026 ఏప్రిల్–జూన్) వృద్ధి 7.2%గా ఉంటుందని కూడా ఆర్‌బీఐ అంచనావేసింది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు త్రైమాసికాల్లో వరుసగా 4.9%, 4.4%, 4.7%, 4.3%గా ఉంటాయని విశ్లేషించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈ స్పీడ్ 4.4%గా ఉంటుందన్నది ఆర్‌బీఐ అంచనా. 2% అటు ఇటుగా 4% వద్ద రిటైల్ ద్రవ్యోల్బణం ఉండేలా చూడాలని ఆర్‌బీఐకి కేంద్రం సూచిస్తోంది.

పాలసీ ముఖ్యాంశాలు...

- మందగమనంలో ఉన్నప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ సవాళ్లను తట్టుకునే స్థాయిలోనే కొనసాగుతోంది.
- దేశీయ ఆర్థిక, ఫైనాన్షియల్ వ్యవస్థలు పటిష్ట ధోరణిలోనే కొనసాగుతున్నాయి.
- దేశంలోకి ఒక నిర్దిష్ట కాలంలో వచ్చీ–వెళ్లే విదేశీ నిధులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) నిర్వహణ బాగుంది.
- విదేశీ మారకద్రవ్య నిల్వలు 675 బిలియన్ డాలర్ల చరిత్రాత్మక గరిష్ట స్థాయిలో ఉన్నాయి.
- 2024–25లో ఇప్పటి వరకూ రూపాయి తీవ్ర ఒడిదుడుకులతో కాకుండా ఒక నిర్దిష్ట స్థాయిలోనే కొనసాగుతోంది.
- గృహ రుణాలతో సహా నిర్దేశించిన అవసరాలకు టాప్–అప్‌ను వినియోగించకపోవడం ఆందోళనకరమే. అయితే ద్వైపాక్షిక ప్రాతిపదికన సమస్యను పరిష్కరించడానికి చర్యలు కొనసాగుతాయి.
- చెక్ క్లియరెన్స్‌ని వేగవంతం చేయడానికి చర్యలు ఉంటాయ్.
- అక్టోబర్ 7 నుంచి 9 వరకూ తదుపరి పాలసీ సమీక్ష చేపట్టనున్నారు.

ఆహార ధరల కట్టడే ధ్యేయం



ఆహార ద్రవ్యోల్బణం 'మొండిగా' అధిక స్థాయిలోనే ఉంది. ధరల స్థిరత్వం లేకుండా, అధిక వృద్ధిని కొనసాగించలేము. ద్రవ్యోల్బణం కట్టడికి తగిన ద్రవ్య విధానాన్ని సెంట్రల్ బ్యాంక్ కొనసాగించాల్సిందే. నిరంతర ఆహార ద్రవ్యోల్బణం నుండి ఉత్పన్నమయ్యే సవాళ్లు, లేదా రెండవ దశ ప్రభావాలను నివారించడానికి అలాగే ఇప్పటివరకు సాధించిన ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి ఎంపీసీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

అనధికార డిజిటల్ లెండింగ్‌పై ఉక్కుపాదం

అనధికార సంస్థల ఆట కట్టించడానికి డిజిటల్ లెండింగ్ యాప్‌ల పబ్లిక్ రిపాజిటరీ ఏర్పాటు కానుంది. నియంత్రణలోని సంస్థలు (ఆర్‌ఈ) ఈ రిపోజిటరీలో తమ డిజిటల్ లెండింగ్ యాప్‌ల గురించిన సమాచారాన్ని నివేదించాలి. అలాగే ఎప్పటికప్పుడు సంబంధిత లావాదేవీల వివరాలను అప్‌డేట్ చేయాలి. అనధికార రుణ యాప్‌లను గుర్తించడంలోవినియోగదారులకు ఇది ఎంతగానో దోహదపడుతుంది.

యూపీఐ ద్వారా రూ.5 లక్షల వరకు పన్ను చెల్లింపులు

యూపీఐ ద్వారా పన్ను చెల్లింపుల పరిమితిని ఒక్కో లావాదేవీకి రూ. లక్ష నుండి రూ. 5 లక్షలకు పెంచాలని పాలసీ నిర్ణయించింది. ఇది యూపీఐ ద్వారా పన్ను చెల్లింపులను మరింత సులభతరం చేయనుంది. ఇక యూపీఐ లావాదేవీలు చేయడానికి ఒక వ్యక్తి మరో వ్యక్తిని అనుమతించడానికి సంబంధించి తాజాగా 'డెలిగేటెడ్ పేమెంట్' సదుపాయం ఏర్పాటు చేస్తుండడం మరో కీలకాంశం.

బ్యాంక్ డిపాజిట్లు పెరగాలి

ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల వైపు గృహ పొదుపులు మారడంపై శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులు తమ విస్తారమైన బ్రాంచ్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం, అలాగే వినూత్న ఉత్పత్తులు, సేవల ద్వారా డిపాజిట్లను సమీకరించాలని కోరారు.

ఫుడ్ వెయిటేజ్‌పై సమీక్ష

బెంచ్‌మార్క్ వడ్డీ రేటును నిర్ణయించేటప్పుడు ఆహార ద్రవ్యోల్బణాన్ని మినహాయించాలన్న తాజా ఆర్థికసర్వే సూచనలను గవర్నర్ దాస్ పరోక్షంగా తోసిపుచ్చారు. ద్రవ్య విధానాన్ని రూపొందించేటప్పుడు ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని విస్మరించబోదని స్పష్టం చేశారు. అయితే వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణంలో ఆహార వెయిటేజ్ 2011–12 నుంచి 46 శాతంగా కొనసాగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, దీనిని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

నియంత్రణా మార్పులు హర్షణీయం



ఆహార ద్రవ్యోల్బణాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ఇక పాలసీలో ప్రతిపాదించిన కొన్ని నియంత్రణా పరమైన సంస్కరణలు హర్షణీయం. ముఖ్యంగా డిజిటల్ లెండింగ్ మార్కెట్ క్రమబద్ధీకరణ పాలసీ నిర్ణయాల్లో కీలకాంశం. యూపీఐ సేవల విస్తరణ, పారదర్శకతకు చర్యలను స్వాగతిస్తున్నాం.

– దినేష్ ఖారా, ఎస్‌బీఐ చైర్మన్

ఎల్‌ఐసీ మెరుగైన పనితీరు



న్యూఢిల్లీ: జీవిత బీమా దిగ్గజం ఎల్‌ఐసీ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) మెరుగైన పనితీరు చూపించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూస్తే 10% పెరిగి రూ.10,461 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంలో లాభం రూ.9,544 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.2,10,910 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.1,88,749 కోట్లతో పోల్చితే.. 11% పైగా పెరిగింది. మొదటి ఏడాది ప్రీమియం (కొత్త పాలసీల ద్వారా) ఆదాయం రూ.6,811 కోట్ల నుంచి రూ.7,470 కోట్లకు దూసుకుపోయింది. పాలసీల రెన్యువల్ రూపంలో ఆదాయం రూ.56,429 కోట్లకు పెరిగింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.53,638 కోట్లు.

బీఎస్‌ఈలో షేరు ధర పెద్దగా మార్పు లేకుండా రూ.1,126 వద్ద క్లోజయింది.

రిలయన్స్ జ్యువెల్స్ 'ఆభర్ కలెక్షన్'



ముంబై: రిలయన్స్ జ్యువెల్స్ 17 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఆభర్ కలెక్షన్'ను అందుబాటులోకి తెచ్చింది. ఇయర్ రింగ్స్‌తో పాటు క్యాజువల్ స్టడ్‌లు, హూప్స్, డాంగ్లర్, ఝుమ్కీలు, జే–బాలీ డిజైన్లు ఈ కలెక్షన్‌లో ఉన్నాయి. 'ఇయర్ రింగ్స్ దట్ ఎక్స్‌ప్రెస్ యు' అనే ట్యాగ్‌తో క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ సందర్భంగా బంగారం తయారీ చార్జీలు, డైమండ్ విలువపై ఫ్లాట్ 17% తగ్గింపు అందిస్తుంది. అలాగే ఈ సెప్టెంబర్ 2 వరకు రూ.5 లక్షలు అంతకు మించి కొనుగోళ్లపై అదనంగా 5% డిస్కౌంట్ ప్రకటించింది. 'గతంలో ఎలాగైతే రిలయన్స్ ఉత్పత్తులను ఆదరించారో, ఇప్పుడు కూడా ఆభర్ కలెక్షన్‌ను ఆదరిస్తారని భావిస్తున్నాం' అని సంస్థ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు.



మెప్పించని ఆర్‌బీఐ పాలసీ

- సెన్సెక్స్ 582 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 180 పాయింట్ల నష్టం

ముంబై: ద్రవ్యోల్బణంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆర్‌బీఐ తొమ్మిదోసారి కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడంతో స్టాక్ సూచీలు గురువారం 1% నష్టపోయాయి. ఈ ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ వృద్ధి అంచనాలు ఓ మోస్తారుగా తగ్గించడం కూడా ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. విదేశీ ఇన్వెస్టర్ల వరస విక్రయాలూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 582 పాయింట్లు పతనమై 78,886 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 180 పాయింట్లు నష్టపోయి 24,117 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో దశలో సెన్సెక్స్ 669 పాయింట్లు క్షీణించి 78,790 వద్ద, నిఫ్టీ 218 పాయింట్లు పతనమై 24,080 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. ఫార్మా తప్ప అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి.

- నిర్మాణ రంగ సీగల్ ఇండియా షేరు లిస్టింగ్ లాభాలు నిలుపుకోలేకపోయింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.401)తో పోలిస్తే 3% ప్రీమియంతో రూ.413 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 6% ఎగసి రూ.425 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 4% నష్టంతో రూ.386 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,725 కోట్లుగా నమోదైంది.


'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మెర్సిడెస్ రెండు కొత్త కార్లు
తెలుగు రాష్ట్రాల్లో ఫెడరల్ బ్యాంక్ 100 శాఖల విస్తరణ

షూటింగ్ వరల్డ్ కప్ ఫైనల్‌కు భారత్ ఆతిథ్యం

ప్రతిష్టాత్మక అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) వరల్డ్ కప్ ఫైనల్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో న్యూఢిల్లీలోని కర్ణి సింగ్ రేంజ్‌లో ప్రపంచకప్ ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు భారత రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) గురువారం ప్రకటించింది. ఒలింపిక్స్‌లోని 12 వ్యక్తిగత విభాగాల్లో విజేతలుగా నిలిచిన షూటర్లు ఈ టోర్నీకి నేరుగా అర్హత సాధించనున్నారు. వీరితో పాటు గత సంవత్సరం దోహా, ఖతార్‌లో జరిగిన వరల్డ్ కప్ ఫైనల్స్ చాంపియన్లు కూడా ఇందులో నేరుగా పాల్గొననున్నారు. ఇక ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన షూటర్లు కూడా నేరుగా పోటీ పడనున్నారు. ఆతిథ్య హోదాలో భారత్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ అవకాశాలు ఉన్నాయి. 'ప్రపంచకప్ ఫైనల్ భారత్ లో జరగనుండటం ఇది రెండోసారి' అని ఎన్‌ఆర్‌ఏఐ గురువారం ప్రకటించింది.



నేను అలసిపోయాను!



కుస్తీకి స్వస్తి పలికిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్

రిటైర్మెంట్ నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్న డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్

"అమ్మలాంటి రెజ్లింగ్ నా మీద గెలిచింది. నేనేమో ఓడిపోయాను. దయచేసి... మీరంతా నన్ను క్షమించండి. మీ కలలు, నా ధైర్యం అన్నీ ముక్కలయ్యాయి. ఇకపై నాకు పోరాడే శక్తి లేదు. గుడ్‌బై రెజ్లింగ్ 2001-2024. నన్ను అభిమానించిన, మద్దతు తెలిపిన మీ అందరికీ నేనెప్పుడు రుణపడే ఉంటాను"... కుస్తీనే లోకంగా, ఒలింపిక్స్ పతకమే ధ్యేయంగా ఎదిగి... ఇంటా బయటా క్రీడ, క్రీడేతర శక్తులతో పోరాడిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన ఈ రిటైర్మెంట్ నిర్ణయంతో మళ్లీ మన గుండెల్ని బరువెక్కించింది.

పారిస్: సెమీస్‌లో గెలిచి... ఫైనల్‌కు ముందు 100 గ్రాముల తేడాతో అనర్హతకు గురైన భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మళ్లీ మ్యాట్‌పైకి దిగే ఉద్దేశం లేదని ప్రకటించింది. రెజ్లింగ్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నానని గురువారం 29 ఏళ్ల వినేశ్ వెల్లడించింది.

కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) అప్పీలుకు సైతం వెళ్లిన ఆమె తీర్పు వెలువడక ముందే అనూహ్యంగా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకుంది. అలసిపోయిన తనకు ఇకపై కుస్తీలో ప్రత్యర్థులను పట్టుపట్టే బలం లేదంటూ గురువారం సోషల్ మీడియా వేదికగా గుడ్‌బై చెప్పింది. ఊహించని ఆమె నిర్ణయానికి భారత క్రీడాలోకం నిర్ఘాంతపోయింది. ఆమెను పోరాట యోధురాలిగా చూసిన క్రీడాకారులంతా వారిస్తున్నారు. ఆమెను అభిమానించే వారంతా రెజ్లర్ అధైర్యపడొద్దని వేడుకొంటున్నారు. తల్లిలాంటి రెజ్లింగ్‌పై తన ఉక్కు సంకల్పం సడలించవద్దని అదేపనిగా విజ్ఞప్తి చేస్తున్నారు. వినేశ్ పెదనాన్న ద్రోణాచార్య అవార్డీ, కోచ్ మహావీర్ ఫొగాట్ మాట్లాడుతూ భారత్‌కు చేరగానే తనతో మాట్లాడి వీడ్కోలు నిర్ణయాన్ని విరమించుకునేలా చేస్తానని తెలిపారు. 'నేను బజరంగ్ పూనియా, గీత కలిసి కూర్చొని అమెతో మాట్లాడతాం. అంతా కలిసి ఆమెకు నచ్చజెబుతాం. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కోసం లక్ష్య నిర్దేశం చేస్తాం' అని మహావీర్ అన్నారు. వినేశ్ పోటీపడ్డ ఫ్రీస్టయిల్ 50 కేజీల విభాగంలో స్వర్ణం గెలిచిన సారా హిల్డర్‌బ్రంట్ (అమెరికా) మాట్లాడుతూ 'వినేశ్ అనర్హతకు గురవడం బాధాకరం. బరువు తగ్గడం కోసం పడే పాట్లు ఎలా ఉంటాయో నాకు తెలుసు. అమె కష్టాన్ని నేను అర్థం చేసుకోగలను' అని పేర్కొంది.



ఒలింపిక్స్ క్రీడా గ్రామంలో అభినవ్ బింద్రాతో వినేశ్

అప్పీలుపై విచారణ నేడు

వినేశ్ అనర్హత, పతకం నిరాకరణపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లోని అడ్‌హక్ కమిటీ గురువారం రాత్రి విచారించాల్సింది. నలుగురు లాయర్లతో కూడిన బృందాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఏర్పాటు చేసుకుంది. అయితే బలమైన వాదన, పూర్తి స్థాయి సన్నద్ధత కోసం నిష్ణాతులైన లాయర్లతో అప్పీలును గెలిచేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న ఐఓఏ ఒకరోజు గడువు కోరింది. దీన్ని మన్నించిన సీఏఎస్ శుక్రవారం మధ్యాహ్నానికి విచారణను వాయిదా వేసినట్లు తెలిసింది.

కల కాదు... ఆమెకు ఒలింపిక్స్ ఓ పీడకల!

ప్రపంచ చాంపియన్‌షిప్‌లు, ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో మంచి రికార్డే ఉన్న వినేశ్‌కు ఏ ఒలింపిక్స్ కూడా అచ్చి రాలేదు. అందుకే ఆమె కెరీర్‌లో ఒలింపిక్స్ కల కాదు ఓ పీడకలగా మిగిలిపోయింది. 2016 రియో ఒలింపిక్స్‌లో కీలకమైన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో గాయం వల్ల ముందంజ వేయలేకపోయింది. మళ్లీ ఐదేళ్ల (కోవిడ్ వల్ల 2021లో) తర్వాత టోక్యో విశ్వక్రీడల్లో క్వార్టర్స్‌లోనే ఓటమితో నిష్క్రమించింది. ఇప్పుడు మూడేళ్లకే జరిగిన పారిస్ ఈవెంట్‌లో కనీసం ఖాయమనుకున్న రజతాన్ని అనర్హత వేటు అవహేళన చేసింది.

వినేశ్ ప్రొఫైల్

పుట్టిన తేదీ, స్థలం : 25 ఆగస్టు 1994, హరియాణా
అత్యుత్తమ ర్యాంక్: ప్రపంచ నంబర్‌వన్
విభాగం: ఫ్రీస్టయిల్ రెజ్లింగ్

యూత్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్

2013 జొహన్నెస్‌బర్గ్	రజతం	51 కేజీలు

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలు

2022 బెల్‌గ్రేడ్	కాంస్యం	53 కేజీలు
2019 నూర్ సుల్తాన్	కాంస్యం	53 కేజీలు

ఆసియా క్రీడల్లో పతకాలు

2018 జకార్తా	స్వర్ణం	50 కేజీలు
2014 ఇంచియాన్	కాంస్యం	48 కేజీలు

కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు

2014 గ్లాస్గో	స్వర్ణం	48 కేజీలు
2018 గోల్డ్‌కోస్ట్	స్వర్ణం	50 కేజీలు
2022 బర్మింగ్‌హామ్	స్వర్ణం	53 కేజీలు

ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పతకాలు

2021 అల్మటీ	స్వర్ణం	53 కేజీలు
2015 దోహా	రజతం	48 కేజీలు
2017 న్యూఢిల్లీ	రజతం	55 కేజీలు
2018 బిష్కెక్	రజతం	50 కేజీలు
2013 న్యూఢిల్లీ	కాంస్యం	51 కేజీలు
2016 బ్యాంకాక్	కాంస్యం	53 కేజీలు
2019 జియాన్	కాంస్యం	53 కేజీలు
2020 న్యూఢిల్లీ	కాంస్యం	53 కేజీలు

> క్రీడ అనేది మానవ సంకల్పానికి వేడుకలాంటిది. నా కెరీర్లో ఇలాంటి సందర్భాల్ని వేడుకల్ని చాలా సార్లు చవిచూశాను. వినేశ్ సంకల్పానికి దేశం ఒక్కటై పలికిన జేజేలను మాత్రం ఎప్పుడూ చూడలేదు. పట్టు సడలించని ఆమె సంకల్పాన్ని జాతి యావత్తు వేడుక చేసుకుంటోంది.
>
> –అభినవ్ బింద్రా, షూటింగ్‌లో బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత

> క్రీడాకారులు జీవితమంతా సవాళ్లతోనే సహవాసం చేస్తారు. ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూస్తారు. కలను నెరవేర్చుకునే రోజు నైపుణ్యంతో రాణిస్తే విజయం చేకూరుతుంది. కానీ ఊహకందని ఈ పొరపాట్లు (స్వల్ప బరువుతో అనర్హత) జరిగితే మాత్రం ఎవరికైనా గుండె బద్దలవుతుంది.
>
> –కేంద్ర క్రీడల మాజీ మంత్రి, షూటర్ రాజ్యవర్ధన్ రాథోడ్

> మేమంతా వినేశ్ తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుంటుందనే నమ్మకంతో ఉన్నాం. కఠోర సాధనతో లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ (2028)లో స్వర్ణం గెలిచి మా పిన్ని (వినేశ్ తల్లి), మా నాన్న మహావీర్ కలల్ని సాకారం చేసుకుంటుంది. ఇంటికొచ్చాక నాన్న ఆమెతో మాట్లాడి రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేస్తారు.
>
> –మాజీ రెజ్లర్ బబితా ఫొగాట్

> వినేశ్... అంతపని (రిటైర్మెంట్) చేయొద్దు. బాధలో ఉన్నప్పుడు ఇలాంటి నిర్ణయం తగదు. నేను భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) తరఫున ఆమె వీడ్కోలుకు బై చెప్పి ఎప్పట్లాగే బౌట్‌లో సత్తా చాటాలని విజ్ఞప్తి చేస్తున్నాను.
>
> –డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ సంజయ్ సింగ్

అంతిమ్‌పై మూడేళ్ల నిషేధం!

పారిస్ ఒలింపిక్స్‌లో క్రమశిక్షణను ఉల్లంఘించిన భారత మహిళా రెజ్లర్







నిషా

పారిస్: భారత యువ రెజ్లర్ అంతిమ్ పంఘాల్‌పై మూడేళ్ల నిషేధం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పారిస్ ఒలింపిక్స్ మహిళల రెజ్లింగ్ 53 కేజీల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన అంతిమ్ తొలి రౌండ్ బౌట్‌లోనే టర్కీ రెజ్లర్ యెట్‌గిల్ జెనెప్ చేతిలో ఓడిపోయింది. ఆ తర్వాత క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడటంతో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) 19 ఏళ్ల అంతిమ్‌పై కఠిన నిర్ణయం తీసుకునే చాన్స్ కనిపిస్తోంది. బౌట్ అనంతరం క్రీడాగ్రామానికి కాకుండా.. హోటల్ రూమ్‌కు చేరుకున్న అంతిమ్.. స్పోర్ట్స్ విలేజ్‌లో ఉన్న తన వస్తువులను తీసుకురావడానికి సోదరికి అక్రిడిటేషన్ కార్డు ఇచ్చింది. దీన్ని గుర్తించిన ఒలింపిక్స్ సిబ్బంది అక్రిడిటేషన్ నిర్ధారణ కోసం అంతిమ్ సోదరి నిషాను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. మరోవైపు అంతిమ్ వ్యక్తిగత కోచ్‌లు మద్యం తాగి ట్యాక్సీ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ మొత్తం అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్న ఐఓఏ.. అంతిమ్ స్వదేశానికి తిరిగి వచ్చిన అనంతరం నిర్ణయం వెల్లడించనుంది. కాగా.. ఇప్పటికే అంతిమ్‌పై నిషేధం విధించినట్లు వస్తున్న వార్తలను గురువారం ఐఓఏ ఖండించింది. దీనిపై అంతిమ్ స్పందిస్తూ.. 'నేనే తప్పు చేయలేదు. గందరగోళం వల్లే ఇదంతా జరిగింది. ఇది నా రోజు కాదు. అటు బౌట్‌లో ఓటమి ఎదురైంది. ఆ తర్వాత నా గురించి చాలా తప్పుడు వార్తలు వచ్చాయి. వాటిలో నిజం లేదు. అక్రిడిటేషన్ నిర్ధారణ కోసమే పోలీసుస్టేషన్‌కు వెళ్లా. అనారోగ్యంగా ఉండటంతో కోచ్‌ను అడిగే హోటల్‌కు వెళ్లా. క్రీడాగ్రామంలో కొన్ని వస్తువులు ఉండిపోవడంతో.. సోదరికి కార్డు ఇచ్చి తీసుకురమ్మని చెప్పా. ఇక కోచ్‌ల విషయంలో కూడా ఇలాగే జరిగింది తప్ప మరొకటి కాదు' అని వివరించింది.

క్లుప్తంగా...

‘ఉపాధి’ ఉసురు తీసేందుకే జాబు కార్డుల తగ్గింపు



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ చట్టం ద్వారా పొందిన 35 లక్షల జాబు కార్డులను తొలగించినట్లు పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ప్రకటించడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్ కార్డుల తొలగింపుతో పనిచేసే వారి సంఖ్య తగ్గిందని చెప్పి బడ్జెట్‌లో కోతపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, తక్షణమే రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి సినిమాల్లో.. స్మగ్లింగ్ చేస్తే హీరోయిజం

అల్లు అర్జున్‌పై పవన్ పరోక్ష విమర్శలు

బొమ్మనహళ్లి: బెంగళూరు పర్యటనకు వచ్చిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అల్లు అర్జున్‌తో పాటు ఆయన నటించిన ‘పుష్ప’ సినిమాపై పరోక్ష విమర్శలు చేశారు. గురువారం కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో సమావేశం అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. ‘కల్చర్ ఎలా మారిందంటే.. దాదాపు 40 ఏళ్ల క్రితం సినిమాల్లో హీరో అడవులను కాపాడేవాడు. కానీ ఇప్పుడు హీరో అడవిలో చెట్లు నరికి, స్మగ్లింగ్ చేస్తున్నాడు. అదే హీరో యిజం అయిపోయింది. నేను కూడా సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తినే. అలాంటి సినిమాలు చేయడాన్ని నేను ద్వేషిస్తాను. సినిమాల ద్వారా నేను సరైన సందేశం ఇస్తున్నానా అనే స్ట్రగుల్ నాలో ఎప్పుడూ ఉండేది’ అంటూ పవన్ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అల్లు అర్జున్‌తో పాటు ఆయన నటించిన పుష్ప సినిమా గురించే పవన్ ఈ విమర్శలు చేశారంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. పవన్ వ్యాఖ్యలపై అల్లు అర్జున్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ‘జల్సా’ సినిమాలో ‘రేప్’ సీన్ ద్వారా ఎలాంటి సందేశం ఇచ్చావ్? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఏపీకి కుంకీ ఏనుగులు ఇవ్వండి



కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కలిసిన పవన్‌కళ్యాణ్

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గురువారం బెంగళూరులో పర్యటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన కావేరిలో సిద్ధరామయ్యతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. అనంతరం విధానసౌధకు చేరుకుని అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో భేటీ అయ్యారు. ఏనుగుల దాడులను అరికట్టేందుకు.. వాటిని బంధించి మచ్చిక చేసుకునేందుకు కర్ణాటక అవలంభిస్తున్న విధానాలను పవన్ అడిగి తెలుసుకున్నారు. 8 కుంకీ(పెంపుడు) ఏనుగులను ఏపీకి ఇవ్వాలని మంత్రి ఈశ్వర్‌ను పవన్ కోరారు. ఏపీలోని పలు జిల్లాల్లో ఏనుగులు పొలాలపై దాడులు చేసి నష్టం కలి గిస్తున్నాయని వివరించారు. వాటిని అడ్డుకోవడానికి కుంకీ ఏనుగుల సాయం కావాలన్నారు.

‘స్కిల్ సెన్సస్’తో యువతకు ఉపాధి: లోకేశ్



సాక్షి, అమరావతి: యువతలో నైపుణ్యాలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో స్కిల్ సెన్సస్ ప్రారంభించనున్నట్టు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్కిల్ సెన్సస్ విధివిధానాల రూపకల్పనపై స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో గురువారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్కిల్ సెన్సస్ పూర్తిచేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తొలుత ఒక నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

పల్నాడులో మళ్లీ పేట్రేగిన టీడీపీ మూకలు..

- వినుకొండలో పట్టపగలు వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగరాజుపై కత్తులతో దాడి
- సెల్‌ఫోన్ సిగ్నల్ల ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు



1. కిడ్నాప్‌కు గురైన నాగరాజు 2. రోదిస్తున్న కుటుంబ సభ్యులు 3. ఆస్పత్రిలో సొమ్మసిల్లి పడిపోయిన నాగరాజు భార్య

సాక్షి, నరసరావుపేట, వినుకొండ (నూజెండ్ల): అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా ఎన్నికల హామీలపై ఏమాత్రం దృష్టిపెట్టని టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి సర్కారు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రం అనుకున్నది అనుకున్నట్లుగా పక్కాగా అమలుచేస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను హత్యచేయడం, వారిపై దాడులకు తెగబడడం, ఆస్తులు ధ్వంసం చేసి గ్రామాల నుంచి వెళ్లగొట్టడం పల్నాడులో సర్వసాధారణమయ్యాయి. చివరికి సొంత ఊర్లో ఇళ్లు, పొలాలు వదిలి పొట్టకూటి కోసం వలస వెళ్లి చిన్నచిన్న పనులు చేసుకుంటున్న వారిని సైతం వెంటాడి కిడ్నాప్ చేసి అంతమొందించడానికి తెలుగుదేశం పార్టీ గూండాలు వెనుకాడడంలేదు. తాజాగా.. వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెం గ్రామం వద్ద మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఒంటేరు నాగరాజు ఆటోలో వెళ్తుండగా టీడీపీ నేతలు దారికాచి దాడిచేశారు. అందులోని అతని కుటుంబ సభ్యుల్ని గాయపరిచి నాగరాజును కిడ్నాప్ చేయడం తీవ్ర అలజడి రేపింది. పోలీసులు కిడ్నాపర్లను పట్టుకుని నాగరాజును పోలీసుస్టేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి నాగరాజు బావమరిది రవి తెలిపిన వివరాలు ఏమిటంటే..

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన నాగరాజు కుటుంబ సభ్యులు టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సొంత గ్రామం జంగమేశ్వరపాడు గ్రామాన్ని విడిచిపెట్టి వినుకొండలోని తన బావమరిది రవి వద్దకు వచ్చి ఉంటున్నారు. బతుకుతెరువు కోసం ఆటోలో కూరగాయలు అమ్ముకుంటున్నాడు. ఈ నేపథ్యంలో.. నాగరాజు తన తల్లి వెంకమ్మ, బావమరిది రవితో కలిసి గురువారం ఉ.8.30 ప్రాంతంలో వెల్లటూరు వైపు వెళ్తుండగా వెంకుపాలెం కురవ వద్దకు రాగానే టీడీపీ నేతలు కారుతో ఆటోను అడ్డగించారు. కారులో వచ్చిన సుమారు 8 మంది రవిపై కత్తులతో దాడిచేసి గాయపరిచారు. ఆ తర్వాత నాగరాజు తల్లిపైనా దాడిచేసి నాగరాజును బలవంతంగా కారులో ఎక్కించుకుని వెల్లటూరు వైపు దూసుకెళ్లారు. కిడ్నాప్ చేసింది జంగమేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేతలే అని నాగరాజు కుటుంబ సభ్యులు నిర్ధారించారు.

అందరూ చూస్తుండగానే..

పట్టపగలు అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై కత్తులతో స్వైరవిహారం చేస్తూ నాగరాజును కిడ్నాప్ చేయడంతో వినుకొండ ప్రాంతంలో అలజడి రేగింది. అక్కడున్న స్థానికులు దాడిలో గాయపడిన రవి, నాగరాజు తల్లి వెంకాయమ్మలను వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న నాగరాజు భార్య, నాగమల్లేశ్వరి, చెల్లెళ్లు భువనేశ్వరి, రజనీలతోపాటు నాగరాజు తండ్రి సాంబయ్య నాగరాజును చంపేస్తారని, కాపాడాలంటూ బోరున విలపించారు.

ఆ టీడీపీ నేతలే కిడ్నాప్ చేశారు..

నాగరాజు తండ్రి సాంబయ్య మీడియాతో మాట్లాడుతూ.. జంగమేశ్వరపాడుకు చెందిన టంగుటూరి శబరి కుమారుడు మల్లికార్జున, కొండా, ఆరెద్దుల మణి, కంచర్ల బొర్రయ్య కుమారుడు రామాంజి, నానారావు కుమారుడు జల్లయ్యతోపాటు మరో ముగ్గురు తన కుమారుడిని కిడ్నాప్ చేశారని తెలిపారు. మరోవైపు.. ఆస్పత్రి వద్ద నాగరాజు భార్య సొమ్మసిల్లి పడిపోయింది. ఆస్పత్రి ఆవరణలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బతుకుతెరువు కోసం, ప్రాణాలు కాపాడుకునేందుకు గ్రామంలో పొలాలు, ఇళ్లు వదలేసి దూరంగా బతుకుతున్నప్పటికీ టీడీపీ నేతలు తమను ఇక్కడ కూడా బతకనివ్వడంలేదని వాపోయారు.

కత్తులతో దాడిచేసి కిడ్నాప్ చేశారు..



కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మా బావ నాగరాజు కుటుంబం టీడీపీ దాడులకు భయపడి వినుకొండలో నా వద్దకు వచ్చి కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. అయినాసరే వదిలిపెట్టకుండా గురువారం ఉదయాన్నే కత్తులతో దాడిచేసి గాయపరిచారు. అడ్డొచ్చిన మహిళలపై కూడా దాడి చేసి నాగరాజును కారులో ఎక్కించుకుని పరారయ్యారు. నా ఫోన్‌ను సైతం లాక్కెళ్లారు.

– రవి, దాడిలో గాయపడిన నాగరాజు బావమరిది

సెల్‌ఫోన్ సిగ్నల్ల ఆధారంగా నిందితుల పట్టివేత..

నాగరాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వినుకొండ సీఐ శోభన్‌బాబు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి కిడ్నాపర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సెల్‌ఫోన్ల సిగ్నల్ ఆధారంగా నిందితులను బొల్లాపల్లి మండలం మర్రిపాలెం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాడిలో ఏడుగురు పాల్గొనగా ఆరుగురిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఒక వ్యక్తి ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు.. బాధితుడు నాగరాజును రక్షించిన పోలీసులు బొల్లాపల్లి స్టేషన్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

నాగరాజుకు ఏం జరిగినా బాబుదే బాధ్యత

మాజీమంత్రి అంబటి ఫైర్

సాక్షి, అమరావతి: పల్నాడులో టీడీపీ గూండాలు కిడ్నాప్ చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఒంటేరు నాగరాజుకు ఎలాంటి హాని జరిగినా చంద్రబాబు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని మాజీమంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. పల్నాడులో నాగరాజు కిడ్నాప్‌పై ఆయన తీవ్రంగా స్పందించారు. అసలు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా? అంటూ సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనితను ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాగరాజుకు ఏమైనా హాని జరిగితే తీవ్ర పరిణామాలుంటాయి. రాష్ట్రంలో ఎంత దారుణమైన ఘటనలు జరుగుతున్నాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇటీవలే వినుకొండలో ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్తను అతి దారుణంగా నరికి చంపారు. ఈ ఘటనలపై చంద్రబాబు స్పందించాలన్నారు. మాజీమంత్రి మేరుగ నాగార్జున పాల్గొన్నారు.

పోలీసులు చేతులెత్తేశారు: కొరముట్ల

రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడే అంశంలో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారని, కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేసేందుకే అన్నట్లుగా వారి ప్రవర్తన ఉందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కోరముట్ల శ్రీనివాసులు తాడేపల్లిలో మాట్లాడుతూ ఫైర్ అయ్యారు. మొన్న వినుకొండ, నిన్న నంద్యాల, జగ్గయ్యపేట ఘటనలు జరగ్గా ఈరోజు కిడ్నాప్ జరగడం అత్యంత దారుణమన్నారు. జగన్‌కి ఎక్కువ భద్రత ఉన్నట్లు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

మేం చెప్పిన వారే చైర్మన్

- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యకాండ
- పలుచోట్ల వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గెలిచినా టీడీపీ మద్దతుదారులకే పట్టం
- 40,150 పాఠశాలల్లో ఎన్నికలు పూర్తయినట్లు ప్రభుత్వం ప్రకటన



హిందూపురం మండలం మలుగూరు స్కూల్ కమిటీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు లావణ్యను ఎన్నుకున్నట్లు పూర్తి స్థాయి మెజార్టీతో చేతులెత్తిన సభ్యులు

సాక్షి అమరావతి/ సాక్షి, నెట్‌వర్క్: పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్య కమిటీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ–ఎస్‌ఎంసీ) ఎన్నికలు పూర్తి ఏకపక్షంగా జరిగేలా అధికార టీడీపీ నేతలు యథేచ్ఛగా దౌర్జన్యకాండ సాగించారు. తాము చెప్పిన వారినే చైర్మన్ చేయాలని టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించినప్పటికీ, ఆ మేరకు అధికారికంగా ప్రకటించకుండా అడ్డుపడ్డారు. పోలీసుల కనుసన్నల్లోనే ఎన్నికలు జరిగినప్పటికీ టీడీపీ నేతల రౌడీయిజాన్ని వారు ఏమాత్రం అడ్డుకోలేకపోయారు. 24 జిల్లాల పరిధిలోని 40,781 పాఠశాలలకు గాను 40,150 (98.45%) పాఠశాలల్లో గురువారం టీడీపీ మూకల దౌర్జన్యం మధ్య ఎన్నికలు పూర్తయ్యాయి. 631 పాఠశాలల్లో వివిధ కారణాలతో వాయిదా పడ్డాయి. ఎన్నికలు నిర్వహించని పాఠశాలలకు రీ షెడ్యూల్ ప్రకటించినట్లు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఈ నెల 17న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

అడుగడుగునా దౌర్జన్యం

- వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం కమలకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యులందరూ చిట్టిబోయిన కవితను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత వడ్డమాను సుదర్శన్‌రావు, మరి కొంత మంది పాఠశాలకు వచ్చారు. మోపూరి పార్వతి అనే మహిళను చైర్మన్‌గా చేస్తున్నట్లు ప్రకటించారు. బ్రహ్మంగారి మఠం మండలంలో పలు పాఠశాలల్లో తల్లిదండ్రులతో సంబంధం లేకుండా టీడీపీ నేతలే చైర్మన్‌లను నియమించారు.
- శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం మలుగూరు ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరురాలు లావణ్య పూర్తి మెజార్టీతో గెలిచారు. అయినా ఆమె గెలుపును అధికారికంగా ప్రకటించకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. రెండవసారి ఎన్నిక జరపాలని పట్టుబట్టారు. దీంతో 30 మంది సభ్యుల్లో 22 మంది లావణ్యకు మద్దతు తెలిపారు. అయినా టీడీపీ నాయకులు హెచ్‌ఎంతో గొడవ పెట్టుకున్నారు. సమాచారం అందుకుని అక్కడకు వచ్చిన రూరల్ సీఐ కూడా టీడీపీ నాయకులకే మద్దతు తెలిపారు. దీంతో ఎన్నికను శుక్రవారం నాటికి వాయిదా వేశారు.
- ధర్మవరం రూరల్ మండలం రేగాటిపల్లి మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో టీడీపీ వర్గీయులు మాత్రమే పాఠశాలలోకి ప్రవేశించి, ఇతరులెవ్వరూ లోపలకు రాకుండా అడ్డుకున్నారు. పలువురు పాఠశాల బయట గొడవ చేయగా, ఎన్నికను వాయిదా వేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంతూరు తోపుదుర్తి గ్రామంలో డీఎస్పీ శివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన తల్లిదండ్రులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి పంపకుండా అడ్డుకున్నారు. టీడీపీ మద్దతుదారులను సభ్యులుగా ఎన్నుకున్న తర్వాత వీరిని లోపలికి అనుమతించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం పెద్ద దళితవాడ మండల పరిషత్ పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గెలుపొందినా, టీడీపీ నేతల హెచ్చరికలతో టీడీపీ మద్దతుదారు గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కోటి కేశవరం ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గుడాల వసంతకుమార్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే ఎస్‌ఐ ఆనందకుమార్ జోక్యం వల్ల టీడీపీ మద్దతుదారు పి.అచ్చియ్యమ్మ ఒక్క ఓటు మెజార్టీతో గెలిచినట్టు అధికారులు ప్రకటించారు.
- తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో.. కమిటీలో లేని వారిని ఎలా అభ్యర్థిగా నియమిస్తారని వైఎస్సార్‌సీపీ నేతలు నిలదీయడంతో టీడీపీ నేతలు గొడవకు దిగారు. ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది.
- సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో ముందుగానే తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లను ఇచ్చి ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించారు. దీంతో పోటీలో నిలబడాలనే ఆశతో వచ్చిన పలువురు తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలంలోని గంగమాంబపురం జెడ్పీ హైస్కూల్‌లో టీడీపీ మద్దతుదారును ఏకపక్షంగా ఎంపిక చేశారు.
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన బూసి ఏసుమరియమ్మ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో టీడీపీ నేతలు జోక్యం చేసుకుని, వారి మద్దతుదారులు ఎన్నికైనట్లు ప్రకటించారు.
- విశాఖ జిల్లా చంద్రంపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అనుచరులు ప్రధానోపాధ్యాయుడి ఛాంబర్‌లో తిష్టవేసి మొత్తం వ్యవహారం వారికి అనుకూలంగా నడిపించారు.
- శ్రీకాకుళం జిల్లా జలుమూరు బాలికల ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీకి చెందిన కింజరాపు పద్మ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీన్ని సహించలేని స్థానిక టీడీపీ నేత మునుకోటి దామోదరరావు.. పోలీసులు తమకు సహకరించలేదని పోలీసు స్టేషన్‌పై దాడికి యత్నించారు.

టీడీపీ నేతల వేధింపులు.. యానిమేటర్ ఆత్మహత్యాయత్నం

- నెయిల్‌పాలిష్ తాగిన సుగుణ
- పరిస్థితి విషమం.. హిందూపురం ఆస్పత్రికి తరలింపు
- భర్త దివ్యాంగుడు కావడంతో ఆమె జీతమే ఆధారం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుగుణ

చిలమత్తూరు: టీడీపీ నేతలు చిరుద్యోగులనూ వదలడం లేదు. వారి దాష్టీకానికి ఓ యానిమేటర్ ఆత్మహత్యాయత్నం చేసుకొంది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం చేనేపల్లి గ్రామంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దివ్యాంగుడు నాగరాజు 18 ఏళ్లుగా యానిమేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు ఆ అవకాశం కల్పించడంతో దివ్యాంగుడైన నాగరాజు పరిస్థితిని అర్థం చేసుకుని ఆయన భార్య సుగుణకు అవకాశం కల్పించారు. ఇటీవల కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి సుగుణను తొలగించి, ఆ ఉద్యోగం మరొకరికి ఇవ్వాలని టీడీపీ నాయకులు నందీశప్ప, జయప్ప వెలుగు సిబ్బంది ద్వారా ఒత్తిడి తెచ్చారు. సంఘాల పుస్తకాలనూ తీసేసుకున్నారు. దీంతో జీవనం ఎలా సాగించాలని నాగరాజు, సుగుణమ్మ దంపతులు కొద్ది రోజులుగా తీవ్రంగా మథనపడుతున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడి మరింత పెరగడంతో మనస్తాపానికి గురైన సుగుణ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నెయిల్‌పాలిష్ తాగింది. టీడీపీ నేతల వేధింపులపై ఓ సెల్ఫీ వీడియో కూడా తీసుకుంది. అపస్మారక స్థితిలో ఉన్న సుగుణను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చిలమత్తూరు పీహెచ్‌సీకి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యాధికారి రామకృష్ణ సూచన మేరకు ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

టీడీపీ నాయకుల కుట్రే

నేను 18 ఏళ్ల యానిమేటర్‌గా పనిచేశాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నా స్థితి చూసి నా భార్యకు ఉద్యోగం ఇచ్చింది. ఆమె జీతమే మా కుటుంబానికి ఆధారం. టీడీపీ నాయకులు నందీశప్ప, జయప్ప నా భార్యను ఉద్యోగంలోంచి తొలగించేందుకు కుట్ర పన్నారు. సీసీ ఆదినారాయణరెడ్డి ద్వారా సంఘాల పుస్తకాలను లాక్కున్నారు. దీంతో ఎలా బతకాలని ఆలోచిస్తూ సుగుణ ఆత్మహత్యాయత్నం చేసింది. మాలాంటి నిస్సహాయులపై ఎందుకు అంత కక్ష?

– సుగుణమ్మ భర్త నాగరాజు

టీడీపీ నేతలు చెప్పినందుకే పుస్తకాలు వెనక్కి తీసుకున్నాం

సుగుణమ్మను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నామని, పుస్తకాలు వెనక్కి తీసుకోవాలని టీడీపీ నేత నందీశప్ప ఒత్తిడి తెచ్చారు. తీసుకోకపోతే నన్ను కూడా ఉద్యోగం నుంచి తీసేస్తామని చెప్పడంతో పుస్తకాలను వెనక్కి తీసుకున్నాను. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించలేదని ఏపీఎం భారతి చెప్పారు.

– ఆదినారాయణరెడ్డి, సీసీ

లక్ష మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించండి

- కేంద్రానికి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి
- రేషన్ కార్డుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



సాక్షి, న్యూఢిల్లీ: రేషన్ కార్డుల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఉన్న జనాభా ప్రకారం కాకుండా.. 2001 జనాభా లెక్కల ప్రకారమే ఎన్‌ఎఫ్‌ఎస్ రేషన్ కార్డులు ఇవ్వడం వలన రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడిందన్నారు. రాష్ట్రానికి లక్ష మెట్రిక్ టన్నుల కందిపప్పును కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరామని తెలిపారు. గురువారం ఢిల్లీలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి, పెట్రోలియం సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీలను కలిశారు. ఈ ఇద్దరికీ పలు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. తమ శాఖకు పెండింగ్‌లో ఉన్న రూ. 1,187 కోట్లు త్వరగా ఇవ్వాలని ప్రహ్లాద్ జోషిని కోరినట్లు చెప్పారు.ధరల స్థిరీకరణకు రూ. 532 కోట్లు కేటాయించాలని అభ్యర్థించినట్లు చెప్పారు. ఏపీలోని 60 లక్షల దీపం కనెక్షన్లను పీఎంయూవై పథకం కిందకు వచ్చే విధంగా మార్పిడి చేయాలని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి విజ్ఞప్తి చేశామన్నారు. ఇంటింటికీ రేషన్ డెలివరీపై చర్చిస్తున్నామని, సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

టీడీపీ సర్కారుకు ప్రజాగ్రహం ఎదురయ్యే రోజు దగ్గర్లోనే ఉంది

ఏపీలో వాగ్నర్ గ్రూప్ తరహాలో హింసకు పాల్పడుతున్నారు.. ఈ గ్రూపు నాయకుడికి శిక్ష తప్పదు

- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో టోటల్ డిస్ట్రక్షన్ పార్టీ (టీడీపీ) ప్రభుత్వానికి ప్రజాగ్రహం ఎదురయ్యే రోజు దగ్గర్లోనే ఉందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి చెప్పారు. ఆర్థిక బిల్లుపై రాజ్యసభలో గురువారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో ఓ గ్రూపు వాగ్నర్ గ్రూప్ (రష్యాలో ప్రైవేటు మిలటరీ గ్రూపు) సంస్కృతిని అలవర్చుకున్నారని, ప్రజలపై కనీస జాలి లేకుండా హత్యలు, హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాగ్నర్ గ్రూపు అధినేతకు ఎదురైనట్లే ఈ బృందం నాయకుడికీ శిక్ష తప్పదని భావిస్తున్నానని తెలిపారు. 2014–2017 మధ్య విద్యుత్తు ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వం ఏపీ జెన్‌కోకు చెల్లించాల్సిన బకాయిలు ఇప్పటివరకు చెల్లించలేదని చెప్పారు. ప్రస్తుత ఏపీ సీఎం బకాయిలు వసూలు చేయడంకంటే తెలంగాణ సీఎంతో స్నేహం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని ఆరోపించారు. ఈ బకాయిలు రాకపోవడం వల్ల ఏపీ జెన్‌కో అప్పుల పాలైందని తెలిపారు. తెలంగాణ చెల్లించాల్సిన రూ.7,778 కోట్ల విద్యుత్ బకాయిలను కేంద్రం ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటా నుంచి మినహాయించి ఏపీకి ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2017–18 ధరల ప్రకారం రెండో సవరించిన అంచనా మొత్తం రూ.55,548.87 కోట్లకు జలశక్తి శాఖ సాంకేతిక సలహా కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. వీటినే ఆమోదించాలని కోరారు. ప్రాజెక్టును ఎలా పూర్తిచేస్తారో స్పష్టతివ్వాలని కోరారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో జిల్లాకో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం వల్ల కొత్త వైద్య కళాశాలల భారం రాష్ట్రంపైనే పడుతోందని తెలిపారు. కొత్త కళాశాలలకు సాయాన్ని పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

కృష్ణా ట్రిబ్యునల్ –2 గడువు పెంపు



కృష్ణా నదీ జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్–2 గడువును 2025 జూలై 31 వరకు పెంచినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌధరి తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు అవినాష్‌రెడ్డి ప్రశ్నకు గురువారం ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం

మొదటి పేజీ తరువాయి

విద్యుత్ సరఫరా నిలిపివేయించి, సిబ్బందిని బయటకు తరలించి.. తెలుగుదేశం మూకలు భీంరావ్ అంబేడ్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని సుత్తులు, ఇతర పరికరాలతో దాడికి తెగబడ్డాయి. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కొందరు అధికారులు, పోలీసుల సమక్షంలో ఈ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేసేందుకు బరితెగించారు. వీరి మాటలను బట్టిచూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతోనే ఎంపిక చేసిన కొందరు అధికారుల సమక్షంలో ఇదంతా జరిగినట్లు స్పష్టమవుతోంది. నిజానికి.. గత సీఎం వైఎస్ జగన్ దీనిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి రూ.404.35 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన చేతుల మీదుగా ఈ ఏడాది జనవరి 19న జాతికి అంకితం చేశారు. అధికారంలోకి వచ్చింది మొదలు ‘పచ్చ’మూకలు దీనిపై కన్నేశారు. ఇందులో భాగంగానే పై నుంచి వచ్చిన ఆదేశాలతో గురువారం రాత్రి 9 గంటల తర్వాత పచ్చబ్యాచ్ రంగప్రవేశం చేసింది. అక్కడున్న వారందరినీ బలవంతంగా బయటకు పంపేశారు. అందులో పనిచేసే కొందరి సిబ్బంది ఫోన్లను లాకున్నారు. మరికొందరి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపొమ్మని బెదిరించారు. ఈ తతంగానికి పోలీసులే కాపాలా కాశారు. విగ్రహం నలుమూలలా పహారా కాసి, చుట్టూ గేట్లు వేసి అనుకున్న పని మొదలుపెట్టారు. ఇంతలో ఈ సమాచారం బయటకు పొక్కింది. ప్రజలు, మీడియా, అంబేడ్కర్ ఆలోచనాపరులు రావడంతో పరారయ్యారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం నామఫలకంలో ధ్వంసమైన అక్షరాలు



పట్టించుకోని సీపీ..

ఈ విషయాన్ని సీపీకి తెలిపేందుకు మీడియా ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు. పచ్చ మూకల దాడిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గుర్తుగా అక్కడ ఏర్పాటుచేసిన బోర్డులో మాజీ సీఎం వైఎస్ జగన్ పేరుతో ఉన్న స్టీల్ మెటల్ అక్షరాలు ధ్వంసమయ్యాయి. వీటిని సుత్తులతో కొట్టి మరీ ధ్వంసం చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



గురువారం నెలమంగల వద్ద దాసనపురకు చేరిన 50 వసంతాల కన్నడ జ్యోతి రథ యాత్ర



బెంగళూరు హడ్సన్ కూడలిలో గంధభేరుండ ప్రతిమ ఏర్పాటు పనులు

న్యూస్‌రీల్

దర్శన్‌కు ఇంటి భోజనం లేనట్టే!

- జైలు అధికారుల విముఖత



భోజనం ఆరగిస్తున్న దర్శన్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పరప్పన అగ్రహార జైలులో ఉన్న హీరో దర్శన్ ఇంటి భోజనం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దర్శన్‌కు ఇంటి భోజనాన్ని అనుమతించలేమని, ఆ అవసరం కూడా లేదని జైలు అధికారులు కోర్టుకు తెలిపారు. ఇంటి భోజనం కోసం దర్శన్ హైకోర్టును ఆశ్రయించగా, మీ వైఖరి ఏమిటో చెప్పాలని జైలు అధికారులకు హైకోర్టు ఆదేశించింది. గత నెల రోజులుగా ఇంటి భోజనం కేసు సాగుతోంది. హత్య కేసులో నిందితుడికి ఇంటి భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించలేమని కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణ 20వ తేదీకి వాయిదా వేశారు.

ప్రజ్వల్ బెయిలు అర్జీపై వాదనలు

మహిళలపై లైంగిక దౌర్జన్యం కేసులో పరప్పన జైలులో ఉన్న జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ పిటిషన్ విచారణను కోర్టు ఆగస్టు 29కి వాయిదా వేసింది. బెయిలు ఇవ్వడంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 29లోపు పిటిషన్ వేసుకోవాలని పోలీసుల వకీలుకు ఆదేశించింది. ఈ కేసుల్లో రేవన్న తల్లిదండ్రులు, మరో కేసులో సోదరుడు సూరజ్‌కు గతంలనే బెయిలు వచ్చింది.

సీఎం, డీసీఎంలకు సమన్లు

గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఈడీ విచారణ చేయడాన్ని ఖండిస్తూ ధర్నాలో పాల్గొన్న 102 మందికి కోర్టు సమన్లు పంపించింది. వీరిలో సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ కూడా ఉన్నారు. ధర్నా చట్ట వ్యతిరేకమని నగర విల్సన్ గార్డెన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో బెంగళూరు 42వ ఏసీఎంఎం కోర్టు విచారణకు సంబంధించి సమన్స్ జారీ చేసింది.

దోమల వ్యాప్తి కారకులను శిక్షించాలి

- సర్కారుకు హైకోర్టు సూచన
- డెంగీ జ్వరాల బెడదపై ఆగ్రహం



శివాజీనగర: నగరంలో పాటుగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో డెంగీ జ్వరాల నియంత్రణకు మరిన్ని చర్యలు తీసుకోవాలని, దోమల ఉత్పత్తికి కారణమయ్యేవారికి జరిమానా విధించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, బీబీఎంపీకి హైకోర్టు సూచించింది. రాష్ట్రంలో ఈ సంవత్సరం డెంగీ జ్వర పీడితుల సంఖ్య 20 వేలకు చేరినట్లు మీడియాలో జోరుగా వార్తలు రావడంపై సుమోటోగా విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ అంజారియా.. జ్వర నివారణకు కఠిన సూచనలు చేశారు. అంతకు ముందుగా ప్రభుత్వం, బీబీఎంపీల న్యాయవాదులు.. డెంగీ జ్వరం కేసుల నియంత్రణ, సోకితుల చికిత్సకు చేపట్టిన చర్యలను వివరించారు. అయితే జ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని అనిపిస్తుంది, అందుచేత మరిన్ని నివారణ చర్యలు తీసుకోవాలని జడ్జి ఆదేశించారు. బెంగళూరులో దోమలు ఉత్పత్తి అయ్యే 51 హాట్ స్పాట్‌లను గుర్తించడమైనదని బీబీఎంపీ తరపు వకీలు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో హాట్ స్పాట్‌లు ఉండడానికి వీల్లేదు, దోమల ఉత్పత్తికి కారణమయ్యేవారిపై జరిమానా విధించడం, లేదా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ధర్మాసనం సలహానిచ్చింది. ఆపై కేసును ఆగస్టు 28కి వాయిదా వేశారు.



డెంగీ దోమల బెడదపై కోర్టు అసహనం




గురువారం పుష్ప ప్రదర్శనలో సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు



పూల రూపాలను తిలకిస్తున్న బాలలు

సుగంధాల పుష్ప సరాగం

- లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షో ఆరంభం
- పూల రూపాల కనువిందు



సీఎం సిద్ధు, మంత్రులు

బనశంకరి: స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా బెంగళూరు లాల్‌బాగ్‌లో లక్షలాది పుష్పాలతో మది దోచే ఫ్లవర్ షో ఆరంభమైంది. 216వ పుష్ప ప్రదర్శనను గురువారం సీఎం సిద్దరామయ్య ప్రారంభించారు. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర, పార్లమెంటు భవనం థీమ్ ఆధారంగా ఈసారి పుష్ప ప్రదర్శనను తీర్చిదిద్దారు. ఈ నెల 19వ తేదీ వరకు ఫ్లవర్ షో కొనసాగుతుంది.

సీఎం మాట్లాడుతూ భారత సమాజానికి అంబేడ్కర్ అందించిన సేవలు అపారమన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మనవడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్, మంత్రులు ఎస్ఎస్.మల్లికార్జున్, రామలింగారెడ్డి, జమీర్‌అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

రూ. 2.80 కోట్ల వ్యయం

ఫ్లవర్ షోలో 3.6 లక్షలు గులాబీలు, 2.4 లక్షలు చామంతులతో పార్లమెంటు థీమ్, గ్లాజ్ హౌస్ కుడి వైపున 3.4 లక్షల పూలతో అంబేడ్కర్ స్మారకాలను ఏర్పాటు చేశారు. ఈసారి రూ.2.80 కోట్లను వెచ్చించారు. గత ఏడాది ఫ్లవర్ షోకు రూ. 2 కోట్లు ఖర్చు చేశారు. సుందరమైన అనేక పూల రూపాలు కనువిందు చేస్తాయి. దివంగత సీఎం కెంగెల్ హనుమంతయ్య గురించి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భద్రత కోసం ఫ్లవర్ షో ఆవరణలో సుమారు 139 చోట్ల సీసీ కెమెరాలతో నిఘాపెట్టారు. 400 మందికి పైగా పోలీసులు, బీబీఎంపీ మార్షల్స్‌ను నియమించారు. తొలిరోజు ఓ మోస్తరుగా సందర్శకులు, బాలల సందడి కనిపించింది.

వాహనాల పార్కింగ్ ఇక్కడ

- మరిగౌడ రోడ్డు- అల్ అమీన్ కాలేజీ ఆవరణలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయాలి
- కేహెచ్ రోడ్డు- శాంతినగర బీఎంటీసీ బస్టాండు పైన కార్లు పార్కింగ్
- మరిగౌడ రోడ్డు- హాప్‌కామ్స్‌లో బైక్‌లు, కార్లు పార్కింగ్ చేయవచ్చు
- జేసీ రోడ్డు- కార్పొరేషన్ పార్కింగ్ స్థలంలోనూ బైక్‌లు, కార్లు తదితరాలకు పార్కింగ్ వసతి.



పుష్పాలలో ఒదిగిన త్రివర్ణ భారతం, చిత్రం ముందు ఫోటోకు యువతి పోజు

యథేచ్ఛగా కాల్ డేటా సేకరణ

- డిటెక్టివ్ కంపెనీ దందా
- నిందితుల్లో సీఐడీ పోలీస్



బనశంకరి: నగరంలో ప్రైవేటు డిటెక్టిక్ ఏజెన్సీల పేరుతో ప్రజల మొబైల్‌ఫోన్ కాల్ డేటా సేకరించడం, వారి కాల్స్‌ను రహస్యంగా వింటున్న ఉదంతాలు జరుగుతున్నాయి.

ఇలాంటి కేసులో సీఐడీ పోలీస్ సిబ్బంది మునిరత్న, మరో వ్యక్తి నాగేశ్వరరెడ్డిని అరెస్టు చేశారు. మేలో మహానగర డిటెక్టివ్, సెక్యూరిటీ ప్రై.లి. సిబ్బంది అక్రమంగా కాల్ డేటా పొందారని మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు విచారించి పురుషోత్తం, సతీశ్‌కుమార్, తిప్పేస్వామి, మహంతగౌడ, రేవంత, గురుపాదస్వామి, శ్రీనివాస, భరత్ అనేవారిని అరెస్ట్‌చేశారు. నాగేశ్వరరెడ్డికి కాల్ డేటా అందిస్తున్నారని సీఐడీ పోలీస్ మునిరత్నను కూడా అరెస్ట్‌చేశారు.

ఉద్యోగం దుర్వినియోగం

మునిరత్న గత కొన్నేళ్లుగా సీఐడీ టెక్నికల్ సెల్‌లో పని చేస్తున్నాడు. టెలికాం కంపెనీలకు ఉన్నతాధికారులు సీడీఆర్ కావాలని లేఖలు పంపేవారు. అందులో మునిరత్న తనకు కావలసిన నంబర్లను కూడా చేర్చి కాల్ డేటా తీసుకుని నాగేశ్వరరెడ్డికి ఇచ్చేవాడు, ఇందుకు డబ్బు ముట్టేది. ఎక్కువగా భార్యాభర్తలు, ప్రేమ జంటలు తమ భాగస్వాములు ఎవరితో ఎక్కువగా మాట్లాడుతున్నారో తెలుసుకునేందుకు కాల్ డేటా అడిగేవారు. పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు కూడా తమ ప్రత్యర్థుల సీడీఆర్ తీసుకుంటున్నట్లు అనుమానం వ్యక్తమైంది. కొందరు పోలీస్ అధికారులు తమ భార్యల ఫోన్ కాల్స్ వివరాలు తీసుకుంటున్నట్లు తెలిసింది. మామూలుగా కాల్ డేటా పొందడం చట్ట విరుద్ధం. కేసు విచారణలో ఉంది.

సీఎంపై ప్రైవేటు కేసు దాఖలు

శివాజీనగర: ముడా ఇళ్ల స్థలాలకు సంబంధించి సీఎం సిద్ధరామయ్యపై ప్రజా ప్రతినిధుల కోర్టులో మైసూరుకు చెందిన ఆర్‌టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. అక్రమాలపై ఆధారాలు అని పలు పత్రాలను జడ్జి గజానన భట్‌కు అప్పగించారు. త్వరలో విచారణకు వచ్చే అవకాశముంది. కృష్ణ తరపున హైకోర్టు న్యాయవాది లక్ష్మీ అయ్యంగార్ గురువారం మధ్యాహ్నం ఈ ప్రైవేట్ కేసును వేశారు.

వక్ఫ్ చట్ట సవరణ తగదు

- కేంద్ర సర్కారుపై సీఎం సిద్ధు ధ్వజం

శివాజీనగర: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అల్పసంఖ్యాకులకు వ్యతిరేకం. కాబట్టే వక్ఫ్ చట్టానికి సవరణ చేస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎస్.నిజలింగప్ప వర్ధంతి సందర్భంగా గురువారం విధానసౌధ ఆవరణలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. విలేకరులతో మాట్లాడిన సీఎం.. మైనారిటీలకు వ్యతిరేకంగా వక్ఫ్ చట్టం తెస్తున్నారని కేంద్రంపై మండిపడ్డారు. బీజేపీ మతతత్వ పార్టీ అని అన్నారు. తాము ఆ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

బద్ధవైరితో భేటీ గురించి..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బీ.కే.హరిప్రసాద్‌ను తాను భేటీ చేయడంలో ప్రత్యేకత ఏమీ లేదు. చాలా రోజుల నుండి హరిప్రసాద్‌ను కలవలేదు. అందుకే సమావేశమై క్షేమ సమాచారాలు మాట్లాడుకున్నట్లు సిద్దరామయ్య చెప్పారు. తనకు మంత్రి పదవి ఇవ్వలేదని హరిప్రసాద్ సీఎంపై గతంలో తీవ్ర ఆరోపణలు చేయడం తెలిసిందే. కాగా, శుక్రవారం మైసూరులో జరిగే సమావేశంలో బీజేపీ అబద్ధాల ఆరోపణలకు తగిన సమాధానం చెబుతామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎస్.నిజలింగప్ప రాష్ట్ర అభివృద్ధికి పునాది వేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర చాలా ప్రాముఖ్యమైనదని సీఎం తెలిపారు.

బెంగళూరు.. మెట్రో సిటీ కాదు



- ఆ హోదా ఇవ్వలేం: కేంద్రం
- మరోసారి మొండిచేయి

సాక్షి, బెంగళూరు: దేశంలో ఐటీ రాజధాని, ఉద్యాన నగరిగా పేరు గాంచిన బెంగళూరు నగరానికి మెట్రో హోదా దక్కలేదు. బెంగళూరుకు మెట్రో స్థానం ఇవ్వలేదని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా బెంగళూరుకు మెట్రో నగర హోదా ఇవ్వాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. కానీ ప్రతిసారీ నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుత లోకసభ సమావేశాల్లో ఆర్థిక శాఖ స్వతంత్ర మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ 1962 ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 2ఏ ప్రకారం మెట్రో నగరాలకు, ఇతర నగరాలకు వ్యత్యాసం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల్లో ఎలాంటి మార్పు చేయలేదని తెలిపారు. ఆ నిబంధనలకు అనుగుణంగా బెంగళూరుకు మెట్రో నగర హోదా కల్పించలేదని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై మాత్రమే మెట్రో నగర హోదాను కలిగి ఉన్నాయి.

ఏమిటీ ప్రయోజనం?

మెట్రో హోదా వల్ల ఉపయోగం ఏమిటమంటే.. ఈ నగరాల్లో నివసించే ప్రజలకు కొన్ని పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇంటి అద్దె భత్యానికి ఐటీ నుంచి మినహాయింపు ఉంటుంది. మెట్రో నగరాల్లో ఆదాయ పన్ను దాఖలు సమయంలో 50 శాతం జీతాన్ని మాత్రమే పరిగణిస్తారు.

మైసూరులో అవయవదానం

మైసూరు: చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా బేగూరు ఫిర్కా హొసపుర గ్రామానికి చెందిన సిద్ధప్ప (58) అనే వ్యక్తి ఐదు రోజుల క్రితం హిరికాటి గేట్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స ఫలించక బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. దీంతో వైద్యుల వినతి మేరకు కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. సిద్ధప్ప దేహం నుంచి ముఖ్యమైన అవయవాలను సేకరించి అవసరమైన రోగుల కోసం పంపించారు.

కుండపోత వర్షం..
లోతట్టు జలమయం



గురువారం రాయచూరులో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

హొసపేటె: నగరంతో పాటు తాలూకా వ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పొలాలు, చెరువుల్లోకి నీరు చేరింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోని పాఠశాలల ఆవరణలో నీరు నిలిచింది. ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు నిలవడంతో విద్యార్థులకు సమస్యగా మారింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు రోడ్డు దాటాలంటే ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పట్టణంలోని కొన్ని వార్డుల్లో డ్రైనేజీలు నిండి రోడ్డుపైకి మురుగు నీరు ప్రవహించింది.

రాయచూరులో..

రాయచూరు రూరల్: నగరంలో గత మూడు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం గోశాల రహదారిలో వర్షపు నీరు ప్రవహించింది. ఎక్కడ చూసినా రోడ్లు బురద గుంటలుగా మారాయి. ఆర్టీఓ సర్కిల్, గంజ్ సర్కిల్, మున్నూరు వాడి, గాంధీ చౌక్, మహావీర చౌక్, కూరగాయల మార్కెట్‌లోకి వర్షపు నీరు చొరబడ్డాయి.

జిల్లాలో ఈసారి ముంగారు వర్షాలు సకాలంలో కురియడంతో తొలిదశలో రైతులకు విజయాన్ని అందించిందన్నారు. రైతులు తొలిసారిగా ఎక్కువ విస్తీర్ణంలో పేరుకు పంటను విత్తారు. అదే విధంగా ఈ వానాకాలంలో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశారు. అయితే మూడు, నాలుగు వారాలుగా వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోవడంతో పాటు చీడపీడల బారిన పడి రైతులు ఆందోళనకు గురయ్యారు. విజయనగర వ్యవసాయ విస్తరణ విద్యా కేంద్రంలో పాటు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.



హొసపేటెలో పాఠశాల ఆవరణలో చేరిన వాన నీరు

బలప్రదర్శనకు రాచనగరి సిద్ధం



గురువారం మండ్య జిల్లా తూబిగెరె వద్ద బీజేపీ, జేడీఎస్ పాదయాత్ర



కళాకారుల నృత్య సంబ్రమం

- నేడు కాంగ్రెస్ జనాందోళన సభ
- రేపు బీజేపీ పాదయాత్ర ముగింపు సభ

మైసూరు: సీఎం సిద్ధరామయ్య మైసూరులో ముడా నుంచి 14 స్థలాలను పొందిన వివాదంలో అనుకూలంగా, వ్యతిరేక ప్రదర్శనకు ఆయన సొంత జిల్లా కేంద్రం మైసూరు సిద్ధమైంది. సిద్ధరామయ్యకు మద్దతుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మైసూరులో జనాందోళన సభ ద్వారా సత్తా చాటేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. మరో వైపు సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలని , కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని జేడీఎస్‌తో కలిసి బీజేపీ కెంగేరి నుంచి మైసూరు వరకు అట్టహాసంగా చేపట్టిన చలో మైసూరు పాదయాత్ర ముగింపు సమావేశం శనివారం మైసూరులో జరగనుంది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల బలప్రదర్శనకు మైసూరు ముస్తాబవుతోంది. రెండు సభలకు కేంద్ర నాయకులు రాబోతున్నందున విజయవంతానికి పాటుపడుతున్నారు.

మండ్యకు చేరిన పాదయాత్ర

బీజేపీ, జేడీఎస్ ఉభయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా చలో మైసూరు పాదయాత్రను కొనసాగిస్తున్నారు. యాత్ర పొడవునా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. పాదయాత్ర గురువారం మండ్య జిల్లా తూబినకెరెకు చేరుకుంది. విజయేంద్ర, హెచ్‌డీ నిఖిల్ సహా పెద్దసంఖ్యలో నేతలు జెండాలు చేపట్టి కదిలారు. కళాకారుల ప్రదర్శనలు అలరించాయి.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా


వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

రాయచూరు రూరల్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. జిల్లాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 1,88,532 మంది ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారని, 2016 సంవత్సరానికి ముందు విధుల్లో చేరిన వారికి పదోన్నతి కల్పించాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అనంతరం డిమాండ్లపై కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

కార్మికుల కష్టాలు పరిష్కరించండి


మాట్లాడుతున్న అయ్యణ్ణ మహామని

రాయచూరు రూరల్: రాయచూరు థర్మల్ విద్యుత్ ఉత్పాదన కేంద్రంలో కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు అయ్యణ్ణ మహామని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేతనాలు పెంచాలని కోరితే విధులనుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలు పట్టని అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు.

నోటు పుస్తకాల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్ : జిల్లా కేంద్రంలోని హిందీ వర్ధమాన్ పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్, రోటరీ జనసేవ ప్రతిష్టాన ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందించారు. దాతల సహకారాన్ని వినియోగించుకొని కష్టపడి చదవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రభనగౌడ విద్యార్థులకు సూచించారు. రోటరీ క్లబ్ సభ్యులు హనుమంతు, వెంకటేష్, శివరాజ, తిమ్మగురు, ప్రసాద్, అశోక్, ఈరణ్ణ, లక్ష్మణ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు


తేజ(ఫైల్)

రాయచూరు రూరల్: ఈతకు వెళ్లిన యువకుడు గల్లంతైన ఘటన లింగసూగురు తాలూకాలో చోటుచేసుకుంది. బెండోణకు చెందిన తేజ(24)మంగళవారం నారాయణపుర ప్రధాన కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. అయితే నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లతో వెళ్లి గాలింపు చేపట్టారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ దత్తాత్రేయ పరిశీలించారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

హుబ్లీ: ధార్వాడలోని ఎస్‌డీఎం వైద్య కళాశాల చర్మరోగ చికిత్స విభాగం ఆధ్వర్యంలో కేంద్ర కారాగృహం ఖైదీలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 180 మందికి పైగా ఖైదీలకు చర్మ రోగం పట్ల అవగాహన కల్పించి అవసరమైన వారికి ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు. జైలు సూపరింటెండెంట్ పీ.మహదేవ నాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కే.షహబుద్దీన్, ముఖ్య వైద్యాధికారి డాక్టర్.ఎస్ఎస్.వణకేరి, చర్మరోగ నిపుణులు డాక్టర్.గౌరి బెల్లద, డాక్టర్ నవీన్ కేఎస్, డాక్టర్.శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన పవిత్రోత్సవాలు


పూజల్లో పాల్గొన్న రాజేంద్రరెడ్డి దంపతులు

రాయచూరు రూరల్ : జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ఆవరణలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రెండో రోజు పవిత్రోత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, పరిమళ ఆరాధన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం తదితర పూజలు నిర్వహించారు. నారాయణ పేట మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర రెడ్డి దంపతులు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

జాడ లేని గృహలక్ష్మి, యువనిధి

- కాంగ్రెస్ సర్కార్ నగదు గ్యారెంటీలకు తప్పని ఎదురు చూపులు
- మూడు నెలలుగా మహిళల ఖాతాలకు జమ కాని నగదు



గృహలక్ష్మి పథకం లోగో



యువనిధి పథకం లోగో

సాక్షి బళ్లారి: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన భూమిక పోషించిన ఐదు గ్యారెంటీలు ఆరంభ శూరత్వమేనా? అమలు చేసిన సంక్షేమ పథకాలను లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారా? సంక్షేమ పథకాల ద్వారా అధికారం చేజిక్కించుకొన్న కాంగ్రెస్ పార్టీ పాలకులు వాటిని గాలికి వదిలేస్తున్నారా? అనే ప్రశ్నలకు ఔను అనే సమాధానం వినిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 ఆగస్టు 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళా లబ్ధిదారులకు ప్రతి నెల రూ.2 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసింది. దాదాపు 9 నెలల పాటు గృహలక్ష్మి పథకం కింద మహిళల ఖాతాల్లోకి ప్రతి నెల క్రమం తప్పకుండా మహిళలకు నగదు అందజేయడంతో గృహలక్ష్మి పథకంపై మహిళలు ఎంతో ఆశతో నెలనెలా నగదు వస్తుందని వివిధ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. అయితే గత మూడు నెలల నుంచి గృహలక్ష్మి పథకం కింద మహిళల ఖాతాల్లోకి నగదు జమ కాకపోవడంతో మహిళలు నగదు కోసం ఎదురుచూస్తున్నారు.

ఇదిగో ఇస్తాం, అదిగో జమ చేస్తాం అంటున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

సంబంధిత మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వివిధ జిల్లాల పర్యటనల నేపథ్యంలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు అదిగో నగదు జమ చేస్తాం, ఇదిగో నగదు ఇస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ మహిళల ఖాతాల్లోకి నగదు మాత్రం జమ కావడం లేదు. సాంకేతిక కారణాల నెపం చూపి, నిధులు కొరత లేదనే మాటను చెప్పకపోవడం గమనార్హం. గృహలక్ష్మి కోసం మహిళలు ఎదురు చూస్తుండగా యువనిధి కూడా యువతకు సక్రమంగా చేరడం లేదు. డిగ్రీ పూర్తి చేసిన వారికి ఉద్యోగం రాకపోతే రూ.3 వేల నగదు జమ చేస్తామని హామీ ఇచ్చారే కానీ గత ఏడాది నుంచి ఇంజినీరింగ్, బీఏ, ఎంఏ, వివిధ డిగ్రీలు పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు యువనిధి ద్వారా నగదు ఇవ్వడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యువనిధి, గృహలక్ష్మి రెండు పథకాల ద్వారా లబ్ధిదారులకు నెల నెల నగదు జమ కాకపోవడం, ఐదు గ్యారెంటీల్లో మరొక సంక్షేమ పథకం అయిన రేషన్ కార్డులున్న వారికి ఐదు కేజీల ఉచిత బియ్యానికి బదులుగా సంబంధిత నగదు కూడా జమ కావడం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఐదు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు అంతంత మాత్రంగానే ప్రయోజనం చేకూరుతోంది.

సర్వత్రా వెల్లువెత్తుతున్న విమర్శలు

ఈనేపథ్యంలో సంక్షేమ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన పాలకులు ఓట్లు వేసిన ఓటర్లను మోసం చేస్తూ లబ్ధిదారులకు నెల నెలా వారు ప్రకటించిన పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన తీరును గమనించిన పొరుగు రాష్ట్రాల్లో కూడా గ్యారెంటీల పేరుతో అధికారంలోకి రావడం తెలిసిందే. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే ఫార్ములాతో గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల ద్వారా తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల ద్వారా అధికారంలోకి వచ్చింది. అక్కడ కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు పాలకులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లో సంక్షేమ పథకాల ఆశతో ఓట్లు వేసిన జనం వాటిని అమలు చేయకపోవడంతో పాలకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో 9 నెలల పాటు గృహలక్ష్మి పథకం అష్టకష్టాలతో అమలు చేసి ప్రస్తుతం సాంకేతిక కారణాలతో కాలయాపనం చేస్తుండటంతో గృహలక్ష్మి, యువనిధి, 5 కేజీల రేషన్ బియ్యం నగదు కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

కలుషిత నీటి సరఫరా కలకలం


కొళాయి నుంచి నురుగతో వస్తున్న నీరు


డ్రమ్ములో పట్టిన నీరు ఒండుగా కనిపిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకా హట్టిలో పట్టణ పంచాయతీ అధికారులు కొళాయిల్లో కలుషిత నీటిని సరఫరా చేశారు. గురువారం వివిధ ప్రాంతాల్లో కృష్ణా నది నుంచి కొళాయిల ద్వారా సరఫరా అయిన తాగు నీరు మురికిగా, కలుషితంగా సరఫరా అయ్యాయి. నురుగతో కూడిన నీటిని పంపింగ్ చేయడంతో ప్రజలు గత్యంతరం లేక వాటినే పట్టుకున్నారు. నేరుగా నది నుంచి సరఫరా అయిన నీటిని శుద్ధీకరించకుండా వదలడంతో ఒండు రావడం కనిపించింది, ప్రజలు అధికారుల పనితీరు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు.

చికిత్స పొందుతూ మరొకరి మృతి


మృతురాలు మల్లమ్మ(ఫైల్)

రాయచూరు రూరల్: ఇటీవల భోజనం వికటించి నలుగురు దుర్మరణం పాలైన ఘటనలో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మల్లమ్మ(18) బుధవారం సాయంత్రం మరణించింది. జిల్లాలోని సిరవార తాలూకా కల్లూరులో ఒకే కుటుంబానికి చెందిన భీమన్న(60), అతని భార్య ఈరమ్మ(54), కొడుకు మల్లేష్(19), కూతురు పార్వతి(17) గురువారం రాత్రి మరణించారు. రాయచూరు ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ఆస్పత్రిలో చేరిన కోమాలోకి వెళ్లిన మల్లమ్మ చికిత్స పొందుతూ మరణించింది.

పర్యాటక శాఖ స్కాంలో 19 మంది అరెస్ట్

హుబ్లీ: బాగలకోటె జిల్లా పర్యాటక శాఖలో జరిగిన నిధుల దుర్వినియోగం కుంభకోణానికి సంబంధించి అక్కడి పోలీసులు బుధవారం తిరిగి నలుగురిని అరెస్ట్ చేశారు. దీంతో అరెస్ట్ అయిన వారి సంఖ్య 19కి చేరుకుంది. బాగలకోటలోని మల్లప్ప నగర, రవి నగర, ఇలకల్‌కు చెందిన హర్షద్ దోతిహాళ, అమీనా దోతిహాళ అరెస్టయిన నిందితులు. వీరి బ్యాంక్ ఖాతాలకు స్కామ్ సూత్రధారి సురత్‌నగర ప్రభుత్వ నిధులను అక్రమంగా బదలాయించాడు. ఐడీబీఐ బ్యాంక్ కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన సురజ్ పర్యాటక అభివృద్ధి కమిటీ ఖాతా, అలాగే 5 ప్రభుత్వ శాఖల ఖాతాల్లో ఉన్న సుమారు రూ.6 కోట్ల నిధులను అక్రమంగా బదిలీ చేశాడన్న ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


నాగదేవతలకు పాలు పోస్తున్న నగరవాసులు

హొసపేటె: నాగుల చవితిని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రజలు కుటుంబ సమేతంగా నాగుల కట్టను సందర్శించి పూజలు చేశారు. దీంతో నాగుల కట్టల వద్ద సందడి నెలకొంది. నాగుల చవితి రోజున నాగ దేవతను ఆరాధించి పూజలు చేస్తే ఆయురారోగ్యాలు లభిస్తాయని, కుటుంబ సభ్యులు సుఖ, సౌఖ్యాలతో సంతోషంగా ఉంటారని భక్తుల నమ్మకం.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

హుబ్లీ: నగరంలోని సుళ్ళ రోడ్డు మనో పార్క్ దగ్గర నిర్మాణ దశలోని కట్టడం పైనుంచి అళగవాడి నివాసి ప్రకాష్ సొదత్తి (49) అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. ప్రకాష్ పని చేస్తుండగా ఆ కట్టడం పై నుంచి కింద పడి గాయపడ్డాడు. అతడిని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సరైన సురక్షత చర్యలు తీసుకోకుండా పనిలోకి చేర్చుకొని కార్మికుడి మృతికి కారణకులయ్యారని నలుగురిపై కేశ్వాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసు శాఖ పని తీరు భేష్

- మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర


ప్రారంభిస్తున్న హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర

హొసపేటె: విజయనగర జిల్లా నూతన పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయం, డీఏఆర్ యూనిట్ పరిపాలన భవనం, పరేడ్ గ్రౌండ్ల నిర్మాణంతో పాటు అద్భుతంగా పని చేస్తోందని హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర అన్నారు. ఆయన 2021–22వ సంవత్సరానికి గాను స్పెషల్ గ్రాంట్ కింద నగరానికి మంజూరైన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్ కార్యాలయ నూతన భవనాన్ని నగరంలోని డీఏఆర్ బిల్డింగ్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో ప్రారంభించి మాట్లాడారు. ఏదేమైనా కొత్త జిల్లా ఏర్పాటయ్యాక జిల్లా సమగ్రాభివృద్ధికి కొంత సమయం పడుతుందన్నారు. అయితే 22 నెలల్లో విజయనగర జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు జరగడం శుభ పరిణామం అన్నారు. ఈ దిశగా స్థానిక ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప కృషి, నిబద్ధత అభినందనీయమన్నారు. కొత్త జిల్లాగా ఏర్పడిన కొన్నేళ్లలోనే విజయనగర జిల్లాలో అన్ని వసతులతో కూడిన విశాలమైన ప్రాంగణంలో జిల్లా పోలీసు శాఖ భవనం నిర్మించడం హర్షణీయం అన్నారు. ఈ దిశగా జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు పనితీరు ప్రశంసనీయం. కర్ణాటక పోలీస్ శాఖ దేశంలోనే అత్యుత్తమంగా నిలిచింది. రాష్ట్రంలోని పోలీసు అధికారులు, సిబ్బంది పని తీరు బాగుందన్నారు. ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప మాట్లాడుతూ డాక్టర్ పరమేశ్వర హోం మంత్రి అయిన తర్వాత అందించిన సహకారం వల్లే విజయనగర జిల్లా పోలీసు శాఖలో గత ఏడాది కాలంలో ఎన్నో ఆవిష్కరణలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే లతా మల్లికార్జున, ఐజీ లోకేష్‌కుమార్, జిల్లాధికారి దివాకర్, ఎస్పీ హరిబాబు, జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహమ్మద్ అక్రమ్, హుడా అధ్యక్షుడు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరుడి అరెస్ట్ .. 9 వాహనాలు స్వాధీనం


పట్టుకున్న ద్విచక్ర వాహనాలతో పోలీసులు

బళ్లారిఅర్బన్: నగరంలోని బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ బైక్‌ల చోరీల కేసులో ఓ నిందితుడి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. ఎస్పీ డాక్టర్ శోభారాణి, ఏఎస్పీలు కేపీ రవికుమార్, నవీన్‌కుమార్‌ల మార్గదర్శకత్వంలో నగర డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి నేతృత్వంలో బ్రూస్‌పేట్ సీఐ సింధూర్ సారథ్యంలోని ఓ బృందం ఈ చోరీ కేసును ఛేదించింది. గురువారం తెల్లవారు జామున 5.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తి పోలీసుల తనిఖీని చూసి తప్పించుకొని మోటార్ సైకిల్‌పై పరారవుతుండగా అతడిని వెంటాడి పట్టుకొని విచారించారు. గత 12 రోజుల క్రితం బుడా కార్యాలయం ఆవరణంలో బైక్ చోరీ చేసినట్లుగా ఒప్పుకున్నాడు. కాగా నిందితుడు 8 స్కూటర్లు, బైక్‌లను బళ్లారి జిల్లాలోను, అలాగే విజయనగర జిల్లాలో 9 నెలల క్రితం చోరీ చేసిన ఓ బైక్‌ను జప్తు చేశారు. వీటి విలువ మొత్తం సుమారు రూ.3 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. సీఐ సింధూర్, ఎస్ఐ ఎస్‌జే.షహనాజ్, మల్లికార్జున, హెడ్‌కానిస్టేబుల్ ఈ.శ్రీనివాస్, ఉమేష్‌రెడ్డి, మహబూబ్, కానిస్టేబుల్ శివకుమార్, రామాంజిని, దొడ్డబసన్నగౌడ ఈ కేసులో ప్రతిభ చూపినందుకు ఎస్పీ అభినందించారు.

దళితుల ఆశాజ్యోతి అంబేడ్కర్



భీమవాద డీఎస్ఎస్ రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్ : దళితుల పాలిట అంబేడ్కర్ ఆశాజ్యోతి అయ్యారని భీమావాద దళిత సంఘర్షణ సమితి(డీఎస్ఎస్) రాష్ట్ర సంచాలకుడు యుమునప్ప గుణదాళ అన్నారు. గురువారం ఉదయం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో భీమవాద డీఎస్ఎస్ రాష్ట్ర సంచాలకుడు బి.ఎన్.వెంకటేశ్ నేతృత్వంలో జిల్లా సమితి ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంబేడ్కర్ పుట్టకపోయి ఉంటే రాజ్యాంగాన్ని రచించకపోయి ఉంటే ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలు అగ్రవర్ణాల కుట్రలు, కుతంత్రాలకు, బానిసత్వానికి బలైపోయి ఉండేవారన్నారు. భారతదేశంలో మహిళలకు ఉన్నతస్థానం కల్పించింది రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా సంఘం సంచాలకురాలు ఈరమ్మ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులని తేడా లేకుండా అత్యాచారాలు, లైంగిక వేధింపులు తీవ్రమయ్యాయన్నారు. మహిళలు సంఘటితంగా పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సమితి రాష్ట్ర సంచాలకుడు జే.ఎస్.శ్రీనివాసులు అంబేడ్కర్ సేవలను కొనియాడారు. సమితి సంచాలకుడుగా గాదిలింగ, సమన్వయ సంచాలకులుగా ప్రసాద్, గిరీశ్, రాజ్, కోశాధికారిగా జయరాంను ఎన్నుకొన్నారు.

మొక్కజొన్నలో చీడపీడల నివారణకు సూచనలు

హొసపేటె: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో మొక్కజొన్నలో వివిధ రకాల తెగుళ్లపై విజయనగర వ్యవసాయ విస్తరణ విద్యా కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ, మునిరాబాద్ వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వచ్చి పంటను సర్వే నిర్వహించి రైతులకు కొన్ని సూచనలు చేశారు. ఇప్పుడు మొక్కజొన్నలో రసాన్ని పీల్చే క్రిములే కాకుండా కరివేపాకు, ఇతర పురుగులు, బూజు తెగులు కనిపించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో విజయనగర వ్యవసాయ విస్తరణ విద్యా కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు కొన్ని సూచనలు చేశారు. రైతులు ఎల్లప్పుడూ శాఖను, శాస్త్రవేత్తలను సంప్రదించి విత్తనాలను నాటాలన్నారు. తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. సముదాయ విధానంలో సస్యరక్షణ పనులు చేపట్టాలి. మొక్కజొన్నలో పురుగు ఉధృతికి రోగర్ అనే పురుగుమందు రెండు మిల్లీలీటర్లతో ప్రారంభ దశలో విత్తనశుద్ధి చేయాలి. మెటాలోక్సిలా శిలీంధ్ర నాశిని రెండున్నర స్ప్రేలు విత్తిన ఒక నెలలోపు చేయాలి. ఈ పిచికారీ చర్యలన్ని కమ్యూనిటీ పద్ధతిలో చేస్తే, తెగుళ్ల, వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని వ్యవసాయ శాస్త్ర నిపుణులు తెలిపారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించరూ


వినతిపత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

హొసపేటె: సర్వీస్ అనుభవం, ఉన్నత విద్యార్హతలు ఉన్న అర్హత కలిగిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల పోస్టులకు పదోన్నతి కల్పించాలని, ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం తీవ్రంగా తీసుకుని సత్వర న్యాయం చేయాలని, ఉపేక్షిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిరసన తెలుపుతామని రాష్ట్ర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం తాలూకా విభాగం అధ్యక్షుడు కే.బసవరాజు హెచ్చరించారు. గురువారం ఉపాధ్యాయులు జిల్లాధికారి కార్యాలయానికి వెళ్లి జిల్లాధికారి దివాకర్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మెరిట్ ఆధారంగా లబ్ధి పొందేందుకు వీధుల్లోకి వెళ్లి పోరాడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఆగస్టు 12న బెంగళూరులోని ఫ్రీడం పార్క్ వద్ద లాంఛనంగా దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి మల్లయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యార్హతలు, సర్వీస్ ఎక్సలెన్స్ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉపాధ్యాయులు సంఘం నేతలు కుబేర ఆచారి, సుధాదేవి, కడ్లి వీరభద్రేష్, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

వైద్యులపై కూలిన పీహెచ్‌సీ పైకప్పు

హుబ్లీ: ఎడతెగని వానల వల్ల శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) కొత్త కట్టడ నిర్మాణానికి విజ్ఞప్తి చేసినా మంజూరు కాక పోవడంతో అదే కట్టడంలో రోగులకు చికిత్స అందిస్తున్న హావేరి జిల్లాలో పీహెచ్‌సీ పైకప్పు చికిత్స అందిస్తున్న వైద్యులపైనే కూలి పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. హావేరి జిల్లా హిరేకెరూరు తాలూకా కోడా గ్రామ పరిధిలోని పీహెచ్‌సీ భారీ వర్షాలతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ కట్టడాన్ని మార్చి కొత్త కట్టడం నిర్మించాలని ఆరోగ్య శాఖకు విజ్ఞప్తి చేసినా పని ఏం జరగలేదు. ఈ క్రమంలోనే గురువారం సదరు కట్టడంలో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులపైనే పైకప్పు ఉన్న ఫళంగా కూలి పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రత్యేక షెడ్డును నిర్మించి అక్కడి రోగులకు చికిత్స అందించారు. కోడా పీహెచ్‌సీ సుమారు 25 గ్రామాల ప్రజలకు చికిత్స అందించే కేంద్రంగా ప్రసిద్ధి కెక్కింది. ప్రస్తుతం రెండు గదుల్లో రోగులకు చికిత్స ఔషధాలు, ఇతర పనుల్లో ఆరోగ్య శాఖ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ కట్టడాన్ని తక్షణమే మార్చి కొత్త కట్టడం నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

మొరార్జీ దేశాయి.. అధ్యాపకులు లేరోయి

- కుంటుపడుతున్న విద్యార్థుల చదువులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


మొరార్జీ దేశాయి రెసిడెన్షియల్ పాఠశాల కళాశాల భవనం

హొసపేటె: విజయనగర జిల్లా కొట్టూరు తాలూకా కందగల్లు గ్రామ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొరార్జీ దేశాయి రెసిడెన్షియల్ స్కూల్ అండ్ పీయూ విభాగంలో అధ్యాపకుల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రీ-గ్రాడ్యుయేషన్ దశలో కళాశాలలో అతిథి అధ్యాపకులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. విద్యార్థులకు ముందుగా కావాల్సింది నైపుణ్యం, ప్రతిభావంతులైన అధ్యాపకులు. కానీ నైపుణ్యం కలిగిన శాశ్వత అధ్యాపకులు లేనందున విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతోంది. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించే విద్యా సంస్థల్లో అధ్యాపకులు లేక చదువు కుంటుపడుతోంది. పేద గ్రామీణ విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలకు రావడంతో వారు బయట సొంతంగా చదువుకోలేక పోతున్నారు. ట్యూషన్ కోసం వెళ్లాలన్నా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పైగా గ్రామీణ ప్రాంతంలో ఏ అధ్యాపకుడు ట్యూషన్లు నిర్వహించే సాహసం చేయడం లేదు. దీని వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోంది. ఈ ప్రాంతం విద్యా పరంగా వెనుకబడి ఉండటానికి సమర్థులైన అధ్యాపకుల కొరత కూడా కారణం. పౌరుల జీవితాలను బాగు చేయాల్సిన సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలల్లోని అధ్యాపకుల కొరతను అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే ఈ వైపు దృష్టి సారించి అధ్యాపకుల కొరతను నివారించాలని వారు కోరుతున్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

హుబ్లీ: కార్మిక, బీడీ, సున్నపు రాయి, ఇనుము, సినీ కార్మికుల పిల్లల నుంచి ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 10వ తరగతి లోపు విద్యార్థులు ఈ నెల 31లోపు, పీయూసీ విద్యార్థులు అక్టోబర్ 1లోపు దరఖాస్తులు అందజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు హుబ్లీలోని కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జాతరకు ప్రత్యేక బస్సులు

హుబ్లీ: జిల్లాలోని నవలగుంద తాలూకా అమరగోళ గ్రామం శ్రీ నాగలింగ స్వామి రథోత్సవం, జాతర ఈ నెల 21న సాయంకాలం జరగనుంది. హుబ్లీ-ధార్వాడ, గదగ్, రోణ మార్గాల మీదుగా వచ్చే వారికి నవలగుంద నుంచి, బెళగావి, బాగలకోటె, విజయపుర మార్గాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సు వ్యవస్థను కల్పించినట్లు సంబంధిత అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఏపీఎంసీ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తాం


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప తదితరులు

హొసపేటె: నగరంలోని ఏపీఎంసీ ప్రధాన మార్కెట్ ఆవరణలో ఆర్ఐడీఎఫ్ 29 పథకం కింద రూ.191.38 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప గురువారం భూమి పూజ నెరవేర్చారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ నిర్మాణ కేంద్రం నిధులు రూ.4 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. జిల్లా కలెక్టర్‌తో చర్చించి కూరగాయల వ్యాపారులు మార్కెట్ లోపల కార్యకలాపాలు సాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీఎంసీలో స్వచ్ఛతను కాపాడుతామన్నారు. మున్సిపల్ మాజీ అధ్యక్షుడు నింగప్ప గుజ్జల్, బసవరాజ్ దేవరమణి, నామినేటెడ్ సభ్యులు కన్నీష్ కమలాపూర్, ఏపీఎంసీ కార్యదర్శి సిద్ధరామయ్య స్వామి, వ్యవసాయ మార్కెట్ ఏతతఈ సుదర్శన్, వ్యాపారులు పాల్గొన్నారు.

సవదత్తికి రైలు మార్గం నిర్మించండి

- కేంద్ర మంత్రికి ఎంపీ జగదీశ్ శెట్టర్ వినతి

హుబ్లీ: బెళగావి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సవదత్తి శ్రీరేణుకా యల్లమ్మ దేవి దేవస్థానానికి వచ్చే భక్తులకు అనుకూలం కోసం సవదత్తి పట్టణానికి రైలు మార్గం నిర్మించాలని బెళగావి ఎంపీ జగదీశ్ శెట్టర్ ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి యల్లప్ప దేవి మందిరానికి ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు వస్తారు. ఇక్కడికి రావడానికి కేవలం రోడ్డు మార్గం మాత్రమే ఉన్నందు వల్ల ఆ మార్గమంతా వాహనాల సంచారంతో రద్దీ ఎక్కువై భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల ఈ ప్రాంతంలో నూతన రైలు మార్గం నిర్మించాలని కోరారు. అలాగే 2016 మహదాయి యోజన అమలు కోసం హుబ్లీ రైల్వే స్టేషన్‌లో రైలు రోకో చేపట్టిన వందలాది మంది రైతులపై అక్కడి పోలీసులు దాఖలు చేసిన కేసులను ఎత్తివేయాలని కూడా శెట్టర్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు అంశాల గురించి పరిశీలిస్తానని రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ హామీ ఇచ్చారు. కాగా ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వీ.సోమణ్ణ కూడా ఉన్నట్లు జగదీశ్ శెట్టర్ ఆప్త వర్గాలు తెలిపారు.

సీఎంపై విపక్షాల కుట్ర తగదు


మాట్లాడుతున్న శ్రీదేవి నాయక్

రాయచూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను సీఎం పదవి నుంచి దించడానికి రాష్ట్ర గవర్నర్ రాజ్‌భవన్‌ను బీజేపీ, జేడీఎస్‌లు పావుగా వాడుకుని కుట్రలు పన్నడం తగదని కేపీసీసీ మహిళా కమిటీ ఆరోపించింది. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఉపాధ్యక్షురాలు శ్రీదేవి నాయక్ మాట్లాడారు. ముడా, వాల్మీకి మండలి కుంభకోణాల్లో రూ.కోట్లాది మేర అక్రమాలు, అవినీతి చోటు చేసుకుందన్నారు. రెండు పార్టీలు రాష్ట్ర గవర్నర్‌ను అడ్డం పెట్టుకొని ప్రాసిక్యూషన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయడానికి తీసుకున్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలన్నారు. విలేఖర్ల సమావేశంలో ప్రేమలత, మంజుల, శశికళ, వందనలున్నారు.